అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 18-09-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 260 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



బై బై గణేశా

గ్రేటర్‌లో కన్నుల పండుగగా నిమజ్జనం

శోభాయాత్రలో వేలాదిమందిగా పాల్గొన్న ప్రజలు

7 గంటలు సాగిన ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర

జనసంద్రమైన సాగర్ పరిసర ప్రాంతాలు

పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం మంగళవారం వైభవంగా ఘనంగా జరిగింది. నవరాత్రులు పూజలందుకున్న గణనాథులు జనం నీరాజనాల మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి ప్రారంభమైన నిమజ్జన సందడి బుధవారం వరకు కొనసాగనుంది. నిమజ్జనం సందర్భంగా సెలవు కావడంతో తరలి వచ్చిన భారీ జన సందోహంతో రహదారులు కిక్కిరిసిపోయాయి. ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతాలు ఇసుక వేస్తే రానంత జనంతో నిండిపోయాయి. గణపతి బప్పా మోరియా, జై బోలో గణపతి మహారాజ్.. నినాదాలతో పరి సరాలు హోరెత్తాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వైవిధ్య భరితమైన గణ పతి విగ్రహాలతో పాటు ఖైరతాబాద్ శ్రీసప్తముఖ మహాశక్తి గణపతి శోభా యాత్ర, నిమజ్జన వేడుకలు అద్యంతం కన్నుల పండువగా సాగాయి. బ్యాండ్ బాజా, డప్పు చప్పుళ్లతో సందర్శకులు డ్యాన్సులు చేస్తూ వేలాది వినాయక విగ్రహాలను హుస్సేన్ సాగర్‌కు తరలించారు. అలాగే పలు ...5లో

బాలాపూర్ లడ్డూ రూ.30 లక్షలు

వేలంలో కొలను శంకర్‌రెడ్డి సొంతం

వివరాలు 13లో



అమరులకు నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఫాం హౌజ్ ముఖ్యమంత్రిని కాదు..

ప్రజల సీఎంను

ఎన్ని అడ్డంకులొచ్చినా హైడ్రా ఆగదు

43 లక్షల మందికి రూ.500లకే వంట గ్యాస్

ఉచిత బస్సు ప్రయాణంతో 87 కోట్ల మందికి లబ్ది

ఈ ఏడాది 4,50,000 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

డిసెంబర్ 9న తెలంగాణతల్లి విగ్రహం ఆవిష్కరణ

సెప్టెంబర్ 17 ఒక చారిత్రక ఘట్టం, దానిని వివాదాస్పదం చేయడం తగదు : ప్రజాపాలన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

సాయుధ పోరాటయోధులకు ఘన నివాళులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"నేను ఫాం హౌజ్ ముఖ్యమంత్రిని కాదు. ప్రజల కోసం పని చేసే ముఖ్యమంత్రిని. ఎన్ని అడ్డంకులొచ్చినా హైడ్రా ఆగదు. తెలంగాణ అంటేనే త్యాగం. ఆ త్యాగాల పునాదుల మీదనే రాష్ట్రం ఏర్పడింది. కాని కొంత మంది తెలంగాణను సొంత జాగీరులా భావించి విధ్వంసం చేశారు. పదేండ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు. ఎన్నికల ముందిచ్చిన మాట ప్రకారం ఆర్థిక స్వావలంబన, సాంస్కృతిక పునర్జీవం వైపు తెలంగాణను నడిపిస్తున్నాం. బానిస సంకెళ్ల నుంచి నేడు తెలంగాణ విముక్తి పొందిన దినం. కాని దీన్ని కూడా వివాదం చేసే ప్రయత్నాన్ని కొంతమంది చేస్తున్నారు" అని సీఎం రేవంత్ రెడ్డి ...13లో

ఎన్ని అడ్డంకులెదురైనా హైడ్రా ఆగదు

"తెలంగాణ ఫ్యూచర్ స్టేట్‌గా మాత్రమే కాదు. క్లీన్ స్టేట్‌గా కూడా ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే హైడ్రాను ఏర్పాటు చేశాం. ఒకప్పుడు లేక్ సిటీగా పేరొందిన హైదరాబాద్, నేడు ఫ్లడ్స్ సిటీగా మారి పోయింది. చెరువులు, నాలాలు కాపాడు కోకపోతే భవిష్యత్ తరాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇటీవల కేరళలో ప్రకృతి విలయ ...13లో



అనుమతి లేకుండా

కూల్చివేతలొద్దు

సుప్రీం తాత్కాలిక ఆదేశాలు | **అక్టోబరు 1న తదుపరి విచారణ**

న్యూఢిల్లీ : తమ స్పష్టమైన అనుమతి లేకుండా దేశంలో ఎక్కడా కూడా ఎలాంటి కూల్చివేతలు చేపట్టరాదని సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే పబ్లిక్ రోడ్‌లపై, ఫుట్‌పాత్‌లపై, రైల్వే లైన్‌లపై, నీటి వనరుల వద్ద ఆక్రమణలకు ఈ ఆదేశాలను వర్తింపచేయరాదని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. వివిధ నేరాల్లో నిందితులుగా వున్న వ్యక్తుల ఇళ్లను కూల్చివేస్తూ అధికారులు ఈ బుల్డోజర్ చర్యలు తీసుకోవడాన్ని సవాలు ...3లో

సీబీఐ రిపోర్టు షాకింగే

ఆ వివరాలను బయటపెడితే కేసుపై ప్రభావం

కోల్‌కతా అభయ కేసులో సుప్రీం కోర్టు 3లో..

ఎర్రజెండా రాజ్యం వస్తేనే

బతుకుల్లో మార్పు

వీర తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించడం సిగ్గుచేటు: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, సికార్ ఎంపీ అమ్రారాం

సాయుధ పోరాట స్ఫూర్తితోనే మోడీ నల్ల చట్టాలు రద్దు

నవతెలంగాణ-జనగామ

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితోనే దేశంలో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను పార్లమెంటులో రద్దు చేయించగలిగామని సికార్ ఎంపీ, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, రైతు ఉద్యమ నేత అమ్రారాం తెలిపారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట పక్షోత్సవాల ముగింపు సభను జనగామ పట్టణంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని క్రిస్టియన్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా, నెహ్రూ పార్కు మీదుగా ధర్మ కొండల్ రెడ్డి గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కోలాటాలు, డప్పు చప్పులతో ఉత్తేజపూరితంగా సాగిన మహా ప్రదర్శన.. ఆటపాటలతో ముందుకు సాగింది. అనంతరం సభా స్థలి వద్ద కామ్రేడ్ సీతారాం ఏచూరి ...13లో



జనగామా సభలో సీపీఐ(ఎం) సికార్ ఎంపీ అమ్రారాం,రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్, జిల్లా కార్యదర్శి కనకారెడ్డి తదితరులు, భారీ ర్యాలీ...



ఎల్‌జీతో అతిశి, కేజ్రీవాల్

ఢిల్లీ సీఎంగా అతిశి

ఆప్ శాసనసభాపక్షం నిర్ణయం

ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్

ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రి, మూడో మహిళా ముఖ్యమంత్రిగా మార్లెనా

వారం రోజుల్లో ప్రమాణస్వీకారం

26, 27 తేదీల్లో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు, బలనిరూపణ

నవతెలంగా-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా అతిశి మార్లెనా పేరును ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఖరారు చేసింది. సీఎల్పీ నేతగా ఆమెను ఆప్ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం అతిశికి ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించాలని కేజ్రీవాల్ నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో ఆప్ సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎల్పీ నేతగా అతిశి పేరును ...3లో

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా

రాణి కుముదిని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ రాణి కుముదిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మంగళవారం ఈ మేరకు జీవో 62ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ డి.ఎస్. జారీ చేశారు. ఆమె మూడేండ్ల పాటు ఆ పదవిలో ఉండనున్నారు. ఆమె గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల కార్యదర్శిగా, ఎన్ఎఫ్‌డీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా, ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శిగా, కార్మిక, హార్టికల్చర్ శాఖల కమిషనర్‌గా, గృహనిర్మాణ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.కొంతకాలం కేంద్ర సర్వీసులో వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రెటరీగా కూడా పనిచేశారు.

రాజకీయాల కోసం

సెప్టెంబర్ 17కు వక్రీకరణ

పాలనే లేదంటే ప్రజాపాలన దినోత్సవమా? : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చరిత్ర తెలియని కొంత మంది తమ రాజకీయాల కోసం సెప్టెంబర్ 17ను వక్రీకరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పాలనే ...5లో

అయోధ్యలో రామ రామ..

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సామూహిక లైంగికదాడి

యువతికి న్యాయం చేయాలి :

పోలీసుల నిర్లక్ష్యంపై రాజకీయ పార్టీల ఆందోళన



లక్నో: అయోధ్య రాముడి గుడిలోనే దుండగులు బరితెగించారు. అయోధ్యలోని రామజన్మ భూమి గుడి కాంప్లెక్స్‌లో పనిచేసే ఒక యువతిపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఇలా ఒక్కసారి కాదు మూడుసార్లు అఘాయిత్యం జరిగిందని ఆ యువతి పోలీసులు దృష్టికి తెచ్చింది. కేసు నమోదు ...13లో

సాయుధ పోరాట చరిత్రను

వక్రీకరిస్తున్న బీజేపీ



- ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతం?
- పోరాటానికా... తెలంగాణ విలీనానికా : సీఎం రేవంత్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ప్రశ్న
- విలీన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్
- మఖ్దూంభవన్‌లో సాయుధ రైతాంగ పోరాట వారోత్సవ వేడుకలు

వివరాలు 6లో

సాయుధ పోరుకు

సారథులు-వారసులు కమ్యూనిస్టులే

చరిత్ర వక్రీకరణలను తిప్పికొట్టాలి

హన్మకొండ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/సయీంనగర్/విలేకరులు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వార్షికోత్సవ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మకొండలోని ఏకశిలా పార్క్ వద్ద ఉన్న సాయుధ పోరాట యోధులు రాను నాయక్ విగ్రహానికి తమ్మినేని పూలమాల వేశారు. అనంతరం గిరిజన భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అధ్యక్షతన జరిగిన సభలో తమ్మినేని మాట్లాడారు. వీరవనిత ఐలమ్మ వర్ధంతి సెప్టెంబర్ 10 నుంచి నిజాం సంస్థానం భారతదేశంలో విలీనం అయిన సెప్టెంబర్ 17 వరకూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు జరపాలన్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపును జయప్రదం చేసిన ప్రజలు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. నాయకులు సృష్టిస్తే పోరాటం రాదని, పేదల కడుపు మండితే పోరాటం వస్తుందన్నారు. అలాంటి పేదలైన చిట్యాల ఐలమ్మ, దొడ్డి కొమరయ్య సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. నిజాం ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఖాసీం రజ్వీ ఏర్పాటు చేసిన రజాకర్ల ప్రయివేటు సైన్యం.. పేదలపై దాడులు చేసినపుడు, వారి మాన, ప్రాణాలతో చెలగాటమాడటంతో ...14లో



మాట్లాడుతున్న తమ్మినేని

పేదలకు భూములు పంచిన ఘనత ఎర్ర జెండాదే : జాన్ వెస్లీ

పేదలకు భూములు పంచిన ఘనత ఎర్రజెండాదేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలో సీపీఐ(ఎం) కార్యాలయంలో మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో జాన్‌వెస్లీ పాల్గొన్నారు. ముందుగా సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి, ఐలమ్మ, లక్ష్మీ దేవమ్మ, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, నరసింహ చిత్రపటాలకి జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్‌తో పాటు జాన్‌వెస్లీ పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీర తెలంగాణ సాయుధ పోరాటంలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి ఎలాంటి పాత్ర లేదన్నారు. కానీ ఈ పోరాటాన్ని వక్రీకరించి విమోచనా ...14లో

జమ్మూకాశ్మీర్‌లో

నేడు తొలి దశ పోలింగ్

10 ఏండ్ల తరువాత అసెంబ్లీ ఎన్నికలు

24 అసెంబ్లీ స్థానాలు..
23 లక్షల మంది ఓటర్లు

శ్రీనగర్: సుమారు 10 ఏండ్ల తరువాత జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఏడు జిల్లాల్లో తొలి దశ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 24 స్థానాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది. నేటి పోలింగ్‌లో 23 లక్షల ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనుండగా, 219 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో 90 మంది స్వతంత్ర్య అభ్యర్థులు ఉన్నారు. బుధవారం ఎన్నికల జరిగే జిల్లాల్లో మూడు జిల్లాలు (8 అసెంబ్లీ స్థానాలు) జమ్ము ప్రాంతంలోనూ, నాలుగు జిల్లాలు (16 అసెంబ్లీ స్థానాలు) కాశ్మీర్ లోయలోనూ ఉన్నాయి. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత జమ్మూకాశ్మీర్ అసెంబ్లీకి జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలపై దేశం దృష్టి ఉంది.



మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రెండో దశ ఈ నెల 25న జరగనుంది. ఎన్నికల సంఘం సమాచారం ప్రకారం తొలి దశలో 23,27,580 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 11,76,462 మంది పురుషులు, 11,51,058 మంది మహిళా ఓటర్లు. 60 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. 1.23 లక్షల మంది ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తొలి దశ కోసం 3,276 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 14 వేల మంది పోలింగ్ స్టాఫ్‌ను నియమించారు. తొలి దశ ఎన్నికల కోసం ...13లో

జర్నలిస్ట్ సూర్యప్రకాశ్ వైద్య ఖర్చులకు మంత్రి దామోదర రూ.లక్ష సాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీలోని మ్యాక్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్ట్ కేవీఎస్ఎస్ఎస్ ప్రకాశ్‌కు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అండగా నిలిచారు. ప్రకాశ్ చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. మంత్రి సూచన మేరకు ఈ మొత్తాన్ని ప్రకాశ్ బ్యాంక్ అకౌంట్‌కు పంపిస్తున్నామని ఆయన కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఢిల్లీలో సాక్షి పత్రిక జర్నలిస్టుగా పని చేస్తున్న ప్రకాశ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో, 4 రోజుల క్రితం ఢిల్లీలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. ఢిల్లీ, హైదరాబాద్‌లో పని చేస్తున్న పలువురు జర్నలిస్టులు మంత్రి దామోదర దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఢిల్లీలో పని చేస్తున్న పలువురు రిపోర్టర్లతో మంగళవారం మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ప్రసాద్ త్వరగా కోలుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆయన చికిత్స కోసం తాను వ్యక్తిగతంగా రూ.లక్ష సాయం చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అండగా ఉంటుందనీ, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాలను సమస్యను కూడా ఇటీవలే పరిష్కరించామని మంత్రి గుర్తు చేశారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ కింద జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

ఇక అమెరికా కాలేజీల్లో నిరసనలు, ఆందోళనలు క్లిష్టతరం

- కొత్త ఆంక్షలను, విధానాలను తీసుకువచ్చిన వర్సిటీలు



శాక్రమెంటో : అమెరికా యూనివర్సిటీల్లో నిరసన కార్యకలాపాలను నియంత్రిస్తూ అనేక విశ్వవిద్యాలయాలు కొత్త విధానాలను అమలు చేస్తున్నాయి. దీనివల్ల అటు విద్యార్థులు, ఇటు ఫ్యాకల్టీ ఇరు పక్షాలపై ప్రభావం వుంటుందని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. శిబిరాల ఏర్పాటుపై నిషేధాలు, ఎక్కడ, ఎప్పుడు, ఎలా ప్రదర్శనలు జరిగినా వాటిపై తీవ్రమైన ఆంక్షలు, విద్యార్థి సంఘాల రద్దుతో సహా కొత్తగా అనేక పాలనాపరమైన విధానాలను తీసుకువచ్చారు. వీటిని ఉల్లంఘించినట్లైతే కఠిన చర్యలు వుంటాయని స్పష్టం చేశాయి. ఉదాహరణకు చూసినట్లైతే, వెస్టర్న్ రిజర్వ్ యూనివర్శిటీలో నిరసనలు చేపట్టాలంటే ఇకపై పాలకవర్గం అనుమతి తప్పనిసరి. రూట్‌గర్స్ యూనివర్సిటీలో కూడా ఆందోళనకారులు ముందుగా అనుమతులు తీసుకోవాల్సి వుంటుంది. రాత్రి 11గంటల నుండి ఉదయం 6గంటల వరకు నిరసనలను ఇండియానా యూనివర్సిటీ నిషేధించింది. శిబిరాలనుఏర్పాటు చేయడం, గుర్తింపు తెలియకుండా మాస్క్‌లు ధరించడాన్ని కాలిఫోర్నియా వర్సిటీ నిషేధించింది. మొత్తంగా 33 కేంపస్‌ల్లోనూ ఇది అమలవుతుంది. యూదువాదాన్ని విమర్శించడాన్ని నిషేధిస్తూ కొత్త విద్యార్థి ప్రవర్తనా నియమావళి విధానాలను తీసుకువస్తూ న్యూయార్క్ వర్సిటీ వివాదాస్పద చర్య తీసుకుంది. స్ప్రింగ్ సెమిస్టర్ సమయంలో అమెరికా వ్యాప్తంగా పాలస్తీనా అనుకూల ఆందోళనలు, నిరసనలు తలెత్తడంతో ఈ మార్పులను వర్సిటీలు చేపట్టాయి.

10 రోజుల తరువాత మణిపూర్‌లో విద్యాసంస్థలు ప్రారంభం

ఇంఫాల్ : దాదాపు 10 రోజుల విరామం తరువాత మణిపూర్‌లో విద్యాసంస్థలు మంగళవారం పునఃప్రారంభమయ్యాయి. ఈ నెల 7న జరిగిన రాకెట్ దాడుల్లో ఒకరి మృతి, అనేక మంది గాయపడిన తరువాత నుంచి రాష్ట్రంలో మూడు జిల్లాలో కర్ఫ్యూ విధించడంలో పాటు విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలల పునఃప్రారంభానికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (పాఠశాలలు), ఉన్నత-సాంకేతిక విద్యా శాఖ సోమవారం రాత్రి జారీ చేసింది. అలాగే ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ, తౌబాల్ జిల్లాల్లో మంగళవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కర్ఫ్యూ సడలిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో విద్యాసంస్థలను మంగళవారం నుంచి పునఃప్రారంభించారు.

ఎన్ఈపీని అమలు చేసే ఆలోచన విరమించుకోవాలి

విద్యామంత్రి లేక ఆ వ్యవస్థ అస్తవ్యస్తం

- సమస్యల వలయంలో సంక్షేమ వసతి గృహాలు
- స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 27న చలో హైదరాబాద్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతన విద్యా విధానం (ఎన్ఈపీ-2020)ని రాష్ట్రంలో అమలు చేసే ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో సమస్యల వలయంలో సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలున్నాయని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సరిపోయినంత మంది అధ్యాపకుల్లేక ప్రయివేటు కాలేజీలకు విద్యార్థులు వెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ కౌన్సెలింగ్ ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్నదనీ, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో రాష్ట్రంలో మెడికల్ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలనీ, మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.8,254 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బీఆర్ఎస్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పాలన సాగిస్తున్నదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా విద్యారంగ సమస్యలపై సమీక్ష చేయకపోవడం వల్ల ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న పరిస్థితి ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని పేర్కొన్నారు. అద్దెభవనాల్లో నడుస్తున్న గురుకులాలకు తక్షణమే సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలనీ, వీసీలను నియమించాలని కోరారు. విద్యారంగం, విద్యార్థుల డిమాండ్ల సాధన కోసం ఈనెల 27న 'చలో హైదరాబాద్' 'విద్యార్థి మహాగర్జన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

డీమ్డ్, ప్రయివేటు వర్సిటీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌లో సగం సీట్లు కన్వీనర్ కోటాలోకి?

- రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు రూపకల్పన
- నేడు మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ప్రయివేటు విశ్వవిద్యాలయాల పేరుతో ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్లకు గండి కొట్టే ప్రయత్నాన్ని అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వాటికి అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో సగం సీట్లను కన్వీనర్ కోటాలోకి తెచ్చేలా కొత్త నిబంధనలు రూపొందించాలని భావిస్తున్నది. ఈ అంశంపై తనకు నివేదిక ఇవ్వాలంటూ వైద్య విద్యాశాఖ, కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గతంలోనే ఆదేశించారు. ఇదే అంశంపై అధికారులతో బుధవారం మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. మల్లారెడ్డి మెడికల్, డెంటల్ కాలేజీలకు ఇటీవలే యూజీసీ డీమ్డ్ విశ్వవిద్యాలయంగా అనుమతులు ఇచ్చింది. దీనివల్ల కన్వీనర్ కోటాలోకి రావాల్సిన 200 ఎంబీబీఎస్ సీట్లు, వంద బీడీఎస్ సీట్లు యాజమాన్య కోటాలోకి మారిపోయాయి. అపోలో, సీఎంఆర్ సహ మరో నాలుగు మెడికల్ కాలేజీలు కూడా డీమ్డ్ విశ్వవిద్యాలయం హోదా కోసం యూజీసీ వద్ద ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ కాలేజీలకు కూడా యూజీసీ నుంచి అనుమతులు వస్తే, సుమారు మరో 450 ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్లు యాజమాన్య కోటాలోకి వెళ్లిపోయే ప్రమాదమున్నది. దీంతో నీట్‌లో మంచి మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. మల్లారెడ్డి కాలేజీకి అనుబంధంగా ఉన్న టీచింగ్ హాస్పిటల్‌కు ఆరోగ్యశ్రీ ఎంప్యానల్‌మెంట్ రద్దు చేయాలని మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు రెండ్రోజుల క్రితమే ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను కలిసి వినతి పత్రం కూడా అందజేశారు. ఆరోగ్యశ్రీ ఎంప్యానల్‌మెంట్ రద్దు చేస్తే, ఆయా హాస్పిటళ్లకు వెళ్లే పేషెంట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. టీచింగ్ హాస్పిటళ్లకు సరిపడా పేషెంట్లు రాకపోతే, ఆయా కాలేజీల అనుమతులను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) రద్దు చేసే అవకాశముంటుంది.

ఎన్‌వోసీ లేకుండానే అనుమతి

మెడికల్ కాలేజీలకు యూజీసీకి అసలు సంబంధం ఉండదని, కాలేజీల అనుమతులు, పర్యవేక్షణ వ్యవహారాలన్నీ నేషనల్ మెడికల్ కమిషనే చూస్తుందని మెడికల్ విద్య అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఏదైనా మెడికల్ కాలేజీ డీమ్డ్ హోదా కోసం దరఖాస్తు చేసుకుంటే, ఆ కాలేజీ అప్పటికే అనుబంధంగా విశ్వవిద్యాలయం నుంచి నిరభ్యంతర సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) తప్పనిసరిగా ఉండాలని యూజీసీ నిబంధనలు చెబుతున్నాయి. మల్లారెడ్డి కాలేజీలకు అసలు తాము ఎన్‌వోసీ ఇవ్వనేలేదనీ, అది లేకుండానే డీమ్డ్ హోదా తెచ్చుకున్నారని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు వివరించారు.

ఇది నిబంధనలకు విరుద్ధమంటున్నారు. అలాగే ఫీజుల విషయంలో ఎన్ఎంసీ నుంచి స్పష్టమైన మార్గదర్శకా లున్నాయనీ, 50 శాతం సీట్లకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులనే వసూలు చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కానీ, ఈ నిబంధనలేవీ మల్లారెడ్డి కాలేజీ పాటించకపోవడం గమనార్హం. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమనీ, విద్యార్థులు ఎవరైనా ఈ విషయంలో కోర్టుకు వెళ్తే మల్లారెడ్డి కాలేజీల్లో ప్రవేశాలు ఆగిపోతాయని అధికారులంటున్నారు.

సింగరేణి సీబీటీ రిజల్ట్స్ విడుదల

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో 272 ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం ఈ ఏడాది జులై 20, 21వ తేదీల్లో జరిగిన కంప్యూటర్ ఆధారిత పరీక్షల (సీబీటీ) ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్టు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. దీనికి సంబంధించి అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును https://scclmines.com వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

సీఎం సహాయనిధికి ఏపీజీవీబీ రూ.65 లక్షల విరాళం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరద బాధితుల సహాయం కోసం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సిబ్బంది ముఖ్య మంత్రి సహాయ నిధికి రూ. 65 లక్షలు విరాళంగా అందించారు. బ్యాంకు చైర్మెన్ కె. ప్రతాప రెడ్డి, ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మక్కడ్ చైర్మెన్ సెక్రెటరీ ఆర్. యశ్వంత్ సీఎం.రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కలిసి చెక్కును అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి అండగా నిలిచినందుకు ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు.

బీఆర్ఎస్ సర్కారు చేసిన అప్పులు ఇప్పుడు భారంగా మారాయి

- వడ్డీని పూర్తిగా లేదా పాక్షికంగా తగ్గించండి
- కేంద్ర ప్రభుత్వ రంగ ద్రవ్య సంస్థలను ఒప్పించండి : కేంద్ర ప్రభుత్వానికి ఉత్తమ్ విజ్ఞప్తి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్ర ఆర్థికభారంగా మారాయని రాష్ట్ర భారీనీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అప్పుపై విధించిన వడ్డీని పూర్తిగా లేదా పాక్షికంగా తగ్గించేలా కేంద్రప్రభుత్వరంగ ద్రవ్య సంస్థలను ఒప్పించేలా చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వీలైతే మొత్తంగా క్లియర్ చేయాలనీ లేదా పాక్షికంగానైనా మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం న్యూఢిల్లీలోని భారత మండపంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఇంటర్నేషనల్ ఎనిమిదోవ వాటర్ వీక్ సదస్సు-2024'కు ఆయన హాజరయ్యారు. నాలుగు రోజులపాటు జరగనున్న సదస్సును భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. సదస్సులో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ నీటి రంగానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని వివరించారు. ప్రతియేటా సుమారు ఆరు లక్షల ఎకరాల మేర కొత్త ఆయకట్టును సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో రూ. 29 వేల కోట్లను ఈ రంగానికి కేటాయించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కృషికి తోడుగా కేంద్రం నుంచి తగిన సహాయ, సహకారాలు అందించాలని కోరారు. దేశంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను పెంపొందించేందుకు లక్షల కోట్లు కేటాయిస్తామంటూ కేంద్రం పార్లమెంటులో ప్రకటించారో, అదేవిధంగా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం కోసం అదే స్థాయిలో కేటాయించాలని మంత్రి కోరారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధుల రూపంలో సాయం అందడంతోపాటు వివిధ రకాల అనుమతులను కూడా త్వరితగతిన ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పలు సాగునీటి ప్రాజెక్టులకు ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు తరపున సాఫ్ట్ లోన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమ్మక్క-సారలమ్మ ఇరిగేషన్ ప్రాజెక్టులో కొంత ముంపు భాగం చత్తీస్‌గఢ్ రాష్ట్ర పరిధిలో ఉన్నదనీ, దీన్ని పూర్తి చేసేందుకు ఆ రాష్ట్రం నుంచి ఎన్ఓవో రావాల్సి ఉన్నదనీ, ఆ ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా ఆ రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి కేదార్ కశ్యప్‌తో చర్చించినట్టు పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. సదస్సులో 40 దేశాల నుంచి ప్రతినిధులతోపాటు మన దేశంలోని 20 రాష్ట్రాలకు చెందిన ఇరిగేషన్ మంత్రులు, ఎన్జీవో సంస్థల ప్రతినిధులు, నిపుణులు, పాలసీ మేకర్స్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్‌కు మార్గం సుగమమం

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

- 80 కోట్ల మందికి ఐదు కేజీల బియ్యం ఇవ్వడాన్ని ఐదేండ్లకు పెంచాం
- వందరోజుల మోడీ 3.0 పాలనలో ఎంతో చేసి చూపెట్టాం : కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికసిత భారత్ దిశగా మార్గం సుగమమం చేస్తున్నామనీ, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. మోడీ పాలనకు వందరోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 80 కోట్ల మందికి ప్రతినెలా ఐదు కేజీల బియ్యం ఇవ్వడాన్ని మరో ఐదేండ్లకు పెంచామని గర్వంగా చెప్పారు. మోడీ 3.0 వంద రోజుల పాలనలో ఎంతో చేసి చూపెట్టామన్నారు. రైతులకు ఎమ్ఎస్‌పీ పెంచి గిట్టుబాటు ధర దక్కేలా చేశామని తెలిపారు. మహిళా సంక్షేమంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ప్రపంచంలోనే భారత్‌ను తయారీ రంగ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. దేశంలో 12 ఇండస్ట్రీయల్ స్మార్ట్ సిటీలను ప్రకటిస్తే అందులో తెలంగాణకు చెందిన జహీరాబాద్ కూడా ఉందనీ, దీని ద్వారా జహీరాబాద్‌కు పదివేల కోట్ల రూపాయలు పెట్టుబడులు రావడంతో పాటు 1.74 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ముద్ర రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచామని తెలిపారు. దేశంలో కొత్తగా 8 కొత్త రైల్వే లైన్లకు ఆమోదం లభించగా అందులో తెలంగాణకు చెందిన ఒక లైన్ ఉందని చెప్పారు. తాజాగా పది వందేభారత్ రైళ్లను ప్రారంభించగా తెలంగాణకు రెండు వచ్చాయన్నారు. నలంద విశ్వవిద్యాలయానికి కొత్త క్యాంపస్‌ను కట్టి జాతికి ప్రధాని మోడీ అంకితం చేశారని తెలిపారు. 70 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల వర్తించేలా ఆయుష్మాన్ భారత్ కార్డులను ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. క్యాన్సర్ మెడిసిన్‌పై కస్టమ్ డ్యూటీ ఎత్తేశామని చెప్పారు. వైద్యరంగం అభివృద్ధి కోసం రూ.50 వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. దేశంలో మరో 75 వేల మెడికల్ సీట్లను పెంచబోతున్నట్టు ప్రకటించారు. యువతను క్రీడలవైపు ఆకర్షించేందుకు కీర్తి పథకాన్ని తీసుకొస్తున్నామన్నారు. కోటి మంది యువతకు 500 బహుళజాతి కంపెనీల్లో ఇంటర్‌షిప్ చేసే అవకాశం కల్పించేలా ఎంఓయూ జరిగిందని తెలిపారు. దేశంలో పరీక్షా పత్రాల లీకేజీని అరికట్టడానికి ప్రత్యేక చట్టం తెచ్చామని చెప్పారు. మహిళల పేరుతో ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయిస్తే స్టాంప్ డ్యూటీ తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశామనీ, బీజేపీ పాలిత రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని వివరించారు. పీఎంఎవై కింద మూడు కోట్ల ఇండ్లు కటిస్తామన్నారు. 63 వేల ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యాన్ని పెట్టుకుని ముందుకుసాగుతున్నామని తెలిపారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల నిర్వహణలో లోపాలను సవరించేందుకు ప్రత్యేక బిల్లు రూపొందించామన్నారు. టూరిజం శాఖలో మహిళలను ప్రోత్సహిస్తామన్నారు. యూపీఎస్ ద్వారా ఉద్యోగులకు ఎంతో మేలు జరుగబోతున్నదన్నారు.

పశ్చిమ బెంగాల్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ తొలగింపు

- మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కూడా

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ఆరోగ్య సర్వీసుల డైరెక్టర్(డిహెచ్ఎస్) దేవశిష్ హల్దార్‌ను, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(డిఎంఇ) కౌస్తవ్ నాయక్‌ను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తొలగించింది. వారి స్థానంలో కొత్త ఇన్‌చార్జిలుగా వరుసగా డాక్టర్ స్వప్న సోరెన్, డాక్టర్ సుపర్ణ దత్తాలను నియమించింది. సోమవారం రాత్రి ఆందోళన చేస్తున్న డాక్టర్లతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చర్చలు జరిపిన నేపథ్యంలో వారిని తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అలాగే కోల్‌కతా కొత్త పోలీసు కమిషనర్‌గా మనోజ్ కుమార్ వర్మను నియమించారు. ప్రస్తుతమున్న వినీత్ గోయల్ స్థానంలో వర్మ కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తారు. కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను తొలగించాలన్నది విద్యార్థుల ఐదు డిమాండ్లలో ఒకటిగా వుంది. ఆందోళన చేస్తున్న డాక్టర్లు తిరిగి విధుల్లో చేరితే

ఢిల్లీ సీఎంగా అతిశి

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ అధినేత కేజ్రీవాల్ ప్రతిపాదించగా ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ మేరకు శాసనసభా పక్ష నేతగా అతిశి ఎన్నికయ్యారు. మరోవైపు ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. తన మంత్రి వర్గ సహచరులతో కలిసి కేజ్రీవాల్ ఎల్‌జీని కలిశారు. ఆప్ శాసనసభా పక్ష నేతగా మంత్రి అతిశిని ఎన్నుకున్నట్టు లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఆయన తెలిపారు. ఆయన వారసురాలిగా పార్టీ ఎంపిక చేసిన ఆప్ నేత అతిశి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆమె విజ్ఞప్తి చేసింది.

ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కేజ్రీ

లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసి అతిశిని కొత్త ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నట్టు ప్రకటించటంతో పాటు, కేజ్రీవాల్ రాజీనామాను అందించారు. వారం రోజుల్లో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసుకోనున్నట్టు ఆప్ తెలిపింది. అనంతరం ఎల్‌జీ మాట్లాడుతూ అతిశి ప్రమాణ స్వీకారం అయ్యే వరకు కేజ్రీవాల్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. కాగా, ప్రమాణ స్వీకారం అనంతరం ఈ నెల 26, 27 తేదీల్లో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో ఆమె బలనిరూపణ చేసుకోనున్నారు.

ఆప్‌తోనే సాధ్యం : అతిశి

సీఎంగా ఎన్నికైన తరువాత అతిశి తొలిసారి మీడియాతో మాట్లాడారు. ముందుగా తనకు సీఎంగా అవకాశం కల్పించినందుకు కేజ్రీవాల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాను ఢిల్లీ ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తానని అన్నారు. 'నేను వేరే పార్టీలో ఉండి ఉంటే.. బహుశా నాకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ కూడా దక్కేది కాదు. కానీ కేజ్రీవాల్ నాపై ఎంతో నమ్మకంతో నన్ను ఎమ్మెల్యేను, మంత్రిని చేశారు. ఈరోజు ముఖ్యమంత్రి బాధ్యతలు ఇచ్చారు. ఇలాంటిది ఆమ్ ఆద్మీ పార్టీలో మాత్రమే సాధ్యమవుతుంది. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నాకు ఇంతటి అవకాశం కల్పించిన కేజ్రీవాల్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయను' అని అతిశి తెలిపారు. ఢిల్లీకి ఒకే ఒక్క ముఖ్యమంత్రి ఉన్నారని, అది అరవింద్ కేజ్రీవాలే అని ఆమె అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆప్ అధినేతను తిరిగి ఎన్నుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఢిల్లీ ప్రజలు, ఆప్ ఎమ్మెల్యేలు, తాను ఆ లక్ష్యంతో పని చేస్తామన్నారు. కేజ్రీవాల్‌పై తప్పుడు కేసులు నమోదు చేసి ఆరు నెలల పాటు కటకటాల పాలు చేశారని బీజేపీపై అతిశి మండిపడ్డారు. కేజ్రీవాల్ తప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలచే లక్ష్యంగా పెట్టుకున్నారని అతిషి ఆరోపించారు. "సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడమే కాకుండా కేంద్ర చేతులో దర్యాప్తు సంస్థల పంజరంలోని చిలుక కాకూడదని పేర్కొంది" అని ఆమె గుర్తు చేశారు. "అది వేరే నాయకుడైతే, వారు ముఖ్యమంత్రి కుర్చీని వీడేవారు కాదని, కానీ కేజ్రీవాల్ ప్రజాకోర్టుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆయన రాజీనామా చేశారు. ఇది మాకు బాధాకరమైన క్షణం" అని అన్నారు. త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామని ప్రజలు ప్రతిజ్ఞ చేశారని ఆమె తెలిపారు. ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ "మేము తామ నిర్ణయం గురించి ఎల్‌జీకి తెలియజేసాం. ప్రభుత్వ ఏర్పాటుకు అతిశి లేఖ సమర్పించారు. ప్రమాణ స్వీకారానికి తేదీని నిర్ణయించాలని మేము ఎల్‌జీని అభ్యర్థించాం" అని పేర్కొన్నారు.

ఆప్ ప్రభుత్వంలో అతిశి కీలక పాత్ర

కేజ్రీవాల్ జైలులో ఉన్న సమయంలో పార్టీ కీలక బాధ్యతలు నిర్వహించిన అతిశి, అన్నీ తానై పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ బాధ్యతలను చక్కదిద్దారు. ప్రభుత్వంలోని మొత్తం 14 విభాగాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆమె, క్యాబినెట్ మంత్రుల్లో అత్యధిక విభాగాలను కూడా చూస్తున్నారు. విద్య, ఆర్థికం, ప్రణాళిక, పీడబ్ల్యూడీ, వాటర్, పవర్, పౌర సంబంధాలు వంటి కీలక శాఖలను నిర్వహిస్తున్నారు. ఎడ్యుకేషన్‌పై వేసిన స్టాండింగ్ కమిటీకి ఆమె చైర్ పర్సన్‌గానూ పనిచేశారు. ఢిల్లీలో పాఠశాలల్లో విద్య వ్యవస్థను మెరుగుపరచడానికి ఆప్ ప్రభుత్వం చేసిన కృషిలో కీలకంగా వ్యవహరించారు. కల్కాజీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆమె ప్రస్తుతం కొనసాగుతున్నారు. అంతేకాకుండా ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యురాలిగా ఉన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీశ్ సిసోడియా అరెస్ట్ అయ్యాక ఆమె మంత్రి అయ్యారు. సీఎం కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా జైలులో ఉన్నప్పుడు పార్టీని నడిపించారు. ఆగస్టు 15న ఢిల్లీ ప్రభుత్వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేందుకు అతిశిని కేజ్రీవాల్ ఎంచుకున్నారు. విద్యా శాఖ మంత్రిగా దేశ రాజధాని ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. అలాగే ఢిల్లీలో మంచి నీటి ఇబ్బందులు ఏర్పడినప్పుడు జలవనరుల శాఖ మంత్రిగా అతిశి, నీటి విడుదల కోసం కేంద్రంలోని బీజేపీతో పాటు, పక్కనున్న హర్యానాలోని బీజేపీ ప్రభుత్వంతో యుద్ధమే చేశారు.

ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రి... మూడో మహిళా ముఖ్యమంత్రి

అతిశి ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రిగా, మూడో మహిళ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టనున్నారు. అంతేకాకుండా 43 ఏండ్ల అతిశి అతి పిన్న వయస్కురాలైన ముఖ్యమంత్రిగా ఉండనున్నారు. కాంగ్రెస్‌కు చెందిన షీలా దీక్షిత్, బీజేపీకి చెందిన సుష్మా స్వరాజ్‌ల తరువాత ఢిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రి పదవి అతిశికి దక్కింది. దేశంలో ప్రస్తుతం మహిళ ముఖ్యమంత్రిగా పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ఒక్కరే ఉన్నారు. ఇప్పుడు అతిశితో దేశంలో ఇద్దరు మహిళా ముఖ్యమంత్రులు కానున్నారు.

మార్క్స్, లెనిన్ పేర్లతో అతిశి పూర్తి పేరు

అతిశి పూర్తి పేరు.. అతిశి మార్లెనా సింగ్. 1981 జూన్ 8న న్యూఢిల్లీలో జన్మించింది. ఆమె తల్లిదండ్రులు విజయ్ సింగ్, తృప్త వాహీ. వీరిద్దరు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు ఆమెకు మార్క్స్, లెనిన్ పేర్ల కలయితో 'మార్లేనా' అనే పేరు పెట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు, 2018లో ఆమె "అతిశి"ని తన పేరు మార్చుకున్నారు. అప్పటి నుంచి ఆమె అతిశి మార్లేనాగా ఉన్నారు. న్యూఢిల్లీ పూసా రోడ్డులోని స్ప్రింగ్ డేల్ హైస్కూల్‌లో చదువుకున్నారు. 2001లో ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి చరిత్రలో బ్యాచిలర్ డిగ్రీని అందుకున్నారు. అనంతరం ఇంగ్లాండ్ వెళ్లి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చేరి, చెవెనింగ్ స్కాలర్‌షిప్ అందుకున్నారు. 2003లో చరిత్రలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. ఆ తరువాత 2005లో రోడ్స్ స్కాలర్‌తో ఆక్స్‌ఫర్డ్‌లోని మాగ్డలెన్ కాలేజీకి అతిశి హాజరయ్యారు.

బీజేపీ ఆశలు గల్లంతే?

జమ్మూకాశ్మీర్‌లో పాతిక సీట్లు కూడా కష్టమే

- అంతర్గత కుమ్ములాటలతో సతమతం
- హిందూ ఓట్లకూ ఎసరు

శ్రీనగర్ : 2014లో శాసనసభ ఎన్నికలు జరిగినప్పుడు జమ్మూకాశ్మీర్ ఓ రాష్ట్రం. 2019లో బీజేపీ జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదాను రద్దు చేసింది. జమ్ము కాశ్మీర్... రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. లఢక్‌కు శాసనసభ లేదు. రాబోయే ఎన్నికల కోసం జాతీయ, ప్రాంతీయ పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. మారిన భౌగోళిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అధికారాన్ని చేజిక్కించుకొని హిందూ ముఖ్యమంత్రిని నియమించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది.



బీజేపీకి 43 స్థానాలు చాలు

జమ్మూకాశ్మీర్ శాసనసభలో 90 స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 46 స్థానాలు అవసరం. మారిన ఎన్నికల చిత్రపటం కారణంగా జమ్మూకు అదనంగా ఆరు, కాశ్మీర్‌కు ఒక స్థానం వచ్చాయి. అంటే హిందువుల ప్రాబల్యం అధికంగా ఉన్న స్థానాల సంఖ్య 24 నుంచి 31కి పెరిగింది. అదే బీజేపీ ఆశలకు కారణమవుతోంది. సవరించిన చట్టాల ప్రకారం ఐదుగురు సభ్యులను నామినేట్ చేసుకోవచ్చు. ఇది కూడా బీజేపీకి అందివచ్చిన వరమే. వారికి ఓటింగ్ హక్కు కూడా ఉంటుంది. ఒకవేళ మెజారిటీకి కొన్ని స్థానాలు తగ్గినప్పటికీ నామినేటెడ్ సభ్యుల మద్దతుతో కుర్చీపై కూర్చోవాలని కమలదళం భావిస్తోంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే ఇతర పార్టీలకు 46 స్థానాలు అవసరం కానీ బీజేపీకి 43 ఉంటే చాలు. లెఫ్టినెంట్ గవర్నర్ నియమించే సభ్యులు ఎలాగూ బీజేపీకే ఓటేస్తారు.

పాతిక కూడా కష్టమే

అయితే పరిస్థితులు బీజేపీ అనుకునేంత ఆశా జనకంగా ఏమీ లేవు. ఆర్టికల్ 370 రద్దుతో ఆర్థిక పరిస్థితులు తల్లకిందులయ్యాయి. నిరుద్యోగం పెరిగింది. హిందూ ప్రాంతంలో కూడా బీజేపీకి గతంలో ఉన్న ఆదరణ కన్పించడం లేదు. 43 స్థానాల సంగతి దేవుడెరుగు... కనీసం పాతిక సీట్లు రావడం కూడా గగనమేనని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. దీంతో ముస్లింల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఓట్లు చీలి తనకు లాభిస్తుందని బీజేపీ దింపుడు కళ్లం ఆశలు పెట్టుకుంది. అక్కడ బీజేపీకి ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి ఐక్యత ఆశించిన స్థాయిలో లేదు. కాంగ్రెస్ పార్టీ ఐదు స్థానాల్లో సొంతగా అభ్యర్థులను నిలిపింది. వీటిలో నాలుగు జమ్మూలోనే ఉన్నాయి. స్నేహపూర్వక పోటీ అని చెబుతున్నప్పటికీ అది కూటమికి ఇబ్బందేనని చెప్పాలి. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, పీడీపీ తదితర పార్టీల మధ్య ఓట్లు చీలి ముస్లింల ప్రాబల్యం అధికంగా ఉన్న చెనాబ్ లోయలోని దోహా, భండర్‌వా స్థానాలు తన ఖాతాలో పడతాయని బీజేపీ లెక్కలేసుకుంటోంది.

జమ్మూలో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

జమ్మూ ప్రాంతంలో బీజేపీ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్సే. ఈ ప్రాంతంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ల శాతం మెరుగుపడింది. 2014 శాసనసభ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు కాంగ్రెస్ అక్కడ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని అంటున్నారు. కాగా అంతర్గత కుమ్ములాటల కారణంగా జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ విజయావకాశాలు దెబ్బతినే అవకాశాలు కన్పిస్తున్నాయి. సీనియర్ నేతలను కాదని బీజేపీ కొత్త ముఖాలకు అవకాశం ఇచ్చింది. అభ్యర్థుల జాబితాను మార్చి కార్యకర్తల ఆగ్రహానికి గురైంది. ప్రచారంలో బీజేపీ వెనుకబడిపోయిందని పరిశీలకుల అంచనా. ఆ పార్టీ కేవలం ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కేడర్ పైనే ఆశలు పెట్టుకుంది. హిందువుల ఓట్లు తనకు గంపగుత్తగా పడతాయని ఆశిస్తోంది.

కాశ్మీర్ లోయలో ఏం జరుగుతోంది?

ఇప్పుడు కాశ్మీర్ లోయలో అసాధారణ ఎన్నికల ఉత్సుకత కన్పిస్తోంది. ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి, బీజేపీ, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, అప్నీ పార్టీ మధ్య పోరు సాగుతోంది. 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకొని బలహీనపడినప్పటికీ పీడీపీ ప్రభావాన్ని తోసిపుచ్చలేము. కాశ్మీర్ లోయలో చిన్నా చితకా పార్టీల అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు. స్వతంత్రులు సరేసరి. ఇంజినీర్ రషీద్‌కు చెందిన అవామీ ఇత్తెహాద్ పార్టీ 40 మంది అభ్యర్థులను స్వతంత్రులుగా నిలబెట్టింది.

జమాతే ఇస్లామీ 12 మంది స్వతంత్రులకు మద్దతు ఇస్తోంది. ఇంజినీర్ రషీద్ జైలు నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఉత్తర కాశ్మీర్‌లో ఎన్‌సీ నేత ఒమర్ అబ్దుల్లాను మట్టికరిపించారు. పీపుల్స్ కాన్ఫరెన్స్, అప్నీ పార్టీ ప్రభావం పెద్దగా కన్పించకపోయినా కొన్ని నియోజకవర్గాల్లో ఫలితాలను ప్రభావితం చేయగలవు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న కొన్ని చిన్న చిన్న పార్టీలు సొంతంగా కొందరు అభ్యర్థులను బరిలో దింపాయి. రషీద్ పార్టీకి కొన్ని గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపడం గమనార్హం.

బీజేపీతో కలిస్తే అంతే

ఏదేమైనా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 43 స్థానాలను గెలుచుకోవడం బీజేపీకి కష్టమేనని చెప్పాలి. అప్పుడు కాశ్మీర్ పార్టీల మద్దతుపై ఆధారపడాల్సి వస్తుంది. అయితే ఏ కాశ్మీర్ పార్టీ కూడా బీజేపీకి స్నేహహస్తం అందించడం లేదు. బీజేపీతో చేయి కలిపితే ఆశాభంగం తప్పదని ప్రాంతీయ పార్టీలకు తెలుసు. 2014లో ఆ పార్టీతో పొత్తు పెట్టుకొన్న పీడీపీ చావుదెబ్బలు తిన్నది. పీపుల్స్ కాన్ఫరెన్స్, అప్నీ పార్టీ, గులాం నబీ ఆజాద్ నేతృత్వంలోని డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ కూడా వివిధ సందర్భాల్లో బీజేపీతో అంటకాగి దెబ్బతిన్నాయి. వాటిపై బీజేపీకి బీ-టీమ్ అనే ముద్ర పడింది.

సీబీఐ రిపోర్టు షాకింగే!

ఆ వివరాలను బయటపెడితే కేసుపై ప్రభావం
వాస్తవాలను వెలికితీయడమే దర్యాప్తు లక్ష్యం
సీబీఐ నిద్ర పోవట్లేదు
నిజాన్ని వెలికితీసేందుకు కొంత సమయమివ్వాలి
కోల్‌కతా అభయ కేసులో సుప్రీంకోర్టు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీబీఐ రిపోర్టులో తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే విషయాలే ఉన్నాయని, అయితే ఆ వివరాలను బయటపెడితే, దర్యాప్తుపై ప్రభావం పడొచ్చని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకున్న కలకత్తాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ జూనియర్ డాక్టర్ అభయ హత్యాచారం కేసును మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ నిద్ర పోవటం లేదని, నిజాన్ని వెలికితీసేందుకు వారికి కొంత సమయం ఇవ్వాలని పేర్కొంది. అలాగే బాధితురాలి ఫొటో, పేరును వికీపీడియా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవలాని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించారు.

సుప్రీం ఆదేశాల మేరకు సీబీఐ కేసుకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును ధర్మాసనానికి సమర్పించింది. ఆ రిపోర్టులో పేర్కొన్న విషయాలు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించాయని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు గుర్తించిన వివరాలను బయటపెట్టడం వల్ల దర్యాప్తుపై ప్రభావం పడొచ్చని భావించింది. వాస్తవాలను వెలికితీయడం దర్యాప్తు లక్ష్యమని స్పష్టం చేసింది. ప్రిన్సిపల్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)ను అరెస్టు చేశారని, దర్యాప్తు పూర్తి అయ్యే వరకు వేచి చూద్దామని తెలిపింది. ఘటన జరిగిన ఐదు రోజుల తరువాత సీబీఐకి కేసు అప్పగించడం వల్ల పలు సవాళ్లు ఎదురవుతున్నాయని, కేసులో పురోగతి పరిమితంగా ఉందని సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్ అన్నారు.

హాస్పిటల్ ఆర్థిక అవకతవకలపై దర్యాప్తుకు సంబంధించి రిపోర్టును సమర్పించాలని సీబీఐకి ఆదేశించింది. ఈ సందర్భంగా కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారం అంశంపై బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేయాలని కోరారు. ఇలాంటి కేసులను ప్రత్యక్ష ప్రసారం చేసినప్పుడు అది కేసుపై ప్రభావాన్ని చూపుతుందన్నారు. తాము నిందితులకు ప్రాతినిథ్యం వహించడం లేదని, ఆస్పత్రికి 50 ఏండ్ల రెప్యుటేషన్ ఉందని అన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఇది ఓపెన్ కోర్టు అని, ఇది ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశమని తెలిపింది. కపిల్ సిబల్ స్పందిస్తూ ఇది తమ ప్రతిష్టకు సంబంధించిందని అన్నారు. ఛాంబర్‌లోని మహిళా న్యాయవాదులకు యాసిడ్ దాడి, లైంగికదాడి చేస్తామని బెదిరింపులు వస్తున్నాయని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదులకు సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయని సిబల్ ప్రస్తావించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాబట్టి విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని ఆపబోమని స్పష్టం చేసింది. లాయర్లు, ఇతరులకు ఏదైనా ముప్పు వాటిల్లితే చర్యలు తీసుకుంటామని సిబల్‌కు కోర్టు భరోసా ఇచ్చింది.

నైట్ షిఫ్ట్‌లో పని చేసే మహిళలను అడ్డుకోలేం

నైట్ షిఫ్ట్‌లో పనిచేసే మహిళలను అడ్డుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. రాత్రి పూట పని చేయకూడదని వాళ్లకు చెప్పలేమని పేర్కొంది. నైట్ షిఫ్ట్‌ల నుంచి మహిళా డాక్టర్లకు విముక్తి కల్పిస్తూ బెంగాల్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఆ ఘటన తరువాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత దృష్ట్యా మహిళా డాక్టర్లు నైట్ షిఫ్ట్ లేకుండా చూసుకోవాలంటూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ నోటిఫికేషన్‌ను వెంటనే సవరించాలని ఆదేశించింది. "రాత్రిపూట పనిచేయవద్దు అని మహిళలకు ఎలా చెబుతాం. వాళ్లకు మినహాయింపులు కాదు, సమాన అవకాశాలు కావాలి. అన్ని పరిస్థితుల్లోనూ పనిచేసేందుకు మహిళా డాక్టర్లు ఆసక్తిగా ఉన్నారు. వాళ్లు కచ్చితంగా అన్ని పరిస్థితుల్లో పనిచేయాలి. బెంగాల్ సర్కారు తమ నిర్ణయాన్ని సరి చేసుకోవాలి. 12 గంటల షిఫ్ట్‌ను దాటేసి మహిళలు పనిచేయరాదని చెప్పలేం. సైనిక దళాల్లో రాత్రి పూట పనిచేసే మహిళలు ఉన్నారు" అని ధర్మాసనం తెలిపింది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం మహిళా డాక్టర్లకు రక్షణ ఇచ్చేందుకు వెనుకాడితే, అప్పుడు కేంద్ర ప్రభుత్వం వాళ్లకు రక్షణ ఇస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. నైట్ షిఫ్ట్ విషయంలో సవరణ చేస్తూ కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని బెంగాల్ సర్కారు తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు.

అనుమతి లేకుండా కూల్చివేతలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను విచారించిన బెంచ్‌పై మేరకు తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది.

"ఈ కోర్టు అనుమతి లేకుండా తదుపరి విచారణ తేదీ వరకు ఎలాంటి కూల్చివేతలు జరగరాదు. అయితే బహిరంగ స్థలాలు, ఫుట్‌పాత్‌లు, వీధులు వంటి చోట్ల అనధికార నిర్మాణాల విషయంలో ఇలాంటివి వర్తించబోవు." అని కోర్టు ఆదేశించింది.

ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీని లక్ష్యంగా చేసుకుంటున్నారంటూ కథనాలు రూపొందిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు.

"బయట వచ్చే వార్తలు, కథనాలు మమ్మల్ని ప్రభావితం చేయవు. ఈ దశలో ఏ కమ్యూనిటీ లక్ష్యంగా అవుతోంది అనే ప్రశ్నల్లోకి వెళ్ళం. అక్రమ కూల్చివేతలు ఒక్కటి చోటు చేసుకున్నా అది రాజ్యాంగ విలువలకు విరుద్ధమే." అని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. అక్టోబరు 1వ తేదీకి విచారణను వాయిదా వేశారు.

నేరాలకు పాల్పడిన నిందితులను శిక్షించేందుకు అన్నట్టుగా వారి ఇళ్ళను కూల్చివేసే పద్ధతిని నియంత్రించేందుకు దేశవ్యాప్తంగా మార్గదర్శకాలను రూపొందించాలని భావిస్తున్నట్లు ఈ నెల 2వ తేదీన బెంచ్ పేర్కొంది. అయితే అదే సమయంలో అనధికార కట్టడాలు లేదా నిర్మాణాలను కాపాడరాదని నొక్కి చెప్పింది. ఇందుకు గానూ కొన్ని మార్గదర్శకాలు అవసరమవుతాయని, అప్పుడు కూల్చివేతలు కూడా చట్టానికి అనుగుణంగా జరుగుతాయని బెంచ్ పేర్కొంది.

కాగా యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ మాత్రం తన ప్రభుత్వం బుల్డోజర్లను ఉపయోగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే వున్నారు. 'అందరి చేతులు బుల్డోజరుపై సరిపోవు' అంటూ లక్నోలో జరిగిన ఒక అధికారికక కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యలు చేశారు. అలాగే యూపీ విద్యుత్ శాఖ మంత్రి ఎ.కె.శర్మ కూడా ప్రభుత్వం బుల్డోజర్లను ఉపయోగించడాన్ని సమర్ధిస్తున్నారు. గూండాయిజం, మాఫియా రాజ్‌ను తుడిచిపెట్టడానికిక ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఉపయోగించే సాధనమని వ్యాఖ్యానించారు.

కాగా ఈ వ్యాఖ్యలపై బెంచ్ తీవ్రంగా స్పందించింది. "సెప్టెంబరు 2 నాటి ఆదేశాలు తర్వాత, బుల్డోజరు న్యాయం కొనసాగుతుందని స్టేట్‌మెంట్‌లు వస్తున్నాయి." అని గవాయ్ అన్నారు. బుల్డోజర్ చర్యలను సమర్థిస్తూ ప్రకటనలు చేస్తున్నారు. మన దేశంలో ఇలా జరుగుతుందా? ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్ళిందా? దీనిపై మార్గదర్శకాలు రూపొందించాలి." అని జస్టిస్ విశ్వనాథన్ అన్నారు.

ఒక వ్యక్తి నేరానికి పాల్పడ్డాడని ఆ వ్యక్తి కుటుంబానికి చెందిన ఇళ్ళను కూల్చివేసేందుకు బుల్డోజరులను గుజరాత్ ప్రభుత్వ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు ఉపయోగించడాన్ని సెప్టెంబరు 12న త్రిసభ్య ధర్మాసనం తీవ్రంగా విమర్శించింది. నిందితుడి ఇంటిని కూల్చివేస్తామని బెదిరించడం చట్టబద్ధ పాలన గల దేశంలో ఊహించలేనిదని బెంచ్ పేర్కొంది. పిటిషనర్ జావేద్‌అలీ మెహబూమియా సయీద్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

ప్రజాపాలన దినోత్సవాల్లో జాతీయ జెండాల ఆవిష్కరణ


సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్


నల్లగొండ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో మంత్రి వెంకట్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో మంత్రులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో ఎక్సైజ్, ప్రొహిబిషన్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జెండాను ఎగురవేశారు.

పాల్గొన్న మంత్రులు, స్పీకర్, శాసన మండలి చైర్మెన్

నవతెలంగాణ -విలేకరులు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భువనగిరి కలెక్టరేట్‌లో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సూర్యాపేటలో బీసీ సంక్షేమ చైర్మెన్ నిరంజన్‌రెడ్డి జెండాను ఎగురవేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. వరంగల్ జిల్లాలోని ఓసిటి ఎదురుగా ఐడీఓసీ మైదానంలో జాతీయ పతాకాన్ని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

గ్రామాల్లో ఫైబర్ నెట్, సీసీ కెమెరాలు

పైలెట్ ప్రాజెక్టుగా మూడు గ్రామాల ఎంపిక : ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్ : ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా టీ-ఫైబర్ ద్వారా కేంద్రం సహకారంతో ప్రతి గ్రామానికీ సేవలందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచన మేరకు ఫైబర్ నెట్‌వర్క్ కోసం సంగారెడ్డి జిల్లా సంగుపేట, నారాయణపేట జిల్లా మద్దూరు, పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్టు తెలిపారు. అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ మూడు గ్రామాల్లో 360డిగ్రీస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించి సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు. రెండు నెలల్లో పైలెట్ ప్రాజెక్టు పూర్తి చేసి అక్కడ ఎదురయ్యే మంచి చెడులను, సాంకేతికపరమైన లోపాలను గుర్తించి ఎలాంటి సదుపాయాలు కల్పిస్తే నాణ్యమైన సేవలు లభిస్తాయో ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చి, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం వద్ద ఏర్పాటు చేస్తే తొలగిస్తామనడం సరికాదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా మెప్పు కోసమే రాజీవ్ విగ్రహాన్ని బీఆర్‌ఎస్ నేతలు తొలగిస్తామంటున్నారని ఆరోపించారు. దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గతంలో అప్పులు తెచ్చి దుబారా చేశారని, ఇప్పుడు వాటిని సద్వినియోగం చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. పదేండ్లుగా నిర్బంధంలో ఉన్నామన్నారు. ఎమ్మెల్యేల అనర్హత వేటు అనే అంశం శాసనసభ స్పీకర్ పరిధిలోనిదన్నారు. ఈ సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మెన్ కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఉన్నారు.


కరీంనగర్‌లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్


వరంగల్ ఐడీఓసీ మైదానంలో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్


ములుగు కలెక్టరేట్‌లో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క


మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు

కాకూడదు...సం'క్షామం'

సంపాదకీయం



'సంక్షేమం, అభివృద్ధి... ఈ రెండూ మా ప్రభుత్వానికి రెండు కండ్లు. వాటిని జోడెద్దుల్లాగా పరుగులు పెట్టిస్తాం...' సరిగ్గా 20 ఏండ్ల క్రితం కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి అన్న మాటలివి. తెలంగాణ ఏర్పడ్డాక దశాబ్ద కాలంపాటు అధికార పీఠానికి దూరంగా ఉన్న ఆ పార్టీని గద్దెమీద కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం తొమ్మిది నెలల క్రితం అవే మాటలను వల్లెవేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంక్షేమం, ప్రజా పాలనలో అందరి సమస్యలనూ పరిష్కరిస్తామంటూ ఆయన భరోసానిచ్చారు. ఆ మేరకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్ (ప్రగతి భవన్)తో పాటు జిల్లాల్లోనూ 'ప్రజావాణి' కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతి విదితమే. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించటం, వాటిని కంప్యూటరీకరించటం, మెసేజ్‌ల రూపంలో రశీదు (ఎక్‌నాలెడ్జ్‌మెంట్)లనివ్వటం వరకూ ఓకే.

కానీ ఆ తర్వాతే కథ ముందుకు సాగటం లేదని వినికిడి. రేషన్ కార్డులకు సంబంధించి తాజాగా ప్రభుత్వం ప్రకటించిన ఓ నిర్ణయమే అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రేవంత్ సర్కారు కొలువుదీరిన కొత్తలోనే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండర్ తదితరాంశాల కోసం నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన విషయం మనకు ఎరుకే. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి ద్వారా మొత్తం 55 వారాల్లో 5.30 లక్షల దరఖాస్తులు అందినట్టు సర్కార్ వెల్లడించింది. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ఆ కార్యక్రమానికి ఇప్పటి వరకూ 66 వేల అర్జీలు వచ్చాయన్నది అధికారిక వర్గాల లెక్క. వీటిలో అత్యధికం ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఉపాధి కల్పనకు సంబంధించినవే ఉండటం గమనార్హం. ఆయా దరఖాస్తుల్లో లక్షకు పైగా పెండింగ్‌లో ఉన్నాయనే విషయాన్ని అదే అధికారులు విడుదల చేసిన బులెటిన్ చెబుతోంది. పరిస్థితి ఈ విధంగా ఉన్నప్పుడు... ఉన్న దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా మీనమేషాలు లెక్కించటం విడ్డూరం. అక్టోబరులో రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభిస్తామంటూ మంత్రివర్గ ఉపసంఘం చెప్పటం మరీ హాస్యాస్పదం. అంటే ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులను ఇంతవరకూ చూడలేదా? చూసినా వాటిని ఏం చేయాలో తెలియలేదా? అనే సందేహాలు రాకమానవు. డిసెంబరు ఏడో తేదీ నాటికి కాంగ్రెస్ కొలువుదీరి ఏడాది పూర్తి కాబోతున్న స్థితిలో... ఇంకా కమిటీలు, కాలయాపనలు అంటే జనంలో విశ్వసనీయతను తమంతట తాము తగ్గించుకున్నట్టే.

> ఇప్పుడు రేవంత్ సర్కారు కూడా అదే రకమైన పోకడపోతే... ప్రజల్లో అసంతృప్తి పెరగటం ఖాయం. కేసీఆర్ జమానాతో పోలిస్తే రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతా వరణం, ఆందోళనలు చేసుకునే హక్కు, ప్రజా ప్రతినిధులను, ఇంకా చెప్పాలంటే సాక్షాత్తూ ముఖ్య మంత్రినే కలిసేందుకు అపాయింట్‌మెంట్లు దొరకటం హర్షించదగ్గ విషయాలే. కానీ ప్రజా ప్రతి నిధులను కలిసినంత ఈజీగా ప్రజల సమస్యలకు పరిష్కారాలు దొరక్కపోవటమే ఇబ్బంది కలిగిస్తోంది.

గత పదేండ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీ(టీ)ఆర్ఎస్... ఆ కాలంలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా పేదల సహనానికి పరీక్ష పెట్టింది. దీంతో ఆ కార్డు ప్రాతిపదికగా ఉన్న అనేక ప్రయోజనాలను వారు పొందలేకపోయారు. ఇప్పుడు రేవంత్ సర్కారు కూడా అదే రకమైన పోకడపోతే... ప్రజల్లో అసంతృప్తి పెరగటం ఖాయం. కేసీఆర్ జమానాతో పోలిస్తే రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణం, ఆందోళనలు చేసుకునే హక్కు, ప్రజా ప్రతినిధులను, ఇంకా చెప్పాలంటే సాక్షాత్తూ ముఖ్యమంత్రినే కలిసేందుకు అపాయింట్‌మెంట్లు దొరకటం హర్షించదగ్గ విషయాలే. కానీ ప్రజా ప్రతినిధులను కలిసినంత ఈజీగా ప్రజల సమస్యలకు పరిష్కారాలు దొరక్కపోవటమే ఇబ్బంది కలిగిస్తోంది. ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ కుర్చీని లాక్కుని, ఆ సీటు మీద తాను కూర్చోవాలన్నట్టు వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ చెప్పినంత తీవ్ర స్థాయిలో కాకపోయినా అనేకానేక సమస్యలు రాష్ట్రంలో పేరుకుపోయాయి.

గురుకులాల్లోని టీచర్లకు రెండు నెలలుగా వేతనాలు రాకపోవటం, పిల్లలకు నాణ్యమైన, పౌష్టికాహారం అందకపోవటం, మహిళల ఉచిత ప్రయాణానికి బస్సులు సరిపోకపోవటం, ఆస్పత్రుల్లో వైద్యులకు సరైన భద్రత లేకపోవటం, బదిలీల్లో సీనియర్లను జిల్లాలకు పంపించటం, అక్కడ సరైన మౌలిక వసతులు, సదుపాయాలు లేకపోవటం, 33 జీవో వల్ల వైద్య కళాశాలల్లో అడ్మిషన్లలో జాప్యం జరగటం వీటిలో ముఖ్యమైనవి. ఇవిగాకుండా రైతు రుణమాఫీ అసంపూర్ణం, రైతు భరోసా ఇంత వరకూ ఇవ్వకపోవటం, ఎన్నికల్లో హామీనిచ్చిన విధంగా సామాజిక పింఛన్లను పెంచకపోవటం, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం ముచ్చటే లేకపోవటం కూడా రేవంత్ సర్కార్‌ను అప్రదిష్ట పాల్జేస్తున్నాయి. ఇవన్నీ పేదలు, రైతులకు సంబంధించిన కీలకాంశాలు.. వారి సంక్షేమానికి చెందిన విషయాలు. ఆయా పథకాలు, కార్యక్రమాలను విస్మరిస్తే ఇబ్బందులు తప్పవనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తెరిగితే దానికే మంచిది.

అమెరికా ఎన్నికల్లో కమ్యూనిజం చర్చ!



ఎం కోటేశ్వరరావు
8331013288

నవంబరు ఐదవ తేదీన అమెరికాలో ఎన్నికలు సజావుగా జరుగుతాయా? తనకు ప్రతికూలంగా ఫలితం వస్తే డోనాల్డ్ ట్రంప్ అంగీకరిస్తాడా? గెలుపుకోసం ఎంతకైనా తెగిస్తాడా? ఇలా ఎన్నో ప్రశ్నలు, సందేహాల నడుమ ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో మరోసారి ట్రంప్ మీద హత్యాయత్నం జరిగిందని, దుండగుడిని పట్టుకున్నట్లు భద్రతా సిబ్బంది ప్రకటించారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో తన స్వంత మైదానంలో గోల్ఫ్ ఆడుతుండగా భద్రతా సిబ్బంది సమీపంలో ఉన్న పొదల్లో సాయుధ దుండగుడిని గమనించి కాల్పులు జరిపారు. దాంతో దుండగుడు రయన్ రౌత్ తన వద్ద ఉన్న ఎకె-47 మాదిరి తుపాకీ, మరికొన్ని వస్తువులను వదలి తన కారులో పారిపోగా 65 కిలోమీటర్ల తరువాత పట్టుకున్నట్లు చెబుతున్నారు. రౌత్ కాల్పులు జరిపాడా లేక పొదల్లో శబ్దాలకారణంగా అతని ఉనికిని గుర్తించి భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారా అన్నది వెంటనే స్పష్టం కాలేదు. అతని సామాజిక మాధ్యమ ఖాతాలను పరిశీలించగా డెమోక్రటిక్ పార్టీ అభిమాని అని తేలినట్లు చెప్పారు. అయితే అది వాస్తవం కాదని గత ఎన్నికల్లో ట్రంప్‌కు ఓటువేశాడని, తాజా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడిన భారతీయ మూలాలున్న వివేక్ రామస్వామి చివరి వరకు పార్టీ అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్ మీద పోటీలో ఉండాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినట్లు మరొక ప్రచారం. జూలై 13వ తేదీన జరిపిన కాల్పుల్లో ట్రంప్ కుడి చెవి తమ్మెకు గాయమైంది. భద్రతా సిబ్బంది వెంటనే దుండగుడిని పట్టుకొని కాల్చి చంపారు. భద్రతా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ రహస్య భద్రతా సిబ్బంది డైరెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ట్రంప్ మద్దతుదారైన ప్రపంచ ధనికుడు ఎలాన్ మస్క్ తాజా ఉదంతం మీద స్పందించిన తీరుకు నెటిజన్లు మండిపడుతున్నారు. హత్యాయత్నాలు అధ్యక్షుడు జోబైడెన్, పోటీలో ఉన్న కమలాహారిస్ మీద ఎందుకు జరగటం లేదు, ట్రంప్ మీదనే ఎందుకు అంటూ 'ఎక్స్' ద్వారా మస్క్ స్పందించాడు. ఇది అత్యంత బాధ్యతారహితం అని అనేక మంది గర్హించారు. ట్రంప్‌కు ఏమీ కానందుకు జో బైడెన్, కమలా హారిస్ ఊపిరి పీల్చుకున్నారు. సాధారణంగా అధ్యక్షులు గనుక గోల్ఫ్ ఆడితే ఆ మైదానం చుట్టూ భద్రతా సిబ్బంది వలయంగా ఏర్పడతారు. ట్రంప్ మాజీ గనుక అలాంటి రక్షణ కల్పించలేదని అధికారులు వివరణ ఇచ్చారు. అమెరికాలో హింసాకాండకు తావులేదని ఎక్స్‌లో కమల స్పందించారు. అమెతో జరిగిన సంవాదంలో ట్రంప్ వెనుకబడినట్లు సర్వేలు తేల్చిన తరువాతే ఈ ఉదంతం జరగటం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఒకవేళ ఓడితే ఫలితాన్ని డోనాల్డ్ ట్రంప్ అంగీకరిస్తాడా, గతంలో మాదిరే అనుచరులను రెచ్చగొట్టి దాడులకో మరొకదానికో పాల్పడతాడా? అన్న అనుమానాలు పెరుగుతున్నాయి. ఎన్నికలు జరిగే నవంబరు ఐదవ తేదీ దగ్గర పడేకొద్దీ అనూహ్యపరిణామాలు సంభవిస్తాయోమోనని భావిస్తున్నారు. జో బైడెన్ అధ్యక్ష అభ్యర్థిగా ఉన్న సమయంలో ట్రంప్ ముందంజలో ఉన్నాడు. తొలిసారి హత్యాయత్నం తరువాత ఆధిక్యత మరింత పెరిగి విజయం ఖాయం అనే వాతావరణం ఏర్పడింది. కమలాహారిస్ రంగ ప్రవేశంతో అదంతా తారుమారైంది. తీవ్రమైన పోటీ స్వల్ప ఆధిక్యంలో కమల ఉన్నట్లు సర్వేలు వెల్లడించాయి. సెప్టెంబరు పదవ తేదీన వారిద్దరి మధ్య జరిగిన సంవాదంలో ట్రంప్ తేలిపోయాడు. కొన్ని సర్వేలు కమల 23పాయింట్ల ఆధిక్యతతో ఉన్నట్లు పేర్కొన్నాయి. తరువాత జరిగిన మరికొన్ని సర్వేలలో కూడా ఆమెదే పైచేయిగా ఉంది.దాంతో తాను మరోసారి ఆమెతో బహిరంగ చర్చలో పాల్గొనాల్సిన అవసరం లేదని ట్రంప్ సంచలన ప్రకటన చేశాడు. దీంతో పోలింగ్‌కు ముందే ఓటమిని అంగీకరించి నట్లు కావటంతో మాటమార్చాడు. పిచ్చోడు ఎప్పుడేం మాట్లాడ తాడో ఏం చేస్తాడో తెలియదు, ట్రంపు కూడా అంతే. అక్టోబరులో జరిగే మరో రెండు చర్చల్లో పాల్గొనేదీ లేనిదీ చెప్పలేము. ఒక వేళ సిద్ధపడకపోతే పారిపోతున్నట్లుగానే ఓటర్లు భావిస్తారు.కమలతో సంవాదాన్ని నిర్వహించిన ఏబిసి సంస్థ వీక్షకుల అభిప్రాయాన్ని తారుమారు చేసిందని తానే ముందున్నట్లు ట్రంప్ ప్రకటించుకున్నాడు.గొప్ప చర్చ చేసినందుకుగాను ఓటర్లు తనకు మద్దతు ఇవ్వటం ప్రారంభించారని, సర్వేల్లో అదే వెల్లడైనా కుహనా మీడియా వాటిని వెల్లడించటం లేదు రిగ్గింగు చేసినట్లు స్వంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికలో రాసుకున్నాడు.

అమెరికా ఎన్నికల్లో మైలురాళ్లుగా చెప్పుకోవాల్సి వస్తే జూలై 15న రిపబ్లికన్ పార్టీ జాతీయ సమావేశం ట్రంప్‌ను, ఆగస్టు 19న కమలాహారిస్‌ను డెమోక్రటిక్ పార్టీ జాతీయ సమావేశం అభ్యర్థులుగా ఖరారు చేశాయి.సెప్టెంబరు పదిన ట్రంప్-కమల తొలి సంవాదం జరిగింది.నవంబరు ఐదున ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. జనవరి ఆరున ఫలితాలను నిర్ధారిస్తారు.జనవరి 20న నూతన అధ్యక్ష పాలన ప్రారంభం అవుతుంది. ప్రముఖులుగా ఉన్నవారు, ఓటర్లను ప్రభావితం చేసే వారు కొందరు ఎన్నికల్లో ఏదో ఒక పక్షాన్ని లేదా అభ్యర్థిని బలపరుస్తారు. ఎక్స్ అధిపతి, ప్రపంచంలోనే పెద్ద కుబేరుడు ఎలన్ మస్క్ ట్రంప్‌ను సమర్థిస్తున్నాడు. అదే విధంగా ప్రముఖ గాయని, నటి, రచయిత్రి టేలర్ స్విఫ్ట్ కమలా హారిస్‌ను బలపరుస్తున్నట్లు ప్రకటించింది. ఎలన్ మస్క్ సామాజిక మాధ్యమాల్లో ఉన్న అసహ్యకరమైన మనిషి అంటూ మస్క్ కుమార్తె వివియన్ జెనా విల్సన్ విరుచుకుపడింది.టేలర్ స్విఫ్ట్‌ను ఉద్దేశించి ఒక ఎక్స్ చేస్తూ " బాగుంది టేలర్..నేను నీకు ఒక బిడ్డను ఇస్తా, నా జీవితాతం నీ కుక్కలకు కాపలా కాస్తా " అని మస్క్ పేర్కొన్నాడు. అమెరికా ఎన్నికల ప్రచారం ఎంతలా దిగజారి ఉంటుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. టేలర్ వ్యతిరేకతను తట్టుకోలేని ట్రంప్ అందుకు తగిన మూల్యం చెల్లిస్తావంటూ బెదిరింపులకు పూనుకున్నాడు.

ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి పోటీలో లేకపోయినా కమ్యూనిజం, సోషలిజాల గురించి పెద్ద చర్చే నడుస్తున్నది. గతకొద్ది దశాబ్దాలుగా కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టిన కారణంగా అనేక మంది బుర్రల్లో అది రాయిలా గడ్డకట్టింది. తాను గెలవాలంటే పాతబడిన కమ్యూనిస్టు వ్యతిరేకతను ఒక అస్త్రంగా చేసుకోవాలని ట్రంప్ ఎంచుకున్నాడు.దానిలో భాగంగా 'కామ్రేడ్ కమల మన దేశానికి భయంకరమైన వ్యక్తి. అమె ఒక మార్క్సిస్టు లేదా కమ్యూనిస్టు, ఎప్పుడూ కమ్యూనిస్టుగానే ఉన్నారు, భవిష్యత్‌లో కూడా అలాగే ఉంటారు, ఎన్నుకుంటే అమెరికా చరిత్ర ముగిసినట్లే' అని న్యూయార్క్ ఎకనమిక్ క్లబ్ ప్రసంగంలో అన్నాడు. అమెరికా చరిత్రలో తొలిసారిగా ఒక ప్రధాన పార్టీ అభ్యర్థి, స్వేచ్ఛను తిరస్కరిస్తూ మార్క్సిజం, కమ్యూనిజం, ఫాసిజాలను అనుసరిస్తున్నారన్నాడు. ఆమె రూపంలో స్టాలిన్ జన్మించాడని చెప్పాడు. మౌలికంగా కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా ఆమె కమ్యూనిస్టు టోపీ, ఎర్ర కోటు ధరించినట్లు ఒకటి, ఇంకా కమ్యూనిస్టు అని చెప్పే రకరకాల చిత్రాలను సృష్టించి వైరల్ చేయించాడు. కమల అభ్యర్థిగా నిర్ణయంగాక ముందే డెమోక్రటిక్ పార్టీని దేవుడు లేడని చెప్పే కమ్యూనిస్టు అని వర్ణించాడు. మన ప్రత్యర్థిని ఒక కమ్యూనిస్టు,సోషలిస్టు లేదా అమెరికాను నాశనం చేసే మరోవ్యక్తిగా చిత్రించి ప్రచారం చేయాలని తన మద్దతుదార్లను బహిరంగంగానే కోరాడు.ఎలన్‌మస్క్ తన సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొడుతున్నాడు. సోవియట్ నాయకుల మాదిరి కమల బొమ్మలను సృష్టించాడు.ఆమెను తొలి రోజు నుంచే ఒక కమ్యూనిస్టు నియంతగా మార్చాడు. అమెరికన్ల ఆర్థిక స్వేచ్ఛను హరించేందుకు సిద్ధంగా ఉన్న ఒక సోషలిస్టు అంటూ వ్యాఖ్యలను జోడించి ప్రచారంలో పెట్టాడు.




> ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి పోటీలో లేకపోయినా కమ్యూనిజం, సోషలిజాల గురించి పెద్ద చర్చే నడుస్తున్నది. గతకొద్ది దశాబ్దాలుగా కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టిన కారణంగా అనేక మంది బుర్రల్లో అది రాయిలా గడ్డకట్టింది. తాను గెలవాలంటే పాతబడిన కమ్యూనిస్టు వ్యతిరేకతను ఒక అస్త్రంగా చేసుకోవాలని ట్రంప్ ఎంచుకున్నాడు.దానిలో భాగంగా 'కామ్రేడ్ కమల మన దేశానికి భయంకరమైన వ్యక్తి. అమె ఒక మార్క్సిస్టు లేదా కమ్యూనిస్టు, ఎప్పుడూ కమ్యూనిస్టుగానే ఉన్నారు, భవిష్యత్‌లో కూడా అలాగే ఉంటారు, ఎన్నుకుంటే అమెరికా చరిత్ర ముగిసినట్లే' అని న్యూయార్క్ ఎకనమిక్ క్లబ్ ప్రసంగంలో అన్నాడు. అమెరికా చరిత్రలో తొలిసారిగా ఒక ప్రధాన పార్టీ అభ్యర్థి, స్వేచ్ఛను తిరస్కరిస్తూ మార్క్సిజం, కమ్యూనిజం, ఫాసిజాలను అనుసరిస్తున్నారన్నాడు.

> కమలా హారిస్ కమ్యూనిస్టు కాదు, డెమోక్రటిక్ పార్టీలో ఉన్న ఉదారవాదుల్లో ఒకరు మాత్రమే. డెమోక్రటిక్ సోషలిస్టు నేత బెర్నీ శాండర్స్ కొన్ని అంశాలలో ఆమె వైఖరిని బట్టి పురోగామివాదిగా పరిగణిస్తున్నట్లు చెప్పాడు. అమెరికాలో గాడిద(డెమోక్రటిక్ పార్టీ)-ఏనుగు (రిపబ్లికన్ పార్టీ) గుర్తుల మీద ఎవరు పోటీ చేసినా రెండింటినీ బలపరిచే కార్పొరేట్లకు ఆమోదమైతేనే రంగంలో ఉంటారు. కమల కూడా అంతే. కమ్యూనిస్టు వ్యతిరేకులు ఏమి చెప్పినప్పటికీ కార్పొరేట్లకు ప్రాతినిధ్యం వహించే గోల్డ్‌మన్ శాచస్ సంస్థ ట్రంప్ కంటే కమల మెరుగని పేర్కొన్నది. ఆమె గెలిస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థకు శక్తి వస్తుందని, ట్రంప్ వస్తే దెబ్బతింటుందని చెప్పింది.

కమలా హారిస్ కమ్యూనిస్టు కాదు, డెమోక్రటిక్ పార్టీలో ఉన్న ఉదారవాదుల్లో ఒకరు మాత్రమే. డెమోక్రటిక్ సోషలిస్టు నేత బెర్నీ శాండర్స్ కొన్ని అంశాలలో ఆమె వైఖరిని బట్టి పురోగామివాదిగా పరిగణిస్తున్నట్లు చెప్పాడు. అమెరికాలో గాడిద(డెమోక్రటిక్ పార్టీ)-ఏనుగు (రిపబ్లికన్ పార్టీ) గుర్తుల మీద ఎవరు పోటీ చేసినా రెండింటినీ బలపరిచే కార్పొరేట్లకు ఆమోదమైతేనే రంగంలో ఉంటారు. కమల కూడా అంతే. కమ్యూనిస్టు వ్యతిరేకులు ఏమి చెప్పినప్పటికీ కార్పొరేట్లకు ప్రాతినిధ్యం వహించే గోల్డ్‌మన్ శాచస్ సంస్థ ట్రంప్ కంటే కమల మెరుగని పేర్కొన్నది. ఆమె గెలిస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థకు శక్తి వస్తుందని, ట్రంప్ వస్తే దెబ్బతింటుందని చెప్పింది. కమ్యూనిస్టు నియంత మెరుగని ప్రపంచంలోని అతి పెద్ద పెట్టుబడిదారులు ఎలా చెబుతున్నా రంటూ కొందరు గగ్గోలు పెడుతున్నారు. పెట్టుబడిదారుల చక్రవర్తి ట్రంప్ ఆర్థిక ప్రణాళిక ప్రకారం కమ్యూనిస్టు కామ్రేడ్ కమల చెబుతున్నదాని కంటే లోటు ఐదు రెట్లు పెరుగుతుందని తటస్థంగా ఉంటే పెన్ వార్టన్ బడ్జెట్ నమూనా నివేదిక చెప్పిందని ఒకరు పేర్కొన్నారు. ఇంతకీ కమల లేదా డెమోక్రటిక్ పార్టీ చెబుతున్నదేమిటి ? యాభైవేల డాలర్లతో ప్రారంభించే చిన్న అంకుర సంస్థలకు పన్ను రాయితీలను వర్తింపచేయటం, బడా సంస్థలకు పన్నులు పెంచటం, దీన్నే కమ్యూనిజం అంటున్నారు. స్కూలు పిల్లలకు ఉచితంగా మధ్యాహ్న భోజనం పెట్టటాన్ని కూడా సోషలిజం అని వర్ణించేబాపతు ఇలా చెప్పటంలో ఆశ్చర్యం ఏముంది?

వాషింగ్టన్ ఎగ్జామినర్ అనే మీడియాతో కమలాహారిస్ మాట్లాడిన అంశాలను రిపబ్లికన్లు కమ్యూనిజంగా వర్ణించటాన్ని పురోగామి మార్పు ప్రచార కమిటీ స్థాపకుల్లో ఒకరైన ఆడమ్ గ్రీన్ ఎద్దేవా చేశాడు. రానున్న వారాల్లో గుడ్ల ధర ఏడు నుంచి తొమ్మిది డాలర్లకు పెరగటాన్ని అడ్డుకుంటామని కమలా హారిస్ చెబుతున్నారు, మితవాదులు దాన్నే గనుక కమ్యూనిజం అంటే అత్యధిక అమెరికన్లు దాన్నే కోరుకుంటారు, మీరేం మాట్లాడుతున్నారో అర్ధమౌతోందా అని గ్రీన్ ప్రశ్నించాడు.ధరలను అదుపు చేయటాన్ని కూడా ట్రంప్ కమ్యూనిజంగా వర్ణించాడు. కరోనా కాలం నాటితో పోల్చితే ప్రస్తుతం అమెరికాలో ధరలు 20శాతం పెరిగాయి.నిజవేతనాలు గణనీయంగా పడిపోతున్నా యి. అందుకే బతుకు దుర్భరమౌతున్న కారణంగా అనేక మంది యువతకు సోషలిజం, కమ్యూనిజాల గురించి తెలియకపోయినా అదే కావాలని కోరుకుంటున్నారు. ట్రంప్ వంటి వారు చేసే విపరీత ప్రచారం వాటి గురించి ఆసక్తి పెంచేందుకు దోహదం చేస్తున్నదంటే అతిశయోక్తి కాదు. అందుకే పెట్టుబడిదారీ దేశాల్లో చేస్తున్న సర్వేల్లో యువతలో సోషలిజం పట్ల సానుకూలత వెల్లడి అవుతున్నది. అమెరికాలో డెమోక్రాట్లను కమ్యూనిస్టులని ప్రచారం చేయటం ఇదే మొదటి సారి కాదు. ఈ ఎన్నికల్లో అది మరింతగా పెరిగింది.



లాల్ సలామ్...

కాలపు సెలిమలో ఇంకిపోయిన
బడుగుల సముద్రమా
లాల్ సలామ్..
కాలపు తీరంలో కరిగిపోయిన
విప్లవ కెరటమా
లాల్ సలామ్..


కాలపు ప్రయాణంలో
ప్రగతి పథివై సాగిన మహానేతా
ప్రశ్నించే ప్రజల గొంతుక
లాల్ సలామ్..
ఎర్రజెండా సూర్యతేజమా
ఎజెండాను దేశమంతా చాటిన
కమ్యూనిజ భావసారమా
లాల్ సలామ్..

ప్రజల పొద్దై ప్రజాభిమాన ముద్దుయై
కాలపు సడిలో జ్ఞాపక చరితైన
ఏచూరి సీతారామా
లాల్ సలామ్..

రాజకీయ క్షేత్రంలో
ప్రజాస్వామ్య పంథాలో
మెరుగైన మేరుశిఖరమె..
ప్రతి హృదయ ఉత్తేజ కిరణమై
మానవత్వ ప్రతిమై
కల్మశంలేని కాంతి పుంజమై
భారత పుస్తకంలో ఏచూరి సీతారామై
ఓ గొప్ప ప్రజా ప్రస్థాన
కమ్యూనిజం కొండ
లాల్ సలామ్..
ఎన్నో గుండెల్లో చప్పుడై విలసిల్లిన
ఈ కమ్యూనిజం దిగ్గజమా
లాల్ సలామ్..

- అభిరామ్

మారింది ప్రభుత్వమే..విధానాలు కాదు



వి.ఎస్. రావు
9490098890

అధికారంలోకి రాగానే ఆర్టీసి బస్‌లలో మహిళలకు ఉచిత రవాణాను అనుమతిస్తామని కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానం నిలబెట్టుకున్నది. మహిళలకు ఉచిత ప్రయాణం మంచిదేనని, ఆర్టీసి నిలబడ్తుందని, మహిళలు రవాణాపై పెట్టే ఖర్చు ఇతర అవసరాలకు వాడుకొన్నందున రాష్ట్ర ఆర్థికాభివృద్ధి పెరుగుతుందని ఈ స్కీంను స్వాగతిస్తూ డిసెంబర్ 7న ఇదే పత్రికలో వ్యాసం రాశాము.

ఈ స్కీం అమలుకు అవసరమైన మౌలిక వనరులు, బస్‌లు, సిబ్బంది లేకపోయినా ప్రభుత్వం ప్రకటన చేసిన రెండు రోజులలోనే ఆర్టీసి అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రజల పట్ల ఆర్టీసి కార్మికులకు వున్న ప్రేమ, బాధ్యత అర్థమవుతుంది. ఈ స్కీం అమలు చేయబట్టి తొమ్మిది నెలలు గడిచింది. సెప్టెంబర్ పదోతేదీన గౌరవ ముఖ్యమంత్రి ఆర్టీసిపై సమీక్ష నిర్వహించారు.మహాలక్ష్మి స్కీం అమలు చేసిన నాటి నుండి సమీక్ష చేసిన నాటి వరకు 83.42 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, రూ.2840.71 కోట్లు మహిళల డబ్బు ఆదా అయిందని రవాణా మంత్రి తెలిపినట్లు పత్రికలలో వచ్చింది. ఆ డబ్బులలో ఆర్టీసికి ఎంత ఇచ్చారనేది అధికారులు కానీ, ప్రభుత్వం కాని ప్రకటన చేయలేదు. పై లెక్కలను పరిశీలిస్తే రోజుకి సగటు 31 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. ఇందుకుగాను రూ.11 కోట్లు ఆర్టీసి ఆదాయం కోల్పోతున్నది అని అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.ఆ బడ్జెట్‌లో ఆర్టీసికి రూ. 3084 కోట్లు కేటాయించింది. ఇదికాక ఎస్సీ, ఎస్టీ,సబ్‌ప్లాన్ నిధులు నుండి రూ.1000 కోట్లు ప్రతిపాదించిందు. బడ్జెట్‌లలో ప్రవేశపెట్టినవి యధాతథంగా అమలు చేసిన చరిత్ర లేదు. రివైజ్డ్ ఎస్టిమేషన్స్ పేరుతో కుదిస్తారు. చివరికి ఇచ్చేదెంతో తెలియదు. 3084 కోట్లు పూర్తిగా ఆర్టీసికి ఇస్తారని భావిస్తే కేవలం నెలకు 257 కోట్లు అవుతుంది. రోజుకి 8.5 కోట్లు, ఖర్చేమో 11 కోట్లు అవుతుంది. రోజుకి 2.5 కోట్లు ఆర్టీసి నష్టపోతుంది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లో ప్రతిపాదించిన నిధులను రవాణా శాఖ పద్దులలో చేర్చి చూపించలేదు కనుక అవి వస్తాయా?లేదా? అనేది వేచి చూడాలి.

విద్యార్థులకు, ఎన్.జి.ఓ లు, ఇతరులకు ఇస్తున్న రాయితీల విలువ సుమారు 600 కోట్లు వుంటుంది.దీనికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. అంటే రోజుకి 1.64 కోట్లు (ఆర్టీసి) ఆదాయం కోల్పోతుంది. ఆర్టీసీ బస్‌లలో ప్రయాణించే వారి దగ్గర నుండి ఐదు రకాల సెస్‌లను వసూలు చేస్తున్నారు. అయితే ఆ ఆదాయాన్ని రోజువారి లెక్కలలో చూపించడం లేదు. రోజుకి 31 లక్షల మంది ప్రయా ణిస్తున్న మహిళలకు సంబంధించిన సెస్‌ల డబ్బులు ప్రభుత్వం రీ-ఎంబర్స్ చేయాలి. ఇది కూడా సుమారు 600 కోట్లు వుంటుంది. రోజుకి 1.64 కోట్లు. ఈ మొత్తం పరిశీలించినప్పుడు బడ్జెట్‌లో పెట్టకుండా ఆర్టీసిపై పడుతున్న భారం (2.5 + 1.64+ 1.64) రోజుకి 5.78 కోట్లు. అంటే ఏడాదికి రూ.2110 కోట్లు ఆర్టీసిపై భారం పడుతున్నది. రూ.2110 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తుందా? లేదా? అనేది ముఖ్యమంత్రి సమీక్షలో స్పష్టత రాలేదు. ఆర్టీసీకి 6322 కోట్లు అప్పులు, లయబిలిటీస్ వున్నాయని, అప్పులు రీ స్ట్రక్చర్ చేసుకోవాలని, వడ్డీ భారం తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించినట్లు, దానిని అమలులోకి తెచ్చేందుకు ఒక కమిటీని వేసినట్లు వార్తల ద్వారా తెలుస్తున్నది.

మహాలక్ష్మి పథకం సమర్థవంతంగా అమలు జరగాలన్నా, నిజంగా అర్హులైన లబ్దిదారులు అందరూ ఈ పథకం ద్వారా ఉచిత ప్రయా ణం పొందాలంటే మరో 3వేల బస్‌లు కొత్త, పాత రూట్లలో ప్రవేశపెట్టాలి. డిసెంబర్ 2023 నాడు 35-40 లక్షలుగా వున్న ప్రయా ణీకుల సంఖ్య నేడు 55-60 లక్షలు వుంటుంది. అందులో 65శాతం వరకు మహాలక్ష్మిలు వుంటున్నారు. 3వేల బస్‌లు కొనుగోలుకు ప్రభుత్వం బడ్జెట్‌లో ఒక్క పైసా ఇవ్వలేదు. నిజం చెప్పాలంటే గడచిన నాలుగేండ్లలో గత ప్రభుత్వం కానీ, తొమ్మిది నెలలుగా పాలిస్తున్న కొత్త ప్రభుత్వం కానీ బస్‌ల కొనుగోలుకు నిధులివ్వలేదు. సరిపోయినన్ని బస్‌లు లేక ప్రయాణీకులు అవస్తలు పడుతున్నారు. దీనికితోడు పెరిగిన పనిభారంతో కార్మికులూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. రోజుకి 2-3 గంటలు డ్యూటీ లేటు కావడం, ఆధార్ పరిశీలించి టిక్కెట్లు ఇవ్వడం, టిమ్స్‌లోని లోపాల వల్ల సాధారణ టిక్కెట్లు బదులు జీరో టిక్కెట్లు రావడం, రద్దీలో వాటిని గమనించలేకపోతే పైఅధికారులు కేసులు రాసి ఇంటికి పంపడం, టిమ్స్ సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేయకపోవడం, వాటిపైన ఇచ్చిన వినతిపత్రాలు అధికారులు పట్టించుకోకపోవడం, ఇలా ప్రతిరోజూ కార్మికులు అనేక సమస్యలతో సహవాసం చేస్తున్నారు.



ప్రభుత్వం మారింది. పాలకులు మారారు. కానీ ఆర్టీసి పట్ల, ఆర్టీసి కార్మికుల పట్ల పాలకుల వైఖరి మారలేదు అనుకోవలసి వస్తున్నది. ఆర్టీసిని ప్రజా రవాణా సంస్థగా కాకుండా వ్యాపార సంస్థగా చూస్తున్నారు. ఆర్టీసికి ఇవ్వవలసిన రీ-ఎంబర్స్‌మెంట్లు కూడా పూర్తిగా బడ్జెట్‌లో పెట్టడంలేదు. పెట్టినా కూడా పూర్తిగా చెల్లించడం లేదు. ఆర్టీసికి వున్న అప్పులను ప్రభుత్వ పెట్టుబడిగా మార్చి భారం తగ్గించాలని అడుగు తుంటే 'రీ-స్ట్రక్చర్ చేసుకోండి' అంటున్నారు. గత ప్రభుత్వం 2018లో పదిమంది నిపుణులతో 'ఎక్స్‌పర్ట్ కమిటీ' వేసినా, నివేదికను ఇంత వరకు బహిర్గతం చేయలేదు. ఇప్పుడు ప్రభుత్వం సూచనతో మరో కమిటీని నియమిస్తున్నారు. కొత్తబస్సుల కొనుగోలు నిధులివ్వక పోవడ ంతో నేటికీ ప్రయాణికులకు కాలంచెల్లిన బస్సులే దిక్కవుతున్నాయి.వెంటనే వాటిని మార్చాలి, కానీ అందుకు నిధుల లేమి ఆటంకంగా వుంది.

బడ్జెట్‌లో రెండు శాతం నిధులు ఆర్టీసికి మూడేండ్లిస్తే ఆర్టీసి స్వతంత్రంగా నిలబడుతుందని కార్మిక సంఘాలు ఎప్పడినుంచో కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రజల అవసరాల మేరకు బస్‌లు పెంచడం, మంచి కండిషన్‌లో వున్న బస్‌లు కావాలనేది ప్రధానంగా ప్రబల సమస్య. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో ఆ అవసరం మరింత పెరిగింది. కానీ ఆ సమస్యను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పట్టించుకొనేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాల్సింది ప్రజలు, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్నవారు. ప్రభుత్వం సరైన పద్ధతిలో నిధులు కేటాయించకపోతే సంస్థ అభివృద్ధి కుంటుపడటమేకాక, మహాలక్ష్మి స్కీం లబ్ది కూడా కొద్దిమందికే పరిమితమయ్యే ప్రమాదం వుంది. ప్రజా ప్రభుత్వం అంటున్న ఈ ప్రభుత్వం కూడా ఆర్టీసి కార్మికోద్యమంపై ఆంక్షలు కొనసాగిస్తున్నది. ఎంప్లాయి వెల్ఫేర్ బోర్డులను తిరిగి కొత్తవారితో నింపుతున్నది. కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించక గత ప్రభుత్వం వలే వ్యవహరిస్తున్నది. సామాజిక భద్రత పథకాలైన పి.ఎఫ్., ఎస్.ఆర్.బి.ఎస్, ఎస్‌బిటి ట్రస్ట్‌లకు బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌ను నియమించకుండానే కాలం గడుపుతున్నది. ఆర్టీసి నిర్వహణలో కార్మిక సంఘాల భాగస్వామ్యం లేకుండా చేస్తున్నది. అలాగే కార్మికుల చేత నిర్వహించుకొంటున్న కో-ఆపరేటివ్ సొసైటీకి ఎన్నికలు జరిపేలా చర్యలూ తీసుకోవడం లేదు.

పై విషయాలన్ని గమనించినప్పుడు, మారింది పాలకులే తప్ప, ఆర్టీసి సంస్థ పట్ల పాలకుల వైఖరి మారలేదని అర్థమవుతుంది. ఈ సంస్థ ప్రజాసంస్థగా మనుగడ సాగించాలంటే, మహాలక్ష్మి పథక ప్రయోజనం అందరూ పొందాలంటే ప్రజలు, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు ఉమ్మడిగా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నం చేయాలి.అందుకు 12న జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఒక ప్రాతిపదకను ముందుకు తీసుకొచ్చింది. ఆ సమావేశం పిలుపుమేరకు ఈ నెల19న ఆర్టీసి కార్మికులు 'డిమాండ్స్ డే'ని పాటిసున్నారు. సమీప భవిష్యత్‌లో ఈ సమస్యల పరిష్కారానికి ప్రజలంతా కదలాలని, ఆర్టీసీని కాపాడుకోవాలని కోరుతు న్నాము.

> ప్రభుత్వం మారింది. పాలకులు మారారు. కానీ ఆర్టీసి పట్ల, ఆర్టీసి కార్మికుల పట్ల పాలకుల వైఖరి మారలేదు అనుకోవలసి వస్తున్నది. ఆర్టీసిని ప్రజా రవాణా సంస్థగా కాకుండా వ్యాపార సంస్థగా చూస్తున్నారు. ఆర్టీసికి ఇవ్వవలసిన రీ-ఎంబర్స్‌మెంట్లు కూడా పూర్తిగా బడ్జెట్‌లో పెట్టడంలేదు. పెట్టినా కూడా పూర్తిగా చెల్లించడం లేదు. ఆర్టీసికి వున్న అప్పులను ప్రభుత్వ పెట్టుబడిగా మార్చి భారం తగ్గించాలని అడుగు తుంటే 'రీ-స్ట్రక్చర్ చేసుకోండి' అంటున్నారు. గత ప్రభుత్వం 2018లో పదిమంది నిపుణులతో 'ఎక్స్‌పర్ట్ కమిటీ' వేసినా, నివేదికను ఇంత వరకు బహిర్గతం చేయలేదు. ఇప్పుడు ప్రభుత్వం సూచనతో మరో కమిటీని నియమిస్తున్నారు. కొత్తబస్సుల కొనుగోలు నిధులివ్వక పోవడ ంతో నేటికీ ప్రయాణికులకు కాలంచెల్లిన బస్సులే దిక్కవుతున్నాయి.



సన్నవడ్లకు రూ.500 బోనస్

- ఈ ఏడాది నుంచే రైతుకూలీలకు రూ.12వేలు
- అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ
- పంటల బీమా.. రైతు సంక్షేమ కార్యక్రమాల అమలు
- జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ నియామకాలు
- మున్నేరు వరద బాధితులను సంపూర్ణంగా ఆదుకుంటాం :రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

భూమి లేని రైతు కూలీల కుటుంబాలకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సహాయం ఈ ఏడాది నుంచే ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన రైతులందరికీ రూ. రెండు లక్షల రుణమాఫీ, సన్న వడ్లకి రూ.500 బోనస్, పంటల బీమా పథకం వంటి రైతు సంక్షేమం కార్యక్రమాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ నియామకాలు పారదర్శకంగా చేపడతామని స్పష్టం చేశారు. మున్నేరు వరద బాధితులకు సంపూర్ణ సహాయం అందిస్తామని అన్నారు. ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. ప్రపంచంతో పోటీపడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేశామని, జిల్లాలోని 1,15,180 మంది రైతుల రుణ ఖాతాలకు సంబంధించి రూ.766.66 కోట్లకు పైగా రుణమాఫీ చేశామన్నారు. అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతు భరోసా పథకాన్ని అర్హులైన రైతులకు వర్తింపజేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పంటల బీమా పథకాన్ని ఈ ఏడాది నుంచి వర్తింపజేసేలా రైతు చెల్లించాల్సిన ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు.

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలో ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, 2030 నాటికి విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేస్తూ ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రామాల్లోని రైతులకు పూర్తిస్థాయిలో సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించామని, ప్రభుత్వ నియామకాలు పారదర్శకంగా భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రయివేటులో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా వారి నైపుణ్యాలు పెంపొందించే దిశగా స్కిల్ యూనివర్సిటీతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 63 ఐటీఐ కేంద్రాలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేస్తున్నట్టు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రోత్సహించే దిశగా విద్యా కమిషన్‌ను ప్రభుత్వం నియమించిందని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, అంగన్ వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చుతున్నామని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ విద్యార్థుల కోసం సమీకృత మోడల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని తెలిపారు. ప్రస్తుత ఏడాది రూ.120 కోట్లు పైగా ఖర్చు చేసి దాదాపు 50 నుంచి 60 సమీకత మోడల్ స్కూల్స్ ప్రారంభించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాంతిభద్రతలు నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నామని, డ్రగ్స్ వాడకంపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నామని అన్నారు.

దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన కుండపోత వర్షాల కారణంగా ఖమ్మంలో మున్నేరు నది 40 అడుగులకు పైగా ఉధృతంగా ప్రవహించి వరదలతో ముంచెత్తిందని అన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేశారని ప్రశంసించారు. వరదల వల్ల ఇండ్లు దెబ్బతిన్న 15,096 కుటుంబాలకు రూ.16,500 చొప్పున పంపిణీ చేశామని, పంట నష్టం జరిగిన ప్రతి ఎకరాకు రూ.10వేల పరిహారం, ఆస్తి, పశు నష్టం జరిగిన వాటికి పరిహారాన్ని అందజేస్తామన్నారు. అనంతరం చింతకానిలో దళితబంధు లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, డి. మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, జెడ్పీ సీఈవో దీక్షా రైనా, డిఆర్డీఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బస్‌భవన్‌లో...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



బస్‌భవన్‌లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఘనంగా జరిగింది. టీజీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మునిశేఖర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జెండా వందనం చేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల హామీతో చలో హైదరాబాద్ వాయిదా

- సెర్ప్ ఉద్యోగుల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉన్నతాధికారుల హామీతో చలో హైదరాబాద్ వాయిదా వేస్తున్నట్టు సెర్ప్ ఉద్యోగుల జేఏసీ మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు జేఏసీ నేతలు కుంట గంగాధర్, ఏపూరి నర్సయ్య, జానయ్య, మహేశ్, సుదర్శన్ ఒక ప్రకటన విడుదల చేశారు. సీఆర్‌డీలో రిటైర్డ్ అధికారి వేధింపులతో ఈపీఎఫ్ చెల్లింపుల సమస్య, వేతనాలు, అలవెన్స్, చెల్లింపుల్లో జాప్యం వంటి అంశాలను సెర్ప్ సీఈఓ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించే బాధ్యతను తానే తీసుకుంటాననీ, ఇప్పటికే చర్యలు ప్రారంభించామని సెర్ప్ అడ్మిన్ డైరెక్టర్ ద్వారా జేఏసీకి అధికారిక సమాచారం అందిందని తెలిపారు. తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చిన సెర్ప్ సీఈఓకు 3974 మంది సిబ్బంది తరఫున జేఏసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. సమస్య పరిష్కారమే తప్ప తమకు ఎవరిపైనా వ్యక్తిగత ద్వేషాలు లేవని పేర్కొన్నారు.

బాలికపై లైంగికదాడి

- మేడిపల్లిలో ఘటన.. పరారీలో నిందితుడు

నవతెలంగాణ-బోడుప్పల్

చదువు కోసం బంధువుల ఇంట్లో ఉంటున్న బాలికపై ఓ దుండగుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన రాచకొండ కమిషనరేట్ మేడిపల్లి పీఎస్ పరిధిలో జరిగింది. మేడిపల్లి పోలీసులు, బాలిక బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలిక బంధువుల వద్ద ఉంటోంది. అదే ప్రాంతంలో ఉండే కేశవరెడ్డి బాలికను బంధించి లైంగికదాడి చేశాడు. విషయాన్ని బాధితురాలు తన బంధువులకు చెప్పడంతో వారు మేడిపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని, బాలిక స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటులో..
సందేహాలకు సమాధానమేదీ..?

- ఊటలను నిర్లక్ష్యం చేసిన ఇంజనీర్లు
- కొన'సాగు'తున్న పరీక్షలు..
- ఎన్‌డీఎస్‌ఏ తేల్చేనా..?
- సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలు





నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో గోదావరిపై 108 కి.మీ నిడివిలో నిర్మించిన మూడు భారీ బ్యారేజీల నిర్మాణంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన విషయం తెలిసిందే. తక్కువ కాలంలో ప్రాజెక్టును పూర్తి చేయాలని.. కనీస జాగ్రత్తలు పాటించకపోవడం, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంలో శాస్త్రీయ అధ్యయనాలను విస్మరించడంతో పాటు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, నీటిపారుదల శాఖ ఇంజనీర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. కాగా, మేడిగడ్డ బ్యారేజీ (లక్ష్మీ బ్యారేజీ) కుంగిపోవడానికి గల కారణాలపై నేటికీ స్పష్టత రాకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ గేట్లను తెరిచిపెట్టడంతో భారీ వరద సముద్రం పాలవుతుంది. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు చేస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. మరో 6 నెలలపాటు ఈ పరీక్షలు కొనసాగుతాయని సమాచారం. ఇదిలా వుంటే మేడిగడ్డ బ్యారేజీ డిజైన్‌లోనే లోపాలున్నాయన్న చర్చ తెరపైకి వచ్చిన విషయం విదితమే.

బ్యారేజీ నిర్మాణంలో లోపాలు..

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలోనే పలు లోపాలున్నట్టు ఎన్‌డీఎస్‌ఏ పరిశీలనలో ఓ అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. జియాలజిస్ట్ నివేదిక, సెటిల్‌మెంట్ క్రైటీరియా, సేఫ్ బేరింగ్ కెపాసిటీల ఆధారంగానే బ్యారేజీల డిజైన్‌లను ఖరారు చేస్తారు. బ్యారేజీ నిర్మాణానికి ప్రధానమైన ఈ విషయాల్లో లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజీకి సరైన ఒంండిజైనింగ్‌ను ఇవ్వలేకపోయారన్న వాదన వినిపిస్తుంది. అంతేకాదు, సెడిమెంటేషన్ విశ్లేషణ చేయించడంలో, నీటి నిల్వపై సమగ్రంగా అధ్యయనం చేసి అంచనాలు వేయడంలోనూ లోపం ఉన్నట్టు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం సందర్భంలో బ్లాక్ 6, 7, 8ల్లో సెటిల్‌మెంట్ క్రైటీరియా 100 మిల్లీమీటర్ల కంటే అధికంగా వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. 100 మి.మీపైగా వస్తే పునాదికి అదనపు బలాన్ని (స్టబిలైజేషన్ ఆఫ్ ఫౌండేషన్) ఇవ్వాల్సి ఉంటుంది. ఇది నీటిపారుదల శాఖ అధికారులు గాని, ఎల్ అండ్ టీ కంపెనీ ఇంజనీర్లు గాని చేయలేదు. అందుకే పునాది దెబ్బతిందన్న వాదనలు న్నాయి. సెటిల్‌మెంట్ క్రైటీరియా ఏ ప్రాజెక్టు నిర్మాణంలోనైనా 75-100 మిల్లీమీటర్ల మధ్యనే ఉండాలి. ఇంతకంటే అధికంగా ఉంటే ఆ నిర్మాణానికి ప్రమాదమని నీటిపారుదల శాఖ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే గుత్తేదారులు, అధికారులు మాత్రం సెటిల్‌మెంట్ ఆఫ్ క్రైటీరియా చేశామని చెబుతున్నారు. దాంతో విజిలెన్స్ అధికారులు ఈ నివేదికలను సమర్పించాల్సిందిగా కోరారు. అంతేకాదు, డ్యామ్ గాని, బ్యారేజీ నిర్మాణంలోగాని హార్డ్ రాక్ వచ్చేవరకు లోతుకు వెళ్లాల్సి ఉంటుంది. మేడిగడ్డలో ఇది లోపించినట్టు సమాచారం. ఈ కారణాల రీత్యానే మేడిగడ్డలో ఆకస్మికంగా బ్యారేజీ కుంగిందన్న బలమైన వాదనలు వినిపిస్తున్నాయి.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కేంద్రం ఆధీనంలోకి వెళ్లడంతో ఈ బ్యారేజీల గేట్లను మూసివేయాలన్న, తెరవాలన్న కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని సంస్థ ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలకు లోబడి చేయాల్సిందే. వారి ఆదేశాల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ అన్ని గేట్లను ఎత్తిపెట్టడంతో గోదావరి జలాలు దిగువకు వెళ్తున్నాయి. గేట్లు తెరిచినప్పటి నుంచి నేటి వరకు మేడిగడ్డ నుండి 1,700

సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలు

టీఎంసీలు, అన్నారం నుంచి 160 టీఎంసీలు, సుందిళ్ల బ్యారేజీ నుంచి 160 టీఎంసీల గోదావరి జలాలు దిగువకు వెళ్లిపోయాయి. ఈ జలాలు పోలవరం నుంచి సముద్రంలో కలిసిపోయాయి. కాగా, మరమ్మతులు పూర్తి చేసినా, కేంద్రం చెప్పేంత వరకు గేట్లు మూసివేసే పరిస్థితి లేకపోవడంతో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి.

భూగర్భ శాస్త్రవేత్తల నివేదిక ఏదీ..?

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం చేయడానికి ముందు ఈ ప్రాంతంలో భూగర్భ శాస్త్రవేత్తల నుంచి నివేదిక తీసుకోలేదనే వాదన వినిపిస్తుంది. ఏ ప్రాజెక్టుకు సంబంధించిన ఆనకట్ట, బ్యారేజీలను నిర్మించాలన్నా అందుకు ముందుగా భూగర్భ శాస్త్రవేత్తలతో ఆ ప్రతిపాదిత స్థలాన్ని అధ్యయనం చేయించి వారిచ్చే నివేదికను పరిగణనలోకి తీసుకోవాలి. దాని ఆధారంగానే అక్కడ నిర్మించాలా? లేదా? అనేది తేల్చుకుంటారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం విషయంలో అది జరగలేదని విశ్వసనీయంగా తెలిసింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో ఈ ప్రాజెక్టులోని లోపాలపై అధ్యయనం చేస్తున్న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) కూడా ఈ నివేదికను అడగకపోవడం గమనార్హం. అదేవిధంగా అవక్షేపణ విశ్లేషణ (సెడిమెంటేషన్ ఎనాలిసిస్) కూడా చేయాల్సి ఉంది. నీటిలో ఇసుక పేరుకుపోయే విధానంతో పాటు ఇసుక కోత ఏ మేరకు ఉందో నిర్ధారించుకోవడానికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్షను సైతం చేయలేదని సమాచారం. అంతేకాకుండా బ్యారేజీ నిర్మిస్తే బ్యారేజీ వెనుక నిలిచిపోయే నీటి నిలువ ప్రవాహాన్ని (ఇంటిగ్రేటెడ్ బ్యాక్ వాటర్ స్టడీ) సైతం అధ్యయనం చేయకపోవడం ఒక లోపంగా చెబుతున్నారు.

కొన'సాగు'తున్న ఎన్‌డీఎస్‌ఏ పరీక్షలు

మేడిగడ్డ బ్యారేజీలో ఎన్‌డీఎస్‌ఏ శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. మరో 6 నెలలపాటు ఈ పరీక్షలు కొనసాగుతాయని తెలుస్తుంది. తాజాగా ఇంటిగ్రేటెడ్ బ్యాక్ వాటర్ స్టడీని ఎగువ, దిగువ పరివాహక ప్రాంతాల్లో నిర్వహించినట్టు సమాచారం. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రూ.5 కోట్లను విడుదల చేసి బ్యారేజీ మరమ్మతులు చేయడానికి ఉన్న అవకాశాలతోపాటు 5 పరీక్షలను నిర్వహించి వెంటనే నివేదికను సమర్పించాలని ఆదేశించారు. దాంతో శాస్త్రవేత్తలు ఈ పరీక్షలను ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. జియో ఫిజికల్, అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్స్ టెస్ట్ (ఏడీసీపీ)తోపాటు మరికొన్ని పరీక్షలను నిర్వహిస్తున్నారు.

ఊటలను నిర్లక్ష్యం చేసిన ఇంజనీర్లు

2020లో మేడిగడ్డ బ్యారేజీ ప్రారంభించినప్పటి నుంచి మెయింటెనెన్స్‌లోనూ తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుంది. ఫలితంగా 20వ గేటు కుంగిపోయిందని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు చర్చించుకుంటున్నారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిన 2020 నుంచి ప్రతియేటా 2021, 22లోనూ 7వ బ్లాకులోని 17, 18, 19, 20 స్తంభాల వద్ద ఊట బహిర్గతమైనా పట్టించుకోకపోవడంతో బ్యారేజీకి 2023లో భారీ ప్రమాదం సంభవించింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ ఈ ఊటలు బహిర్గతమయ్యాయి. అన్నారం బ్యారేజీలో ఊట బహిర్గతమైనప్పుడు కెమికల్ గ్రౌటింగ్ చేసి నివారించారు. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ 7వ బ్లాక్ కుంగిన నేపథ్యంలో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు అడ్‌మిక్చర్, సిమెంట్, ఇసుక మిక్చర్‌తో గ్రౌటింగ్ చేశారు. సుమారు 37వేల క్యూబిక్ మీటర్ల మిక్చర్‌ను మరమ్మతులకు వినియోగించారు. పగుళ్లలో సిలికాన్ మైక్రో కాంక్రీట్‌తో మరమ్మతులను పూర్తి చేశారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు 20వ గేటును పూర్తిగా తొలగించారు. దాంతో ఇప్పటికీ ఈ మూడు బ్యారేజీల నుంచి గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి.

రాజకీయాలకోసం సెప్టెంబర్ 17కు వక్రీకరణ

(మొదటిపేజీ తరువాయి)

లేదంటే ప్రజాపాలన దినోత్సవమంటూ జరుపుతున్నారని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌ను దూషిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న రేవంత్ రెడ్డికి చేతనైతే ఇచ్చిన హామీలను అమలు చేయాలని సవాల్ విసిరారు. రైతుబంధు, వడ్లుకు రూ.4 వేల ఫించన్, 2 లక్షల ఉద్యోగాల కల్పన తదితర హామీల అమలు మరిచారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల బండ్లకు పెట్రోల్‌కు బిల్లులు కట్టడం లేదనీ, పాఠశాలల్లో చాక్‌పీస్‌లు లేని పరిస్థితి, మాజీ సర్పంచ్‌లకు బిల్లుల కోసం బాధలతో రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం పెడదామన్న చోట రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం పెట్టారనీ, ఢిల్లీ మెప్పు కోసం రేవంత్ రెడ్డి ఇలా చేశారని దుయ్యబట్టారు.

సీఎం రేవంత్ రెడ్డికి ఏమి తెలియదనీ, ఆ విషయం కూడా ముఖ్యమంత్రికి తెలియదని ఎద్దేవా చేశారు. చార్లెస్ బాబ్బెజ్ కనిపెట్టిన కంప్యూటర్‌ను రాజీవ్ గాంధీ కనిపెట్టారని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ కంప్యూటర్‌ను 1955లో భారత దేశానికి టాటా గ్రూప్ పరిచయం చేసిందే తప్ప రాజీవ్‌గాంధీ కాదని స్పష్టం చేశారు. పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేయడంతో చికెన్ గున్యాలు, విష జ్వరాలు,, డెంగ్యూలతో ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. గురుకులాల్లో పిల్లల మీద అఘాయిత్యాలు జరుగుతున్నాయనీ, గురుకుల టీచర్లను తొలగిస్తున్నారని విమర్శించారు. డైవర్షన్ రాజకీయాలు ఆపి పాలనపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు వెంట పడతామని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక సకల మర్యాదలతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తా మని తెలిపారు. ఇష్టముంటే రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ విగ్రహాన్ని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పెట్టుకోవాలని సూచించారు. తెలంగాణ తల్లికి పాలాభిషేకం చయకుండా అడ్డుకున్న తమ విద్యార్థి నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

యువతే సింగరేణి భవిత

- సీఎమ్‌డీ ఎన్ బలరాం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో 50 శాతంకంటే ఎక్కువ మంది యువత విధులు నిర్వర్తిస్తున్నారనీ, వారితోనే సంస్థ భవిష్యత్ ముడిపడి ఉన్నదని ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ బలరాం అన్నారు. ఈ యువశక్తిని సంఘటిత శ్రమ శక్తిగా మార్చితే అనేక విజయాలు సాధించొచ్చని తెలిపారు. వచ్చే ఐదేండ్లలో కంపెనీ రూ.60 వేల కోట్ల టర్నోవర్ ను సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నదని వివరించారు. మంగళవారంనాడిక్కడి సింగరేణి భవన్‌లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి, మాట్లాడారు. రానున్న రోజుల్లో రాజస్థాన్‌లో సోలార్ పవర్ ప్లాంట్, సింగరేణిలో మూసివేసిన ఉపరితల గనుల్లో పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు, ఎస్టీపీపీలో మరో 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్, ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాక్ సమీపంలో 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ నిర్మాణం, రాష్ట్రంలో 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ వంటి అనేక ప్రాజెక్టులు చేపట్టనున్నామన్నారు. బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచడం ద్వారా తక్కువ ధరకు బొగ్గు సరఫరా చేయగలుగుతామన్నారు. పోటీ మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే నాణ్యత, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం(కో ఆర్డినేషన్) ఎస్‌డీఎమ్ సుభానీ, జీఎం(మార్కెటింగ్) డీ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పీఈటీ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

- టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ) పోస్టులకు తుది ఫలితాలు విడుదల చేసినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రీలింక్విష్‌మెంట్ తర్వాత జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను విడుదల చేశామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్ www.tspsc.gov.in లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో పీఈటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను రీలింక్విష్‌మెంట్ ఇవ్వాలంటూ గత నెల 21న అభ్యర్థించామని వివరించారు. 53 మంది అభ్యర్థులు రీలింక్విష్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. 596 పీఈటీ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. గురుకుల విద్యాసంస్థల్లో 616 పీఈటీ పోస్టుల భర్తీకి 2017, ఏప్రిల్ 14న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అదే ఏడాది సెప్టెంబర్‌లో రాతపరీక్షలకు హాజరయ్యారు. 2018, మార్చిలో టీజీపీఎస్సీ ఫలితాలను విడుదల చేసింది. అదే ఏడాది మేలో 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టింది. ఇప్పుడు తుది ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది.

24 వరకు పీజీలాసెట్ ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీలాసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఈ నెల 24 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తో పాటు ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది.ఈ మేరకు లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు మంగళవారం సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 25న ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామని తెలిపారు. అదే నెల 26, 27 తేదీల్లో వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు.అదే నెల 30న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. వచ్చేనెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని కోరారు.

బై బై గణేశా

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లోని చెరువుల్లోనూ నిమజ్జనం జరిగింది. పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేయగా, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి, సీపీ సివి.ఆనంద్ తదితరులు నిమజ్జనాన్ని పర్యవేక్షించారు.



మధ్యాహ్నమే మహా గణపతి నిమజ్జనం

పదకొండు రోజులపాటు పూజలందుకున్న ఖైరతాబాద్ శ్రీసప్తముఖ మహాశక్తి గణపతి నిమజ్జన పర్వం మధ్యాహ్నానికి పూర్తయింది. గ్రేటర్‌వాసులతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన అశేష జనవాహిని నడుమ మహాగణపతికి వీడ్కోలు పలికారు. ఉదయం 6.32గంటలకు మండపం నుంచి బయలుదేరిన మహా గణపతి ట్యాంక్‌బండ్.. ఎన్టీఆర్ మార్గ్ మీదుగా క్రేన్ నెం.4 వద్దకు చేరుకోగా.. మధ్యాహ్నం 1.39 గంటలకు గంగమ్మ ఒడికి చేరాడు. దాదాపు 7గంటలపాటు సాగిన శోభాయాత్రలో సందర్శకులు, రాజకీయ నాయకులు, ప్రముఖుల రాకతో హుస్సేన్‌సాగర్ ప్రాంగణం కిక్కిరిసింది. ఏడాదికో ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న ఖైరతాబాద్ గణేశ్ ఈ సారి 70 అడుగులు ఎత్తుతో.. విగ్రహానికి కుడివైపున 14 అడుగుల ఎత్తులో శ్రీనివాస కళ్యాణం, ఎడమవైపు శివపార్వతుల కళ్యాణం విగ్రహ మూర్తులతో కనిపించారు. ఈ శోభాయాత్ర సందర్భంగా నిర్వహించిన నృత్యాలు, భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, డీజే పాటలు అలరించాయి. అనుకున్న సమయాని కంటే 20 నిమిషాలు ముందుగానే మహాగణపతి నిమజ్జనం ముగిసింది. సోమవారం రాత్రి 9గంటలకే మహా హారతి, ఇతర పూజ కార్యక్రమలు ప్రారంభించారు. కమిటీ సభ్యులు చివరిసారిగా పూజ చేసిన అనంతరం గణనాథున్ని వాహనంలో ఎక్కించారు. ఈ శోభా యాత్ర కోసం పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు.

మంత్రి పొన్నం, అధికారులతో ఏరియల్ వ్యూ..

గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న గణేష్ శోభాయాత్ర, నిమజ్జనాన్ని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డీజీపీ జితేందర్, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఏరియల్ వ్యూ ద్వారా నగరంలో గణేశ్ విగ్రహాల శోభాయాత్ర, హుస్సేన్ సాగర్ వద్ద నిమజ్జనాల తీరును పరిశీలించారు. ఆ తర్వాత చార్మినార్, బాలాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులూ ఏర్పడకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లూ చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది నగరంలోని వివిధ ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో విగ్రహాలను ఏర్పాటు చేశారని, బుధవారం ఉదయం వరకు నిమజ్జనాలు పూర్తవుతాయని ఆశిస్తున్నామని తెలిపారు. నేడు వర్కింగ్ డే కాబట్టి తొందరగా నిమజ్జనం చేసేందుకు మండపాల నిర్వాహకులు ముందుకు రావాలని కోరారు.

సీఎం రేవంత్ పర్యవేక్షణ

గతంలో ఎన్నడూ లేని విధంగా గణేశ్ నిమజ్జనానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. క్రేన్ నెంబర్.4 దగ్గర మహా గణపతి నిమజ్జన ఏర్పాట్లతో పాటు మిగతా సౌకర్యాలను పరిశీలించారు. క్రేన్ల డ్రైవర్లతో పాటు ఇతర సిబ్బందికి ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడాలని, షిఫ్ట్‌ల వారీగా పని చేయించుకోవాలని, ఎలాంటి అవాంతరాలూ లేకుండా నిమజ్జనం పూర్తయ్యేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో క్రేన్ ఆపరేటర్స్, హెల్పర్స్ రెస్టు కోసం బస్సులను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసింది. సాగర్, సరూర్‌నగర్ లేక్, ఐడీఎల్ లేక్ వద్ద రెస్టు బస్సులు ఏర్పాటుకు ఆయా జోనల్ కమిషనర్లు చర్యలు తీసుకున్నారు. సీఎం వెంట పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, కమిషనర్ అమ్రపాలి కాట, నగర సీపీ సీవీ ఆనంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉన్నారు.

రేపు ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్ డే

- ఎస్‌డబ్ల్యూఎఫ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల డిమాండ్ల సాధనలో భాగంగా ఈనెల 19న డిమాండ్స్ డే పాటిస్తున్నట్టు టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్లకు అతీతంగా కార్మికులంతా భాగస్వాములు కావాలని కోరారు. డిమాండ్స్ బ్యాడ్జీలను ధరించి ఆరోజు కార్మికులు విధులకు హాజరవుతారని తెలిపారు. సర్కారు నిధులతో మూడువేల ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయాలనీ, ప్రతినెలా సంస్థకు రూ.430 కోట్లు రీయింబర్స్‌మెంటు చేయాలని డిమాండ్ చేశారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రూట్ సర్వే చేసి రన్నింగ్ టైం ఇవ్వాలనీ, ఖాళీలన్నింటినీ రెగ్యులర్ ప్రాతిపదికన జరపాలనీ, టిమ్స్‌లో అవసరమైన మార్పులు చేయాలని కోరారు. మహాలక్ష్మి నేపథ్యంలో కార్మికులపై అయిన కేసుల్ని సానుభూతితో ఎత్తేయాలనీ, కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తేసి, ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఎస్సీటీ, ఎస్‌ఆర్‌బీఎస్ ట్రస్టులకు బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌ను నియమించాలనీ, సీసీఎస్ ప్రతినిధుల కోసం ఎన్నికలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరారు. ఇవే డిమాండ్లతో కార్మికులు బ్యాడ్జీలు ధరిస్తారని తెలిపారు.

21న ఆర్టీసీ కార్మికుల రిలేదీక్షలు

- మహిళలు భారీ సంఖ్యలో పాల్గొనాలి : టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేస్తున్నట్టు టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ తెలిపింది. ఈమేరకు మంగళవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను అమలు చేయాలని జేఏసీ కోరింది. దీనికోసం జరుగుతున్న దీక్షల్లో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది. మహిళా ఉద్యోగులు సమరంలో ముందుంటేనే సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని జేఏసీ అభిప్రాయపడింది.

గిరిజన గ్రామాల్లో విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : మంత్రి సీతక్క

- ములుగు జిల్లాలో కంటైనర్ ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



నవతెలంగాణ - ములుగు (కన్నాయిగూడెం)

దట్టమైన అడవీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గిరిజన పిల్లలను విద్యావంతులుగా చేయడానికి కృషి చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బంగారుపల్లిలో రూ.13.50లక్షలతో ఏర్పాటు చేసిన కంటైనర్ ప్రభుత్వ పాఠశాలను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఉపాధ్యా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల గ్రామాల్లో శాశ్వత ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయడానికి కేంద్ర అటవీశాఖ నిబంధనలు అడ్డు వస్తున్నాయన్నారు. దాంతో ఎలాగైనా గిరిజన బిడ్డలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరో రెండు మూడు చోట్ల ఇలాంటి పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ నాశనం అయిపోయిందని, వందలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల మేరకు అన్ని సంక్షేమ పనులను అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ బాబా సాహెబ్ గీతే, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీఓ కె.సత్యపాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్, డీఈఓ పాణిని, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్ట్ 15లాగే తెలంగాణకు సెప్టెంబర్ 17

- చరిత్రను పట్టించుకోని పార్టీలను

ప్రజలు తరిమికొడతారు : తెలంగాణ విమోచన దినోత్సవంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



మన దేశానికి ఆగస్ట్ 15 ఎంత ముఖ్యమో తెలంగాణకు సెప్టెంబర్ 17 అంత ముఖ్యమనికేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజాం నుంచి తెలంగాణ ప్రజలకు విమోచనం కల్పించిన పటేల్ కృషిని, నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాట చరిత్రను పట్టించుకోని పార్టీలను ప్రజలు తరిమికొడతారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసు బలగాల గౌరవవందనాన్ని స్వీకరించారు. పలు బృందాలు ప్రదర్శించిన తెలంగాణ కళారూపాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రజాకార్ల వారసత్వానికి చెందిన ఎంఐఎం పార్టీకి భయపడి విమోచన దినోత్సవం జరుపకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. పనిముట్లనే ఆయుధంగా చేసుకుని ప్రజలు నిజాంపై పోరాటం చేశారని గుర్తుచేశారు. రజాకార్ల ఆగడాలతో ఇక్కడి ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవించారని చెప్పారు. నిజాం హయాంలో బలవంతపు మతమార్పిళ్లు జరిగాయన్నారు. హిందూ మహిళలను రజాకార్ల సైన్యం బలవంతంగా ఎత్తుకెళ్లి అఘాయిత్యాలకు పాల్పడిందని చెప్పారు. పాకిస్థాన్‌లో హైదరాబాద్ సంస్థానాన్ని కలపాలని నిజాం భావించాడనీ, ఆ దిశగా చర్చలు కూడా జరిపాడని ఆరోపించారు. నిజాంతో పటేల్ శాంతి చర్చలు జరిపితే..తమ సంస్థానం జోలికొస్తే కోటిన్నర హిందువులను చంపేస్తామని ఖాసీం రజ్వీ బెదిరించారన్నారు. దీంతో పటేల్ నేతృత్వంలో సైన్యం ఆపరేషన్ పోలోతో హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసిందని గుర్తుచేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ..దేశ భక్తులకు, దేశ విచ్ఛిన్నశక్తులకు మధ్య భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన పోరాటమే తెలంగాణ ఉద్యమం అన్నారు. నిజాం దురాగతాలను, నిరంకుశత్వాన్ని ఈ గడ్డ ఎప్పటికీ మరిచిపోదన్నారు. భరతమాత కడుపులో క్యాన్సర్ గడ్డ నిజాం, రజాకార్ల సైన్యం అనీ, దాన్ని పటేల్ ఆపరేషన్ పోలోతో సర్జరీ చేసి తెలంగాణ గడ్డకు విముక్తి కలిగించారని చెప్పారు. విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడం తెలంగాణ ఉద్యమ వీరులను అవమానించడమేనన్నారు. తాము ముస్లింలకు వ్యతిరేకం కాదనీ, రజాకార్ల వారసులకు, వారికి కొమ్ముకాసేవాళ్లకు వ్యతిరేకమని చెప్పారు. కుల, మత, వర్గాలకు అతీతంగా నిరాజం నిరంకుశ పాలనపై ప్రజలు పోరాడారని కొనియాడారు. తెలంగాణలో ప్రతి గ్రామానికీ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధిలో అందరూ పాలుపంచుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగిద్దాం

- ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు చేసిన పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో సెప్టెంబర్ 17- తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా కోదండరాం తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక కీలకమైన రోజుగా అభివర్ణించారు. ఆ రోజును ప్రజల పోరాట ఫలితంగా సాధించిన విజయంగా గుర్తించాలని సూచించారు. 1989లో ఆవిష్కృతమైన 'మా తెలంగాణ' అనే పత్రిక తెలంగాణ రాష్ట్రం విలీనానికి సంబంధించిన చరిత్రపై ప్రజల్లో అవగాహన పెంచిందన్నారు. అప్పటి నుంచి సెప్టెంబర్ 17ను చర్చలోకి తెచ్చి, తెలంగాణా ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిపిందని గుర్తు చేశారు. ఈ చర్చను మతకోణంలో చూడటం సరికాదని, సెప్టెంబర్ 17 వాస్తవానికి ప్రజాస్వామ్యం కోసం, ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటం విజయోత్సవమని తెలిపారు. విలీన దినోత్సవాన్ని జరుపుకోవడమంటే ఆనాటి స్ఫూర్తితో ప్రజాస్వామిక, సామాజిక తెలంగాణ కోసం కృషి చేయడమేనని స్పష్టం చేశారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజల పోరాటం విజయవంతం కావడంలో పోలీస్ చర్య ఓ తుది ఘట్టం మాత్రమేనని తెలిపారు. ఆ దిశగా జరిగిన ప్రజా ఉద్యమాల ప్రభావాన్ని మనం మరచిపోవద్దని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, పల్లె వినయ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సయ్య, ప్రధాన కార్యదర్శి బట్టల రాంచందర్, రవికాంత్, జస్వంత్, రాష్ట్ర నాయకులు మారం లక్ష్మారెడ్డి, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతం?

పోరాటానికా... తెలంగాణ విలీనానికా : సీఎం రేవంత్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సహించబోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పనిగట్టుకుని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారంటూ ఆ చరిత్రను వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో హిందువులు, ముస్లింలు కలిసి బందూకులు పట్టి సాగించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వాస్తవ చరిత్ర చెరిగిపోదని చెప్పారు. ఆ పోరాట స్ఫూర్తి ఎప్పుడూ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో తిరుగుబాటు చైతన్యాన్ని కలిగిస్తుందన్నారు. మనిషి ఉన్నంత కాలం అరుణ పతాకం రెపరెపలాడుతూనే ఉంటుందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 76వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను కూనంనేని సాంబశివరావు, అరుణ పతాకాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా ఎగరేశారు. సాయుధ పోరాట అమరవీరులకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పేరు ఉచ్ఛరించడానికి పాలకులకు భయమని అన్నారు. విమోచన దినమంటూ కేంద్ర ప్రభుత్వం, సమైక్యతా దినమంటూ మాజీ సీఎం కేసీఆర్, ప్రజాపాలన దినోత్సవమంటూ ముఖ్యమంత్రి రేవంత్ అంటున్నారని చెప్పారు. ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. పోరాటానికి సంకేతమా లేదంటే తెలంగాణ విలీనానికి సంకేతమా అని సీఎం రేవంత్‌రెడ్డిని అడిగారు. ప్రజా పాలన పేరుతో నాటి పోరాటం పేరే ఉనికిలో లేకుండా పోయే ప్రమాదముం దన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం, నిజాం రాజు మధ్య జరిగిన ఒప్పందంలో చట్టబద్ధంగా విలీనం అని పొందపర్చారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా చట్టబద్ధమైన తెలంగాణ విలీన దినోత్సవం పేరుతోనే ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

> విలీన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్
> మఖ్దూంభవన్‌లో సాయుధ రైతాంగ పోరాట వారోత్సవ వేడుకలు

కమ్యూనిస్టులను అణచడానికే ఆపరేషన్ పోలో : అజీజ్ పాషా

కమ్యూనిస్టులను అణచివేయడం కోసమే ఆపరేషన్ పోలోను నాటి కేంద్ర ప్రభుత్వం చేపట్టింది తప్ప నిజాం రాజును అణచివేయడానికి కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానిది మహత్తర చరిత్ర అని చెప్పారు. కొన్ని పత్రికలు, మరికొన్ని రాజకీయ పార్టీలు ఈ చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం చేస్తున్నాయనీ, అది ఎప్పటికీ సాధ్యం కాదన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సృష్టించిన పదం తెలంగాణ విమోచనం అని మీడియా అకాడమి చైర్మెన్ కె శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. భారత్‌లో తెలంగాణ విలీనమైంది తప్ప విమోచనం కాలేదన్నారు. బీజేపీ నాయకులు కమ్యూనిస్టుల పోరాటాన్ని, త్యాగాలను విమర్శిస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని చెప్పారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ మాట్లాడుతూ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో రైతుల హక్కులను కాపాడేందుకు ఉద్యమిస్తామని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, నాయకులు అంజయ్య నాయక్, కె కాంతయ్య, అనిల్ కుమార్, చంద్రమౌళి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విలీనం జరిగినప్పుడు బీజేపీ పుట్టనే లేదు

ఆ పార్టీ దిగజారుడు రాజకీయం చేస్తుంది

- నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారు : గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో తెలంగాణ విలీనం జరిగినప్పుడు బీజేపీ పుట్టనే లేదనీ, అయినా ఆ పార్టీ విమోచన అంటూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. దేశాన్ని ముక్కలు చేయాలనే కుట్రలో భాగంగా ఆ పార్టీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ విలీనం ప్రక్రియలో ఎలాంటి పాత్రలేని కమలనాథులు కాంగ్రెస్ పార్టీకి నీతులు చెప్పాల్సిన అవసరం లేదని హెచ్చరించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, తొలి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఎంతో విజన్ ఉన్న గొప్ప నేతలు అని కొనియాడారు. దేశం కోసం వారు చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోయాయని గుర్తు చేశారు. బీజేపీకి, ఆ చరిత్రకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారనీ, ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఆ సమయంలో జనసంఘ్, బీజేపీ అడ్రస్‌లేవని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా గాంధీ, పటేల్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం మహేష్‌కుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17, 1948 వరకు మన సంస్థానానికి స్వతంత్రం రాలేదన్నారు. నెహ్రూ, పటేల్ ఎంతో దూరదృష్టితో వ్యవహరించి ఈ ప్రాంతాన్ని దేశంలో విలీనం చేయించారని కొనయాడారు. ఆ సమయంలో బీజేపీ అనుబంధ సంఘాలు బ్రిటీష్ ప్రభుత్వానికి వంత పాడాయని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి, పటేల్‌కు ఎలాంటి సంబంధం లేకపోయినా ఆయన్ను తమ నాయకుడిగా కమలనాథులు ప్రచారం చేసుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ విలీనం గురించి మాట్లాడే హక్కు ఆ పార్టీకి లేదని స్పష్టం చేశారు. పదేండ్లుగా రాష్ట్రాభివృద్ధిని కేసీఆర్ తుంగలో తొక్కారని విమర్శించారు. రాజీవ్ గాంధీ విగ్రహం పెడితే, ఆ పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసింది రాజీవ్ గాంధీయేనన్నారు. రాజీవ్‌గాంధీ గురించి మాజీ మంత్రి కేటీఆర్ సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ తల్లి గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. సచివాలయ గర్భం(మధ్య భాగం)లో తెలంగాణ విగ్రహం పెడుతుంటే, బీఆర్ఎస్‌కు ఉన్న ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. బీజేపీ పెట్టే చిచ్చులో పడొద్దనీ, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొంది అభివృద్ధి పథంలో పయనిద్దామని పిలుపునిచ్చారు. ఎవరు ఎంత జనాభా ఉంటే వారికి అంత వాటా అని రాహుల్ గాంధీ చెప్పారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మెన్ మెట్టుసాయికుమార్, కార్పొరేషన్ల చైర్మెన్లు, అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ సేవాదల్ చైర్మెన్ జితేందర్ నేతృత్వంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు గౌరవ వందనం చేశారు.

బీసీ గురుకుల బాలికల పాఠశాలలో నిరసన

ఉడకని అన్నం, నీళ్ల చారు పోస్తున్నారని విద్యార్థినుల ఆవేదన

- పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే, విద్యాధికారి
- సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి





నవతెలంగాణ -హాలియా

ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు, రుచిగా లేని కూరలను తినలేకపోతున్నామంటూ విద్యార్థినులు నిరసన తెలిపారు. పాఠశాలలో సకాలంలో సిలబస్ పూర్తి చేయడం లేదని నల్లగొండ జిల్లా హాలియాలోని బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం ప్రార్థన సమయం అనంతరం విద్యార్థినులు పలు అంశాలపై ఉపాధ్యాయులను నిలదీశారు. అనంతరం క్లాసులకు వెళ్లకుండా ఆడిటోరియంలో నిరసనకు దిగారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయకపోవడంతో ఇబ్బందిగా ఉందన్నారు. దాంతోపాటు భోజనం తినేలా ఉండటం లేదని, సరిగా ఉడకని, అన్నం, నీళ్ల చారు పోస్తున్నారని, కూరలు రుచిగా ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. పరిస్థితులను ఉపాధ్యాయులకు వివరిస్తే తిడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి బాలు నాయక్ పాఠశాలకు చేరుకొని విద్యార్థినులతో మాట్లాడారు. సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్ ఆంక్షలతో తమను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి

హాలియా బీసీ బాలికల గురుకుల పాఠశాలను నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమస్యలపై పాఠశాల విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో విద్యార్థినులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టారు. విద్యాబోధన సరిగా ఉండటం లేదని చెప్పారు. నాణ్యమైన భోజనం అందించడం లేదని వాపోయారు. అంతేకాకుండా ఉపాధ్యాయులు బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల వంట గదిలోని వంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నం, చారు, కూరలు రుచి చూసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఇక నుంచి నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ క్రాంతిని ఆదేశించారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని, మరోసారి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి

బీసీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచకుండా పౌష్టికాహారం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గురుకుల పాఠశాలకు పంపే బియ్యంలో పురుగులుంటున్నాయన్నారు. ఆ బియ్యం అలాగే వండిపెడుతున్నారని అనేకసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, విద్యార్థినులు తినలేకపోతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మూడు నెలలుగా విద్యార్థులకు గుడ్లు పెట్టడం లేదన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కోరి రమేష్, వర్షిత్, చందు సాయి తదితరులు ఉన్నారు.

మట్టి మనుషుల తిరుగుబాటుతోనే నిజాం సర్కార్ నేలమట్టం

- ఆప్ రాష్ట్ర ఇన్‌చార్జి కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బానిసత్వానికి బలైపోయిన మట్టి మనుషుల తిరుగుబాటుతోనే నిజాం సర్కార్ నేలమటమైందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బాంచెన్ దొర కాల్మొక్కుతా' అన్న జనమే భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాయుధ పంథాను సాగించి నిరంకుశ నిజాం పాలనను అంతం చేసారని గుర్తు చేశారు. దోపిడీ, అకృత్యాలకు పాల్పడుతున్న రజాకార్లను, దేశముఖ్‌లను, దొరలను ఉరికించి కొట్టిన చరిత్ర తెలంగాణ గడ్డ సొంతం అని తెలిపారు. దొడ్డికొమరయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి వంటి వారు తొలితరం అమరులుగా నిలిచారనీ, వారి పోరాట స్ఫూర్తితోనే ఆప్ వాలంటీర్లు ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆప్ ప్రభుత్వాలు రాజ్యాంగం ప్రజలకిచ్చిన ఉచిత విద్య, వైద్యం హక్కులను అమలు చేస్తున్నాయని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చేంత వరకు పోరాటానికి ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని సుధాకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాములు గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమాజిల్లోజు, డాక్టర్స్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ లాక్ష్యా నాయుడు, ఫైనాన్స్ సెక్రటరి సోహైల్, అధికార ప్రతినిధి జావీద్ షరీఫ్, దివ్యాంగ విభాగం అధ్యక్షులు దర్శనం రమేష్, నేతలు కొడంగల్ శ్రీనివాస్, మౌనికా గాజుల, అహసాన్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనం ప్రశాంతం

- నేటి ఉదయం వరకు కొనసాగే అవకాశం : డీజీపీ డాక్టర్ జితేందర్



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో కొనసాగుతున్నదని డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ నగరంతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, నిర్మల్, వరంగల్, నిజామాబాద్, జగిత్యాల, నల్లగొండ పలు ప్రాంతాల్లో నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంతరాలు లేకుండా జరుగుతున్నాయని చెప్పారు. గతానుభవాల దృష్ట్యా భైంసాలో శాంతిభద్రతల పరంగా అనేక జాగ్రత్తలు తీసుకోవడం వల్ల సోమవారం అక్కడ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందన్నారు. అదే సందర్భంలో నిర్మల్, నిజామాబాద్‌లలో ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పరిధుల్లో నిమజ్జన కార్యక్రమం మంగళవారం ఉదయం నుంచే ప్రారంభమైందనీ, ఇది బుధవారం ఉదయం ఆరేడు గంటల్లోపు ముగిసే అవకాశాలున్నాయని ఆయన వివరించారు. ముఖ్యంగా బుధవారం సచివాలయం పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు ఉద్యోగులు చేరుకోవడానికి, ప్రజల రోజువారీ కార్యక్రమాలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొత్తమ్మీద నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి, రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబులు గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా కొనసాగించడానికి సహచర ఐపీఎస్ అధికారులతో కలిసి సమన్వయమవుతూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. డీజీపీ కార్యాలయం నుంచి కూడా నిమజ్జన ఊరేగింపు మార్గాన్ని సీసీ కెమెరాల అనుసంధానం ద్వారా రాష్ట్ర శాంతి భద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ తన సహచర అధికారులతో పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇతర శాఖల అధికారులతో పోలీసులు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి క్రేన్ల నిర్వాహకులు, అక్కడున్న పోలీసు అధికారులకు నాలుగు గంటలకు ఒకసారి విశ్రాంతి ఇవ్వాలని సూచించగా.. వెంటనే అమల్లోకి తెచ్చామని తెలిపారు. మొత్తమ్మీద మతసామరస్యానికి ప్రతీకగా గణేశ్ నిమజ్జనోత్సవ కార్యక్రమం సాగడానికి సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు.

100 రోజుల బీజేపీ ప్రోగ్రెస్ ఇది..

- 9 నెలల్లో కాంగ్రెస్ చేసిందేమిటి?
- సమాధానం చెప్పకుంటే ప్రజలు క్షమించరు : కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ సర్కారు వంద రోజుల్లో ఎంతో ప్రోగ్రెస్ సాధించిందనీ, రాష్ట్రంలో తొమ్మిది నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందేమిటి? అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ప్రజాపాలనపై సమాధానం చెప్పకుంటే ప్రజలు క్షమించబోరని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మోడీ వంద రోజుల పాలనపై ఆయన మాట్లాడారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఎమ్ఎస్‌పీని పెంచిందని గుర్తుచేశారు. మహిళల సంక్షేమ కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్లు కేటాయించామనీ, ముద్ర రుణ పరిమితి రూ.20 లక్షలకు పెంచామని చెప్పారు. 3 కోట్ల ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. 75 వేల మెడికల్ సీట్లను అదనంగా మంజూరు చేశామని తెలిపారు. బంగారం, వెండి, ప్లాటినంపై కస్టమ్స్ ఛార్జీలను తగ్గించామన్నారు. సామాజిక సంక్షేమంలో భాగంగా దేశంలోని 63 వేల ఆదివాసీ, గిరిజన గూడెల్లోని 5 కోట్ల మంది ఎస్టీల ఆర్థిక స్థితిగతులు మార్చే ప్రణాళికను అమలు చేస్తున్నామని తెలిపారు. సీనియర్ సిటిజన్లకు ఏటా రూ.5 లక్షల వరకు ఆరోగ్య కవరేజ్ అందించేందుకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు. 8 నేషనల్ హైస్పీడ్ రోడ్ కారిడార్లను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను నివారించేందుకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్‌ను అమలు చేయబోతున్నట్టు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ 9 నెలల కాలంలో ఆరు గ్యారెంటీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. పటేల్ గురించి కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు లేదన్నారు. నిరుద్యోగభృతి, రుణమాఫీ ఏమైందని నిలదీశారు.

కౌశిక్‌రెడ్డి పిచ్చి పరాకాష్టకు చేరిందా?

- ఎంపీ మల్లు రవి అనుమానం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వాలకం చూస్తుంటే ఆయన పిచ్చి పరాకాష్టకు చేరినట్టు కనిపిస్తున్నదని ఎంపీ మల్లు రవి అనుమానం వ్యక్తం చేశారు. ఆయన్ను వెంటనే ఆస్పత్రికి చూపించాలని బీఆర్ఎస్ నాయకులను కోరారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పీసీసీ పదవి కోసం రేవంత్‌రెడ్డి తన కాళ్లు పట్టుకున్నారంటూ కౌశిక్‌రెడ్డి అనడం ఆయన మతిస్థిమితం కోల్పోయారనడానికి ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి ప్రకటనలతో ఆయన తుపాకీ రాముణ్ణి తలపిస్తున్నారని ఎద్దేవా చేశారు. తన పోరాటాల ద్వారానే జేడీపీటీసీ నుంచి ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షులుగా, సీఎంగా ఎదిగారని గుర్తు చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా.. మంగళవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంపై మేయర్ పారిజాత నర్సింహారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘు, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఆర్.ఓ. వేణుగోపాల్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ బడంగ్‌పేట్



నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన జక్కిడి ప్రభాకర్ రెడ్డి టీపీసీసీ అధికార ప్రతినిధి, ఆయన తనయుడు జక్కిడి శివ చరణ్ రెడ్డిలు, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మక్ మహేష్ కుమార్ గౌడ్‌లు..

బైరాన్‌పల్లి పోరాట యోధులు
వెంకటయ్యను సన్మానించిన సీపీఐ(ఎం) నాయకులు





నవతెలంగాణ- ఎల్బీనగర్

బైరాన్‌పల్లి పోరాట యోధులు, స్వాతంత్ర సమరయోధులు రామిని వెంకటయ్యను రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, సీపీఐ(ఎం) నాయకులు చంద్రమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చైతన్యపురి డివిజన్ పరిధిలోని కనిగిరి కాలనీలో నివాసం ఉంటున్న రామిని వెంకటయ్యను సీపీఐ(ఎం) నాయకులు చంద్రమోహన్ ఆధ్వర్యంలో రామిని వెంకటయ్య, అతని కుమారులు నాగలింగప్పలను కలిశారు. ఈ సందర్భంగా వెంకటయ్య అప్పటి రోజులను గుర్తుచేశారు. రజాకారులు బైరాన్ పల్లి గ్రామంపై దాడి చేశారని గుర్తు చేశారు. గ్రామం కోసం హనుమంతు, ఇమ్మడి వీరారెడ్డి, వెంకటయ్యలు మూడు దళాలు ఏర్పడ్డారని చెప్పారు. బైరాన్ పల్లి గ్రామంలో ముగ్గురు రజాకార్ల సైన్యం తమ దాడిలో మరణించారని తెలిపారు. మరుసటి రెండు మూడు రోజుల తర్వాత రజాకార్ల సైన్యం మా గ్రామం పై దాడి చేసి ప్రజలను వెంటాడి వేటాడి 79 మందిని చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అఘాత్యాలకు కూడా పాల్పడినట్లు వాపోయాడు. కమ్యూనిస్టుల అండతోనే మేము గ్రామ గ్రామాన రక్షణ దళాలుగా ఏర్పడి అనేక గ్రామాల్లో ప్రజలకు రక్షణ కల్పించినట్లు తెలిపారు. రజాకార్ల సైన్యాన్ని వెంటాడి తరిమి కొట్టామని ఆయన పేర్కొన్నారు. అనంతరం అనేక గ్రామాల నుండి భూస్వాములు, దొరలు, జాగీర్ దారులు, గ్రామాలు వదిలిపెట్టి వెళ్లారని చెప్పారు. బైరాన్‌పల్లిలో ముగ్గురు రజాకార్లు మృతి చెందడంతో రక్షణ కోసం తమ దళాలు అండర్ గ్రౌండ్ లోనికి వెళ్ళిపోయి రక్షణ పొందాయని ఆయన పేర్కొన్నారు. ఈ పోరాటంలో మేమంతా కులాలు, మతాలను పక్కనపెట్టి అందరం కలిసికట్టుగా పోరాడామని అన్నారు.

వెంకటయ్య రజాకర్లపై తిరుగుబడి ఊరును, ప్రజలను రక్షించిన చరిత్ర బైరంపల్లికి ఉందని సీపీఐ(ఎం) నాయకులు చంద్రమోహన్ పేర్కొన్నారు. దొరలకు, భూస్వాములకు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ఉద్యమించి కమ్యూనిస్టులు గ్రామాలలో స్వేచ్ఛను అందించారని గుర్తు చేశారు. సెప్టెంబర్ 17, 1948లో నైజం ప్రభుత్వం తన రాజ్యాన్ని భారత ప్రభుత్వంలో విలీనం చేసిన రోజు అని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం చంద్రమోహన్, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కీసర నర్సిరెడ్డి, సర్కిల్ కార్యదర్శులు సిహెచ్ వెంకన్న, ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ నాయకులు మల్లెపాక వీరయ్య, కట్ట శ్రీనివాస్, గంధం మనోహర్, లాట్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

విశ్వకర్మ యజ్ఞోత్సవంలో ఉప్పల శ్రీనివాస్



నవతెలంగాణ- నాగోల్

విశ్వకర్మ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మయజ్ఞం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన విశ్వకర్మ యజ్ఞోత్సవంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంత ర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప్పల సాయి కిరణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు, కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షులు సల్వా చారి, ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షులు పర్వతం శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ విముక్తి కోసం పోరాడింది కమ్యూనిస్టులే'



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

వేలాది అమరుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా తెలంగాణ విలీనం ప్రక్రియ ఆవిష్కృతమైందని సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవ వేడుకలను అబ్దుల్లాపూర్ మెట్ మండలం కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుమారుగా 4 వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని తెలిపారు. వారి త్యాగాల ఫలితంగా తెలంగాణ ప్రజలు నిరంకుశ పాలన నుంచి సేచ్చను పొందారన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన మహోన్నత పోరాటం ప్రపంచ చరిత్రలో చిరస్మరణీయమన్నారు. ఈ పోరాట సంగ్రహంలో దొడ్డి కొమరయ్య, రావినారాయణరెడ్డి భీమిరెడ్డి నరసింహారెడ్డి, షేక్ బందగి, షోయబుల్లాఖాన్, చాకలి ఐలమ్మ మొదలగు వారు తమ జీవితాలను తెలంగాణ కోసం ధారపోశారని గుర్తుచేశారు. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా మొదలైన ఈ ప్రతిఘటన ఉద్యమం క్రమంగా భూ పోరాటం దిశగా మారి దున్నేవాడికే భూమి అని నినదించిందన్నారు. వేలాది గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేస్తూ, సుమారుగా పది లక్షల ఎకరాల భూమిని రైతాంగానికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే అక్రమంగా తాకట్టులో/బందిలో ఉన్న భూమిని విముక్తి చేసి, పశువుల పంపిణీతో పాటు పన్నుల వసూలను రద్దు చేశారన్నారు. బీజేపీ వంటి మతోన్మాద పార్టీలు నేడు తన రాజకీయ అవసరాల దృష్ట్యా రెండు వర్గాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం తగదన్నారు. పోరాటంలో ఏమాత్రం సంబంధం లేని బీజేపీ తెలంగాణ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. తన ఉనికి కోసం బీజేపీ చరిత్రను వక్రీకరిస్తుందన్నారు. ప్రజలు వాస్తవం గ్రహిస్తున్నారన్నారు. ఇది ముమ్మాటికి తెలంగాణ విలీన దినమేనని, విమోచన, విద్రోహ దినం కాదన్నారు. అణచివేతకు, శ్రమ దోపిడికి తావివ్వకుండా యువత పోరాటాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శి నర్సింహ, మండల కమిటీ

నవతెలంగాణ- పెద్ద అంబర్‌పేట్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వెట్టిచాకిరి విముక్తి కోసం, నైజాం రాజు రాచరికపు పాలనకు వ్యతిరేకంగా అన్నీ వర్గాల ప్రజలు చేసిన ప్రజాపోరాటమే తెలంగాణ సాయుధ పోరాటమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ టీ నరసింమ అన్నారు. సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్టు పార్టీ కార్యదర్శి ముత్యాల యాదిరెడ్డి ఆధ్వర్యంలో భూ పోరాట కేంద్రం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్ -3లో ఏర్పాటు చేసిన 76 వార్షికోత్సవ సభకు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ టీ నర్సింహ, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని గుర్తుచేశారు. 10 లక్షల ఎకరాల సాగు భూమిని పేదలకు పంచిపెట్టారని, 3000 గ్రామాలు నిజాం సర్కార్ నుంచి విముక్తి పొందాయని అందుకే ఇది మట్టి మనుషుల ప్రజా పోరాటామని అన్నారు. ఇందులో ముస్లిం, హిందూ, ఇతర మతాల ప్రజలు ఉమ్మడిగా ఉద్యమించారని గుర్తు చేశారు.



చరిత్రను వక్రీకరించి వాస్తవాలను కప్పిపుచ్చి మనుషుల మధ్య చిచ్చు పెడితె ఈ తెలంగాణ సమాజం క్షమించదని హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్య పుస్తకాలలో ప్రచురించాలి, అధికారికంగా ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్ మీద అమర వీరుల విగ్రహాలు నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రాష్ట్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజ్మీర్ హరిసింగ్ నాయక్, వేణుగోపాల్ చారీ, కేతరాజు నర్సింహ, వట్టి నవనీత, కాటి అరుణ, తైలి మధు,శ్రీదేవి, తోకలరాంరెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, మరియు మండల కార్యవర్గ సభ్యులు యేశాల నర్సింహ, పొన్నాల యాదగిరి,చిర్ర శేఖర్ నారాయణ రెడ్డి, నారాయణ యాదగిరి, వినోద్, సుజాత, దేవమ్మ వీరేష్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యులు గుండె శివకుమార్, ముత్యాలు, శ్రీశైలం, జంగయ్య, శ్రీనివాస్, ఆలేటి ఆటం, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- నాగోల్

నిరంకుశత్వం, రజాకర్ల అరాచకాల నుండి విముక్తి చేయడం కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన 4,500 మంది అమరవీరులను ఎప్పటికీ మరువలేమని సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. మంగళవారం నాగోల్ డివిజన్ల సీపీఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉడతల మల్లేష అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ముగింపు సందర్భంగా అమరవీరులను స్మరించుకున్నారు. తర్వాత అరుణ పతాకాన్ని బోడ్డుపల్లి కృష్ణ ఎగిరేయగా.. జాతీయ పతాకాన్ని బి.చుక్కయ్య ఎగరేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు, భవన నిర్మాణ సంఘం, హమాలీ కార్మిక సంఘం, చేతి వృత్తిదారుల సంఘం, ఆటో డ్రైవర్ల సంఘం, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు

నవతెలంగాణ-హయత్ నగర్

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన జాతీయ పతాకాన్ని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవింద్రాచారి, మండల కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశానికి 1947లో ఆగస్టు 15న స్వాతంత్రం వచ్చినా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కాలేదన్నారు. నిజాం తాబేదారులుగా వ్యవరించే వతన్ దారులు, దేశముఖ్‌కులు కుల, మతాలకు అతీతంగా ప్రజలతో గడిల్లో బలవంతంగా వేట్టిచాకిరి చేయించుకునేవారని గుర్తుచవేశారు. ఊళ్ళలో నిత్యం మహిళలపై అఘాయిత్యాలు జరిగేవని, పన్నులు కట్టకపోయినా క్రూరమైన శిక్షలు వేసేవారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి భరించలేని ప్రజలు ఈ కష్టాలు కడల నుంచి బయటపడాలని ఆలోచిస్తున్న క్రమంలో ఆంధ్ర మహాసభ ఉద్యమం ప్రారంభమైందన్నారు. కమ్యూనిస్టు పార్టీ గ్రామాల్లో ప్రజలను సంఘటితం చేసింది రావి నారాయణరెడ్డి, మక్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ రక్షణ కమిటీలు ఏర్పాటు చేశారన్నారు. రైతుల పంటలను బలవంతంగా లాక్కుంటున్న పరిస్థితుల్లో దొరల దౌర్జన్యాలను ఎదిరించిన కామ్రేడ్ ఐలమ్మ లాంటి వీరవనితులకు గుప్పల సంఘం వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. దొడ్డి కొమరయ్యను విసునూరు దేశముక్ గుండాలు కాల్చి చంపారని, గ్రామ గ్రామాల్లో ప్రజలు తిరగబాటుకు శ్రీకారం చుట్టారన్నారు. నిజాంకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఏగిసిన పోరాటంతో తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం



చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశవర్ధన్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి శ్రీదేవి, మహిళా సమైక్య అధ్యక్షురాలు సుజాత, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు నాగరాజు, ఏ.ఐ.వై.ఎఫ్ మండల కార్యదర్శి శోభన్, శాఖ కార్యదర్శులు పారిజాత, అనిత ప్రజానాట్య మండలి మండల సభ్యులు జ్యోతి, నవ్య, సౌజన్య, సుశీల, రేణుక, సోషల్ మీడియా సభ్యులు మమత, వెంకట్, బాలరాజు, ప్రజాసంఘాల నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పలు చోట్ల గణనాథుడి నిమజ్జనాలు, లడ్డూ వేలం పాటలు




టేల్ అండ్ కో ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

నవతెలంగాణ - చంపాపేట్

యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పటేల్ అండ్ కో ఫర్నిచర్ ఎలక్ట్రానిక్స్, పటేల్ ఫర్నిచర్ యజమాన్యం రజినీకాంత్ పటేల్, అశోక్ కుమార్ పటేల్, సుభాష్ పటేల్, కిరీట్ పటేల్, యోగేష్ పటేల్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్, కమిటీ సభ్యులు ఎం.డి సలీం కాజా, సయ్యద్ అబ్దుల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అందుబాటులో ఆశా వర్కర్లు, తాగునీరు



నవతెలంగాణ - చంపాపేట్

గణేష్ నిమజ్జనానికి వెళ్ళే భక్తుల సమస్యలను పరిష్కరించేందుకు సైదాబాద్ డివిజన్ ఏసీపీ ఆఫీస్ వద్ద యూపీ ఎస్ సీ మలక్‌పేట్ నియోజకవర్గం ఆశా వర్కర్లు అరుణ, సుమలత, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఐఎస్ సదన్ చౌరస్తా వద్ద భక్తులకు అన్న డెయిరీ మిల్క్ ఆధ్వర్యంలో తాగునీటిని అందించే విధంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్, కమిటీ సభ్యులు ఎండి సలీం కాజా, సయ్యద్ అబ్దుల్ అజీం, పోలీస్ సిబ్బంది, ట్రాఫిక్ టక్రు నాయక్, లింగస్వామి, సైదులు, శేఖర్, తిరుపతి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ - చంపాపేట్

చంపాపేట్ డివిజన్‌లోని మాధవ నగర్ కాలనీ రోడ్ నెంబర్ సెవెన్‌లో గోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుడి పూజకు టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్, లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు హాజరయ్యారు. వారి వెంట చంపాపేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి, యూత్ నాయకుడు రవి ముదిరాజ్ ,



సుంకోజు కృష్ణమాచారి రాఘవచారి, ఆనగొంది జంగయ్య, కొత్తపేట ప్రభాకర్ ప్రసాద్ గోపాల్ ముదిరాజ్, డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత, బీఆర్ఎస్ మహిళా నాయకురాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చంపాపేట్



ఎల్బీనగర్ నియోజక వర్గం చంపాపేట్ డివిజన్ ఎస్ జి కాలనీ పరిధిలో జై మాతా డి యూత్ అసోసియేషన్ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. తర్వాత ఏర్పాటు చేసిన లడ్డు వేలం పాటలో భక్తులు గుర్రం చంద్రశేఖర్ రెడ్డి పెద్ద లడ్డును రూ.87 వేలకు, చిన్న లడ్డును మహేందర్ రూ.70 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, క్రాంతి రెడ్డి, లక్ష్మణ్, సురేష్, సురేందర్ రెడ్డి, ప్రభాకర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హయత్‌నగర్



మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శివ గంగ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ వేడుకలలో నిర్వహించిన లడ్డు వేలం పాటలో ఒక లక్ష అరవై వేల నూట పదహారు రూపాయలకు శివ గంగ కాలనీ అధ్యక్షుడు తొంట బాబు లడ్డును దక్కించుకున్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డును బడంగ్ పేట్ గ్రామానికి చెందిన గౌర సత్తయ్య కుమారులు గౌర బీరప్ప, గౌర చంద్రయ్య, గౌర సురేష్ లు రూ.11.50 వేలకు కైవసం చేసుకున్నారు.

నవతెలంగాణ- మలక్‌పేట్



మలక్‌పేట్‌లోని హరి హర మైసమ్మ క్షేత్రం వినాయక లడ్డును రూ.60 వేలకు దక్కించుకున్న శృతి ప్రీతిని అభినందిస్తున్న కమిటీ సభ్యులు, అర్చకులు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో గణనాథుడి నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించినట్టు ఆశ్రమ నిర్వా హకులు గట్టు గిరి తెలిపారు. ఈ సందర్భంగా మానసిక వికలాం గులు ఉల్లాసంతో నృత్యాలు చేశారు. గట్టు గిరి ఆశ్రమవాసులతో సరదాగా లడ్డు వేలంపాట వేయించారు.

నవతెలంగాణ - చంపాపేట్

గణేష్ నిమజ్జనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీసీపీ పాటిల్



కాంతిలాల్ సుభాష్, సౌత్ సౌత్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు మొహమ్మద్ ఖాజవుద్దీన్ అన్నారు. యాకూత్ పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం ఐ ఎస్ సదన్ డివిజన్ చంపాపేట్ పరిధిలోని సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సౌత్ ఈస్ట్ జోన్ సౌత్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఖాజా గజవుద్దీన్, పీస్ కమిటీ అధికారుల ఆధ్వర్యంలో పోలీసుల సిబ్బంది, పీస్ కమిటీ సభ్యులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సమావేశంలో ఏసీపీలు వెంకన్న నాయక్, శ్యాంసుందర్, మహమ్మద్ గౌస్, మనోజ్ కుమార్, సీఐలు, ఎస్ఐలు, డీఐలు, పోలీస్ సిబ్బంది, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు స్వాగతం పలికిన దేప భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ- ఎల్బీనగర్

మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్ కొత్త పెట్ లోని గణేష్ నిమజ్జన ఉత్సవాలల్లో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాలల్లోని గణేష్ మండపాల నుండి నిమజ్జనానికి తరలివెళ్ళుతున్న గణనాథులకు స్వాగతం పలికారు. గణేశ్ నిమజ్జన ఉత్సవ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక లో పాల్గొన్న మహాత్మా గాంధీ లా కాలేజ్ చైర్మన్ గంగుల గోవర్ధన్ రెడ్డి మరియు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి గణేశ్ నిమజ్జన ఉత్సవ కమిటీ చైర్మన్ కార్యదర్శిలు మరియు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య సిబ్బందికి మెడికల్ క్యాంప్



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల వ్యాప్తంగా వినాయక నిమజ్జనం ప్రశాంతంగా చేశారు. మంగళవారం శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ పరిశీలించారు. అనంతరం స్వచ్ఛత హీ సేవా 2024లో భాగంగా పారిశుధ్య సిబ్బంది కోసం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అందరికీ వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సునీత, మేనేజర్ శ్రవణ్ కుమార్, ఆర్ఐ భాస్కర్ , శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నవతెలంగాణ- జవహర్ నగర్

అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిద్దేపల్లి రాజేందర్ (40) ఒమేగా ఇండస్ట్రియల్ ప్రయివేట్ లిమిటెడ్, బాలానగర్‌లో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతడి స్నేహితుడు మండే మాణిక్యం (52) ఇద్దరూ బోరబండలో ఉంటూ ఫైనాన్స్ ఇస్తుంటారు. బాలాజీనగర్‌లోని ఆర్‌ఎంపీ పెంటాచారి నుంచి డబ్బులు వసూలు చేసేందుకు సోమవారం రాత్రి బాలాజీ నగర్ వెళ్లారు. పెంటాచారిని కలుసుకునే ముందు విజయలక్ష్మి బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించారు. వారి బైక్ పంచర్ కావడంతో బైక్‌ను అక్కడే వదిలి పెట్టి శ్రీరాం నగర్ కాలనీలోని పెంటాచారి ఇంటికి వెళ్లి డబ్బులు అడిగారు. పెంటాచారి ఇంత నైట్ ఎందుకు వచ్చారనడంతో వారు వరసిద్ధి వినాయక ఆలయం ఎదుట మద్యం సేవించి అక్కడే నిద్రించారు. ఉదయం లేచి చూసే సరికి రాజేందర్ మృతి చెందాడు. అతడి నుదుటిమీద చిన్న గాయం తప్ప, మరే ఇతర గాయాలు కనిపించలేదు. రాజేందర్ అన్నయ్య కృష్ణగౌడ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించినందుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎలిఫెంట్ సర్కిల్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మీర్‌పేట్‌హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన స్థానంలో రాజకీయ దురుద్దేశంతో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టి, తెలంగాణ తల్లిని అవమానించడం దారుణమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17 తెలంగాణ విద్రోహ దినం

- దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ రషీద్ ద్రావిడ, షేక్ షావలి, ప్రజాసంఘాల నేతలు



నవతెలంగాణ - జవహర్‌నగర్

సెప్టెంబర్ 17ను తెలంగాణ విద్రోహ దినంగా పాటించాలని మహ్మద్ రషీద్ ద్రావిడ, షేక్ షావలి, ప్రజాసంఘాల నేతలు అన్నారు. నిజాం ఫ్యూడల్ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించడానికి జరిగిన రైతాంగ సాయుధ పోరాటాన్ని అణిచివేయడానికి చేసిన కుట్రలో భాగమే 1948, సెప్టెంబర్-17న నెహ్రూ-నిజాం విలీన ప్రకటన అని దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మహ్మద్ రషీద్ ద్రావిడ అన్నారు. మంగళ వారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీపీఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి అనుబంధ ప్రజాసంఘాల ముఖ్య నేతల సమావేశం బడిగే వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత యూనియన్ సైనాలు హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో కలుపుకొనే వంకతో నెహ్రూ, హోం మినిస్టర్ పటేల్ ఆడిన డ్రామాలో నైజాం మీద చర్య పేరుతో కమ్యూనిస్టుల నాయకత్వాన వీరోచితంగా వ్యవసాయక విప్లవం విజయవంతం అవుతున్నందున నిజాం, నెహ్రూ సైన్యాలు సంయుక్తంగా కలిసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులపై, ప్రజలు, మహిళలు, రైతులు, కార్మికులు, మేధావులపై విరుచుపడ్డాయన్నారు. హైదరాబాద్ సంస్థానం 1948 వరకు అసఫ్ జాహీ నవాబుల పాలనలో ఉండేదని, దీనినే ఖాల్సా, గైర్ ఖాల్సా అనే రెండు ప్రాంతాలుగా పిలుచుకునే వారని గుర్తు చేశారు. ఖాల్సా ప్రాంతం నవాబు ఆధీనంలో ఉంటే, గైర్ ఖాల్సా జమీందారు, జాగీరుదారి, మక్తాదారి, పాయిగా లు, దేశ్‌ముఖ్‌ల ఆధ్వర్యంలో పాలన ఉండేదని వెల్లడించారు. మరాఠ నుండి-5, కన్నడ నుండి-3, తెలుగు ప్రాంతం నుండి-8 జిల్లాలు కలుపుకొని సుమారు కోటిన్నర పైగా జనాభా కలిగిన హైదరాబాద్ నిజాం సంస్థానంలో తెలుగు ప్రజలే ఒక కోటి జనాభా ఉన్నారని తెలిపారు. కాలం పట్టిన భూస్వామ్య వ్యవస్థను అంతం చేసి, భూమిలేని దళితులు, వ్యవసాయ కూలీలు, రైతులకు, గిరిజనులకు స్త్రీలకు భూమిపై హక్కును కల్పించడానికి జరిగిన పోరాటాన్ని విలీనం, విమోచన, సమైఖ్య పేర్లతో తిరిగి ప్రజలలో దోపిడీ, పీడనలను, ఆచారాలాను, మూఢ నమ్మకాలను అభివృద్ధి నిరోధక విధానాలను పెంచి పోషిస్తున్నారని అన్నారు. భూర్జువా, భూస్వామ్య, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా స్వేచ్ఛ, స్వాతంత్ర పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని రషీద్ పిలుపునిచ్చారు. మత తత్వ శక్తులు ముస్లిం-హిందువులకు మధ్య జరిగిన ఘర్షణగా చరిత్రను వక్రీకరించి, విద్వేష రాజకీయాలతో ప్రజల ఐక్యతను దెబ్బతీసే చర్యలు వేగవంతమయ్యాయన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి, ఐపీఓడబ్ల్యూ రాష్ట్ర కన్వీనర్ పెర్క సునీత, శ్రీనివాస్, సుధాకర్, జమున, పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్.. పెరియార్ జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ హేతువాది ద్రావిడ ఉద్యమ నేత పెరియార్ రామస్వామి జయంతిని కమలానగర్ పార్టీ ఆఫీసులో మంగళవారం నిర్వహించారు. ఈ సభకు స్ఫూర్తి గ్రూపు నాయకులు శ్రీమన్నారాయణ అధ్యక్ష వహించగా పెరియార్ రామస్వామి చిత్రపటానికి ట్రేడ్ యూనియన్ నాయకులు జె. చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. ఆధునిక భారతదేశంలో అనేకమంది సంఘసంస్కర్తలు అభ్యుదయ భావాలతో మత భావాలను చిత్తు చేస్తూ వాస్తవ దృక్పథాన్ని ప్రజల్లో తీసుకెళ్లిన గొప్ప జ్ఞాని అన్నారు. సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ.. పెరియార్ రామస్వామి నాయకర్ అభ్యుదయ ఉద్యమానికి, నాస్తిక భావజాలానికి, భౌతిక దృక్పథానికి పెట్టింది పేరు అన్నారు. ఆయన తమిళనాడులో బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యపరిచి వారి విధానాలను తరిమి కొట్టారని చెప్పారు. మనుషులను కులాలుగా చీల్చి అంటరాని వారిగా చిత్రికరించి బానిసలుగా చేసుకున్నారని, వాటికి వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. తమిళనాడులో ఆయన రూపొందించిన పద్ధతులను నేటికీ ఆచరణీయంగా కొనసాగుతుందన్నారు. విద్యార్థి నాయకుడు శ్యామ్, పెరియార్ రామస్వామిపై పాటను రాసి పాడి వినిపించారు. అనంతరం సబికులందరూ పెరియార్ చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, శివరామకృష్ణ, ప్రసాద్, విద్యార్థి నాయకులు సంతోష్, మునేష్, ప్రశాంత్, రుక్కయ్య, గౌసియా, శోభ, లక్ష్మయ్య, శ్రీనివాస్, వెంకటరమణయ్య, ఉన్నికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ రూ.68 వేలకు ఎస్.హరి కైవసం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని సత్య నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నెలకొల్పిన విఘ్నేశ్వరుడి నిమజ్జన కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవరాత్రుల పూజలు అందుకున్న లడ్డును వేలంపాటలో కాలనీ ప్రెసిడెంట్ ఎస్.హరి రూ.68 వేలకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలం పాటలో విఘ్నేశ్వరుడి లడ్డు ప్రసాదం కోసం ఎంతోమంది పోటీపడి దక్కించుకోవాలనుకున్నారు. కానీ అదృష్టం తనకు దక్కడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం బ్యాండ్ చప్పుల్లు, యువకుల నృత్యాలతో నిమజ్జన ఊరేగింపు చేపట్టి మేడ్చల్ పెద్ద చెరువులో వినాయకుడి నిమజ్జనం చేశారు.

మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలి

- ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద
- వీరనారి చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఎస్ఎస్ లక్ష్మీదేవమ్మ చిత్రపటాలకు నివాళి
- మహాసభకు సంఘీభావం తెలిపిన ప్రజా సంఘాల నాయకులు ఎం. కృపాసాగర్, బి. నర్సింగ్ రావు, గుంటి లక్ష్మణ్





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద అన్నారు. ఐద్వా మల్కాజిగిరి మండల మహాసభను మల్కాజిగిరి సర్కిల్ ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్‌లో మల్కాజిగిరి మండలాధ్యక్ష, కార్యదర్శులు పి. మంగ, ఎస్. నాగమణిల సమక్షంలో ఐద్వా మల్కాజిగిరి మండల మహాసభను నిర్వహించారు. ముందుగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద జెండా ఆవిష్కరించి వీరనారి చిట్యాల ఐలమ్మ మల్లు స్వరాజ్యం, ఎస్ఎస్ లక్ష్మీదేవమ్మ చిత్రపటాలకు పూలమాల వేసి సంతాపం తెలిపారు. ఈ మహాసభకు కేవీపీఎస్ నాయకులు ఎం. కృపా సాగర్, సీఐటీయూ మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు, కేవీపీఎస్ మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్, ఐద్వా గౌరవ అధ్యక్షురాలు మీనా కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, దాడులు హింసను అరికట్టడంలో విఫలమయ్యాయన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలన్నారు. ఫ్రాస్ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని, 33 శాతం రిజర్వేషన్ కాగితాలకే పరిమితమైందన్నారు. దానిని అమల్లోకి తీసుకరావాలని, మహిళల హక్కుల సాధన కోసం మహిళలకు రక్షణ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీజేపీ వచ్చిన నాటి నుండి మహిళలపై హింసలు, దాడులు అధికంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కరువైపోయిందన్నారు. ఎందరో మహిళలు సాయుధ పోరాటంలో మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి పోరాటం చేశారని గుర్తు చేశారు. మహిళా హక్కుల సాధన కోసం వారి ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడారని, వారి స్ఫూర్తితో ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ తిరగబడి, న్యాయం జరిగే వరకూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మద్యం, గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలను అరికట్టాలని మహాసభలో తీర్మానం చేశారు. త్వరలో జరగబోయే రాష్ట్ర మహాసభలను, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు సఫియా సుల్తానా, శ్రామిక మహిళా మండల నాయకురాలు సుమిత్ర, మల్కాజిగిరి మండల కమిటీ నాయకులు, మహిళా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నాటి త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ



- ప్రభుత్వం సంక్షేమానికి కట్టుబడి ఉంది
- ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి
- ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంతోమంది మహనీయుల అసమాన త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అనీ, ఆ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని జిల్లాను అభివృద్ధి పథంలో ముందుంచేందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ జెండాను ఎగరేసి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి జాప్యం లేకుండా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. రుణభారంతో బతుకు భారమైన తెలంగాణ రైతన్న నేడు "రైతు నేస్తం" పథకం ద్వారా అందించే రైతు రుణమాఫీతో రైతులు గర్వంగా తలెత్తుకుని తిరుగుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన "మహాలక్ష్మి" పథకం ద్వారా ఇచ్చిన గ్యారెంటీలతో రాష్ట్రమంతటా బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. "మహాలక్ష్మి" వంట గ్యాస్ సబ్సిడీ పథకం ద్వారా జిల్లాలో రూ.500కే అర్హులైన 74 వేల 457 మంది లబ్దిదారులకు, నేటి వరకు లక్షా 72 వేల 393 గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నట్టు తెలిపారు. గృహజ్యోతితో పేదల ఇంట వెలుగులు, ఆడబిడ్డ కన్నీళ్లు తుడవాలన్న లక్ష్యంతో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా ద్వారా లబ్ద పొందుతున్నారని తెలిపారు. వైద్యం అందక ఏ ఒక్కరి ప్రాణాలు పోకూడదనే ఆశయంతో కొత్తగా 163 రకాల చికిత్సలను చేరుస్తూ, మొత్తం 1,835 రకాల చికిత్సలు, రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు "రాజీవ్ ఆరోగ్య శ్రీ" పథకం ద్వారా సత్వర ఉచిత వైద్యం అందించడమే కాకుండా, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం కింద పాఠశాల విద్యార్థులకు చేసే వైద్య పరీక్షల్లో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. నాణ్యమైన విద్యతోపాటు విజ్ఞాన, నైపుణ్య, సామర్థ్యాలను పెంచుతూ విద్యార్థులను తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు ఆదర్శవంతమైన పౌరులను సమాజానికి అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలను రూపకల్పన చేసి వారి బంగారు భవిష్యత్ కోసం కృషి చేస్తుందన్నారు. మాతా శిశు మరణాల్లేకుండా ఉండేందుకు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే ప్రభుత్వం ద్వారా జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 64,169 మంది పిల్లలకు, 9,358 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఇమ్యూనైజేషన్ అందిస్తుందన్నామని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం "టీ సేఫ్" యాప్ ద్వారా 24 గంటలు రక్షణ కల్పించడానికి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తు అభివృద్ధిలో ముందుకు సాగేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు రాధికాగుప్త, విజయేందర్‌రెడ్డి, డీసీపీ కోటిరెడ్డి, డీఆర్వో హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు సహకరించాలి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం పురపాలక సంఘం ఆవరణలో స్వచ్ఛతహే సేవ 2024 కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2, 2024 వరకు జరుగు స్వచ్ఛతహే సేవ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బండారి.మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ .జీ. రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ కే. చంద్రశేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు ఆఫీసర్లు, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్, మున్సిపల్ బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నరేంద్రమోడీ జన్మదిన వేడుకలు

- నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మోడీ పుట్టినరోజు సందర్భంగా కౌకుంట్ల చంద్రారెడ్డి, గోపికృష్ణ కాలనీ వేణుగోపాల స్వామి గుడి గోశాలకు ట్రక్ పశుగ్రాసం కోసం (వరి గడ్డి) రూ. 21 వేలు ఆలయ చైర్మెన్ జానకి రామ్‌కు అందజేశారు. అనంతరం బీజేపీ నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. మోడీ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని తెలిపారు. దేశమే తన కుటుంబంగా భావించే వ్యక్తి జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ గోవును రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి రామక్కపేట రవీందర్ రెడ్డి, సూర్య శేఖర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జూపల్లి నరేష్, పవన్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న గొల్లూరి అంజయ్య



నవతెలంగాణ-కాప్రా

గణేష్ నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం నాచారం డివిజన్‌లోని ఎర్ర కుంట చెరువు, మీర్‌పేట్ - హౌసింగ్ బోర్డ్ డివిజన్, ఎన్టీఆర్ నగర్ కురుమ సంఘం, కృష్ణానగర్ కాలనీ, తిరుమల్ నగర్ మేరు సంఘం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాగణపతి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వేలంలో గణపతి లడ్డుకు రూ.2.05 లక్షలు



- కాంగ్రెస్ మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ కైవసం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

గణేష్ నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా 9 రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డు ప్రసాదమును ఆనంద్ బాగ్ గణేష్ ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ మండపం వద్ద పూజలు అందుకున్న లడ్డును వేలం పాట వేయగా కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ 2 లక్షల 5 వేల రూపాయలకు లడ్డును కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా గణనాథుని కృపతో లడ్డు దక్కించుకోవడం అదృష్టం గా భావిస్తున్నట్టు తెలిపారు. లడ్డును దక్కించుకున్న గుండా నిరంజన్ కుటుంబ సభ్యులకు కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బి కే శ్రీనివాస్ సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఆనంద్ బాగ్ గణేష్ ని కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు, పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తాం

- కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు
- స్వచ్ఛత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నవతెలంగాణ-బోడుప్పల్

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానా విధిస్తామని పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం ఏడోవార్డు కార్పొరేటర్ మాడుగుల చంద్రకళ చందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాయత్రీ నగర్‌లో స్వచ్ఛతహై సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గాయత్రీ నగర్ స్వచ్ఛతలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. స్వచ్ఛతను పాటిస్తూ ప్రగతికి బాటలు వేద్దామన్నారు. కార్యక్రమంలో ఆర్‌వో శ్రీనివాస్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం జరుపుకోవాలి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

పార్టీలకు అతీతంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం జరుపుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం పురపాలక సంఘ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా చైర్మెన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జి. రాజేంద్ర కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, గ్రామ పెద్దలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కాంగ్రెస్ కార్యకర్త అశోక్ తల్లి మరణించడంతో స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు సోమవారం కాంగ్రెస్ మల్కాజిగిరి మీడియా కన్వీనర్ గుండా నిరంజన్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు మైనంపల్లికి, గుండా నిరంజన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

సురేష్ ముదిరాజ్‌కు పితృ వియోగం



నవతెలంగాణ - జవహర్‌నగర్

జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన గూడెల్లి సురేష్ ముదిరాజ్ తండ్రి గూడెల్లి కొమురయ్య ముదిరాజ్ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న శాసన మండలి డిప్యూటీ చైర్మెన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బండ ప్రకాష్ ముదిరాజ్, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటి కొండ రాజయ్య వారి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు మోరే రవికాంత్ , యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలు, మేడ్చల్ జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు కొండల్, ప్రచార కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, జవహర్ నగర్ అధ్యక్షులు సోమ నర్సింగ్‌రావు, ఎన్టీఆర్ నగర్ అధ్యక్షులు సైదులు, రాజు, వాతపు భూమయ్య, అంబేద్కర్ నగర్ వాసులు సోమయ్య గౌడ్, సిద్దులు యాదవ్, సాయి కుమార్, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.



కొంత మంది ప్రయివేట్ కంపెనీలకు చెందిన యజమానులు కాలం చెల్లిన ఆహార పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో యథేచ్చగా పారబోస్తున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్‌లో పరిధి ఆనంద్ రెడ్డి గోడౌన్‌లోని రా.విన్ గ్రీన్ సంస్థకు చెందిన కాలం చెల్లిన ఆహార పదార్థాలైన జ్యూసులు, ఆహారపు వస్తువులు పరబోస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేసి, జరిమానా విధిస్తామని వెల్లడించారు. - నవతెలంగాణ-మేడ్చల్



సెప్టెంబర్ 17 జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా కూకట్పల్లి క్యాంప్ కార్యాలయం దగ్గర ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాధవరం రంగారావు, బొట్టు విష్ణు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కూకట్ పల్లి

విద్యుత్ సరఫరా తీరు పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

హుస్సేన్ సాగర్ పరిసరాల్లోని ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్ వద్ద జరుగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమంలో విద్యుత్ సరఫరా తీరును పర్యవేక్షిస్తున్న దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, తదితరులు..

విశ్వకర్మ జయంతి వేడుకల్లో పలువురు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం డివిజన్ జగద్గిరిగుట్ట డివిజన్, చింతల్ డివిజన్‌లలో నిర్వహించిన విశ్వకర్మ యజ్ఞం కార్యక్రమంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ విభిన్న నిర్మాణ శైలులకు అధ్యుడు "విశ్వకర్మ" అని అన్నారు. యుగాలు మారిన విభిన్న నిర్మాణ శైలిలు అంటేనే గుర్తువచ్చే దైవం విశ్వకర్మ అని అన్నారు.

సూరారం డివిజన్ పరిధిలో....

129 - సూరారం డివిజన్ పరిధిలోని శివాలయ నగర్0లో నిర్వహించిన విశ్వకర్మ యజ్ఞానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై విశ్వకర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, ఏపీఎస్ చారి, కేశవా చారి, వేణు, శ్రీనివాస్ చారి, నాయకులు దొడ్ల శ్రీనివాస్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో...

126 - జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్ట వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "విశ్వకర్మ యజ్ఞ" కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, ఆలయ కమిటీ చైర్మన్ హన్మంత్ చారి, అధ్యక్షులు శ్రీనివాస్ చారి, జనరల్ సెక్రెటరీ మనోహర్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు చారి, ఉపాధ్యక్షులు తిరుపతి, శ్రీశైలం, శివరాములు, నాయకులు బ్రహ్మానంద చారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు త్రెడ్ ఆర్ట్‌తో రూపొందించిన ఎమ్మెల్యేకు బహుకరించిన ఫోటో ఫ్రేమ్ అందరినీ ఆకట్టుకుంది.

సాయి కాలనీలో...

128 - చింతల్ డివిజన్ సాయి కాలనీలో నిర్వహించిన "విశ్వకర్మ యజ్ఞం" కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి చారి, జిల్లా అధ్యక్షులు భాషంపల్లి రమేష్ చారిలు ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ కుల బాంధవులు కిషోర్ చారి, వెంకటేష్ చారి, కర్ణాకర్ చారి, ఉపేంద్ర చారి, రవీంద్ర చారి, బ్రహ్మాచారి, బాలబ్రహ్మాచారి, రాజు చారి, దేవేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బాలానగర్



విశ్వకర్మ భగవానుడి ఆశీర్వాదం ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని బాలానగర్ మండల విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సేవా సమితి సభ్యులు అన్నారు. మంగళవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ రోడ్డు సమీపంలోని శిరిడి సాయిబాబా కాలనీలోని జ్ఞాన సాయి మందిరంలో నందోరు మోహన కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా బాలానగర్ మండల అధ్యక్షుడు, కమిటీ సభ్యులు కలిసి నాదస్వరం, పతాకావిష్కరణ, పుణ్యా వచనం, గణపతి పూజ, కలశ పూజతో మొదలుకుని విశ్వకర్మ యజ్ఞం పూర్ణాహుతితో ముగిసింది. ఈ కార్యక్రమంలో శ్రీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సేవా సమితి అధ్యక్షులు కాశ రెడ్డప్ప చారి, జల్లిపల్లి శ్రీధర్ చారి, శామీర్పేట గోవిందా చారి, చింతోజు రవికాంత్ చారి, ధర్మవరం హేమ సుందర్ చారి, వడ్ల నగేష్ చారి, వడ్ల రమేష్ చారి, జాలిగామ భరత్ చారి, వడ్ల కాశీ నాథ్ చారి, కాశ సుధాకర్ చారి, చంద్ర చారి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కూకట్‌పల్లి



విశ్వ కర్మ జయంతిని పురస్కరించుకుని యువ స్వర్ణకార సేవా సంఘం కూకట్‌పల్లి కమిటీ అధ్యక్షులు విశ్వనాథ చారి, ఉపాధ్యక్షులు మొహ్మద్ అహ్మద్ ఖాన్, జిఎస్ జన విజయ్ కుమార్, కోశాధికారి, అనిల్ కుమార్ ల ఆధ్వర్యంలో శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనుపమ టవర్స్, భాగ్యనగర్ కాలనీలోని ఏ కే గోల్డ్ వర్క్స్ జ్యువలరీ షాప్ ముందు, విశ్వకర్మ మండపం నిర్మించి అందులో విశ్వకర్మ విగ్రహం ముందు, అనేక మంది విశ్వబ్రాహ్మణులు కుటుంబ సభ్యులతో కలిసి విశ్వ కర్మ భగవాన్ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. తర్వాత విశ్వకర్మ పతాక ఆవిష్కరణ గావించి, కుటుంబ సభ్యులతో కలిసి యజ్ఞంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి టీడీపీ నాయకుడు శ్రీ రామోజు శివకుమార్, కమిటీ సంయుక్త కార్యదర్శి కంసాలి సంతోష్, కిటి సభ్యులు టి శంకర్, ఎస్ సత్యనారాయణ, మాచర్ల మురళీ, దంతనాల సుదర్శన చారి, ఏ. నరేష్, మానికుమార్, శివ, రవీంద్ర చారి, శేష చారి, మణికుమార్, మోర్త నమఃశివాయ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బాలానగర్



కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణి నగర్‌లో గల శ్రీ కట్టమైసమ్మ దేవాలయలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ ఉత్సవ కమిటీ సభ్యులు వసంత రావుచారి, నడిమింటి బాలకృష్ణా చారి, జయరాములు చారి, మోనప్ప చారి, బ్రహ్మయ్య చారి, కృష్ణా చారి, ప్రభాకర్ చారి, రామచంద్ర చారి, వెంకట చారి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'భూమి, భుక్తి, తెలంగాణ విముక్తి కోసం పోరాడింది కమ్యూనిస్టులే'

నవతెలంగాణ - కూకట్‌పల్లి



సెప్టెంబర్17ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఇన్స్పెక్టర్ కే ముత్తు ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేసి వందనం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రోజు ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామకృష్ణ, ఇంద్రసేనా రెడ్డి, చంద్రకాంత్, దీక్షిత, ఇతర పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సెప్టెంబర్ 17 తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కుత్బుల్లాపూర్ సీపీఐ(ఎం) పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కీలుకానీ లక్ష్మణ్ అధ్యక్షతన షాపూర్ నగర్ శుభం హోటల్ దగ్గర సాయుధ పోరాట యోధులకు నివాళులర్పించి.. పార్టీ జెండాను సీనియర్ నాయకులు జి వెంకన్న ఆవిష్కరించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాటం భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం జరిగిందన్నారు. నిజాం నవాబు దొరల జాగీర్దార్ల నిరంకుశ పరిపాలనపై తుపాకీ ఎక్కుపెట్టి బాంచన్ దొర కాలు మొక్కుతా అనే చేతుల తోటే బంధుకు పట్టించిన చరిత్ర కమ్యూనిస్టులదని గుర్తుచేశారు. అలాంటి చరిత్రను వక్రీకరించి కొంతమంది మతోన్మాద శక్తులు ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందూ ప్రజల తిరుగుబాటుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఇంకో బూర్జువా వర్గం తెలంగాణను విముక్తి చేసింది సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలోని పటేల్ సైన్యం అని వక్రీకరిస్తున్నారని చెప్పారు. తెలంగాణన విముక్తి కోసం భీమిరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం రావి నారాయణరెడ్డి ఆరుట్ల రామచంద్రారెడ్డి ఆరుట్ల కమలాదేవి నల్ల నర్సింలు దొడ్డి కొమరయ్య చాకలి ఐలమ్మ నాయకత్వంలో వీరోచిత పోరాటం చేసి నిజాం సర్కార్ మెడలు వంచి భూమిలేని పేదలకు 10 లక్షల ఎకరాల భూమి పంచి..4000 మంది ప్రాణత్యాగం చేసింది కమ్యూనిస్టులేనని అన్నారు. అలాంటి త్యాగాల్ని సమాజం గుర్తు పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జి వెంకన్న, పార్టీ మండల కమిటీ సభ్యులు పి అంజయ్య, పార్టీ నాయకులు కే. శ్రీనివాస్, కరుణాకర్, దుర్గా నాయక్, భాష, కృష్ణ, ఏసు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బాలానగర్



కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల పరిధిలోని శ్రీ శ్రీ నగర్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమర వీరులకు మహిళ సంఘం కార్యదర్శి ఎ. విజయ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, కూకట్ పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్ లు హాజరై మాట్లాడారు. బీజేపీ పార్టీ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తోందనన్నారు. బీజేపీ పార్టీ 1980లో ఏర్పడిందని, సాయుధ పోరాటనికి, బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. సాయుధ పోరాటం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిందని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాటం రజాకార్ల అరాచకం, స్థానిక జమీందార్లు ఏసునూరు రామచంద్రా రెడ్డి లాంటి దొరల అరాచకాలకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటం ముమ్మాటికీ చరిత్రలో చెప్పేది సెప్టెంబర్ 17న భారత దేశంలో తెలంగాణ ప్రాంతం విలీనమైన రోజని, బీజేపీ వక్రీకరిస్తూ విమోచమనడం రాజకీయ లబ్ది కోసమే తప్ప మరేమీ లేదన్నారు. తెలంగాణలో రజాకార్ల పాలన అంతమై ప్రజలు స్వేచ్ఛావాయులు పీల్చుకోగలిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.శంకర్, సత్తయ్య, యాదగిరి, శ్రీను, రాము,



నవతెలంగాణ-దుండిగల్



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దినోత్సవం సందర్భంగా మంగళవారం బాచుపల్లి మండల పరిధిలోనీ రాజధాని స్కూల్ వద్ద సీపీఐ మండల కార్యదర్శి పాలాభిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశీ. యాదయ్య, పరమేష్, మోహన్ రెడ్డి, కృష్ణ, శేషయ్య తదితరులు పాల్గొన్నారు. రాణి, కమల్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బాలానగర్

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కూకట్‌పల్లి మండల పరిధిలోని శ్రీశ్రీనగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. శ్రీశ్రీనగర్ కార్యదర్శి మనోచారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు ఎండీ. ఇక్బాల్, ఎం. దావీద్, నారాయణ్, రాములు, చంద్రమ్మ, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



నవతెలంగాణ - కూకట్‌పల్లి

శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు గోవింద్ హోటల్ చౌరస్తా, శుభోదయ కాలనీ, ఎల్లమ్మ బండ రోడ్డులో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు మాజీ సీఎం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని పవిత్ర భూమిగా మార్చాలని జూన్ 2023 డిజైన్‌కి కూడా పంపించడం జరిగిందని, తర్వాత ఎలక్షన్స్ రావడం వలన ఆ కార్యక్రమం సాధ్యం కాలేదని అన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోనియాగాంధీ మెప్పు కోసం, రాజీవ్ గాంధీ విగ్రహం సచివాలయం ముందు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. డిసెంబర్ 9 ప్రకటన అనేది కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్షకు కూర్చొని, ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన తర్వాత తప్పని పరిస్థితుల్లో ఆరోజు సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ప్రకటించారని, తరువాత సోనియా గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటన వలన సుమారు1200 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని గుర్తుచేశారు. డిసెంబర్ 9 తరువాత ప్రకటన వలన1200 మంది ఉద్యమకారులు చనిపోవడానికి కారణం సోనియా గాంధీ అని, బలిదేవత అని అప్పుడు సీఎం రేవంత్ రెడ్డి అన్నారని.. ఇప్పుడేమో తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన దేవత అంటూ రెండు నాలుకల దోరణి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నిమ్మల సంతోష్, మాచర్ల భద్రయ్య, సతీష్ రావు, ఆంజనేయులు, మధు, పర్వతాల సతీష్, జగదీష్ గౌడ్, శ్రీనివాస్ సాగర్, బాబు, రవీందర్రావు, విద్యాసాగర్, కొండలరావు, ప్రవీణ్, విక్రమ్, యాదయ్య, అరుణ్, ప్రవీణ్ యాదవ్, రంజిత్, సంపత్, మధు, సంతోష్, శ్రీనివాస్, రవి, నవీన్ చానప్ప, సోమయ్య, సంతోష్



నవీన్, వినయ్, హరీష్, మాధవి రెడ్డి, అనిత పాల్గొన్నారు.

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్ఠించాల్సిన చోటా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టిన విషయం తెలిసిందే. దీనికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చిన నేపథ్యంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశాల మేరకు మంగళవారం 130 డివిజన్ సుభాష్ నగర్ లోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పాలభిషేకం చేశారు. తర్వాత తెలంగాణ తల్లికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి...తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యను ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు.. సహా తెలంగాణ వాదులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సూచనల్లో భాగంగా 129 సూరారం డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో వద్ద మంగళవారం స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలతో కలిసి తెలంగాణ



తల్లి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, సిద్దిక్, టాక్ లక్ష్మణ్, ఫెరోజ్, శివ, గుప్తా, లక్ష్మణ్, జమీల్, సాజిద్ విట్టల్, కిరణ్, హేమలతా రెడ్డి , సుభద్ర, కవిత, తార బాయ్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ - బాలానగర్



రాష్ట్ర సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడంపై నిరసిస్తూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం శోభన సెంటర్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా సీనియర్ నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, దేవులపల్లి కృష్ణమూర్తి, ఎలిజాల యాదగిరి, మహిళా విభాగం నాయకురాలు సుధా రెడ్డి, అప్సర, మన్నే శ్రీలత, నాయకులు మహమ్మద్ బాబా, ఆదిముల నాగేష్, నర్రా దేవేందర్ రెడ్డి, రంగంపేట శ్రీనివాస్ ముదిరాజ్, ఎం.ఎస్. కుమార్, మహేందర్ రెడ్డి, సింగజోగి రామేశ్వర్, జల్దేవర్ ప్రేమ్ కుమార్, సూర్య ప్రకాష్, రామచంద్ర చారి, వెంకట చారి, డిట్టకవి గౌతమ్, మానేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి పూజలు, నిమజ్జనాలు, లడ్డూ వేలం పాటలు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజక వర్గం బాలానగర్ డివిజన్ల లోని వివిధ ప్రాంతాలలోని నెలకొల్పిన గణనాథులను కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ. బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి సందర్శించారు. తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దిల్‌సుఖ్‌నగర్ మాజీ ప్రెసిడెంట్ సంపత్ కుమార్, యూత్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్, బాబ్జ్యా, మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఫిషేర్మన్ కమిటీ వైస్ చైర్మెన్ ఆకుల నరేందర్, అల్లాపురం శ్రీనివాస్ గౌడ్, ముఖ్తర్ అహ్మద్, పరమేష్ మరియు కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు ప్రజలందరీపై ఉండాలని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం. ప్రతాప్ అన్నారు. మంగళవారం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని దత్త సాయి రెసిడెన్సి వారు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దత్త సాయి రెసిడెన్సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏ.ఎన్. మూర్తి, పరమేశ్వర్, ప్రభాకర్, సూర్యనారాయణ, శివ,రాజేష్, విల్సన్, మురళి, కోటేశ్వరరావు, నాయుడు, రంజిత్, వినదా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుని లడ్డును రూ.1.22.000లకు దక్కించుకున్న పాండాల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ -జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి చివరి బస్ స్టాప్ సిటిజన్ బ్యాంక్, తెలంగాణ తల్లి విగ్రహ ఆవరణలో స్థానిక ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డు వేలం పాటలో కమిటీ సభ్యులు, సంఘ సేవకులు పాండాల శ్రీనివాస్ గౌడ్ కుటుంబం రూ.1.22.000లకు లడ్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సిహెచ్.భాస్కర్ రెడ్డి, కే.శ్రీ రామరాజు, ఆర్.గిరిబాబు, ఉప్పల రమేష్ గుప్తా, కూరపాటి కరుణాకర్ రాజు, తేరాల శ్రీనివాస్ గుప్తా, బొగ్గుల సురేష్, ఏ.వీరేశప్ప, జగన్ ముదిరాజ్, ఆర్.నరేష్ రెడ్డి, ఎస్.నరేందర్ రాజు, పి. వీరాచారి, అరుణ్ గౌడ్, వి.రామారావు, పి.విశాల్ గౌడ్, పి.వంశీగౌడ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ - కూకట్ పల్లి



కూకట్‌పల్లి నియోజక వర్గం కూకట్ పల్లి డివిజన్‌లోని ఏవిబి పురం, దయారుగూడలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను కూకట్పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావులు సందర్శించారు. తర్వాత ప్రత్యేక పూజలు చేశారు.

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల్లో భాగంగా వేలం పాటలో పివి భాస్కర్ రెడ్డి రూ.3లక్షల 85 వేలకు లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సహకరించిన మిత్రులు నవ్య కాంత్ , సాగర్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొబ్బరంగారావు, మాజీ ఏరియా కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, తెలుగుదేశం నాయకులు ఎస్ వీరబాబు, హరిబాబు యాదవ్, పూర్ణచంద్రగుప్త, రాజారెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ ఉమాదేవినగర్ రోడ్ నెం.6లో స్థానిక విశ్వముఖ యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో చెన్నమాధవుని నవీన రూ.23 వేలకు లడ్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు కళావతి, స్వరూప, గీత, సుధారాణి, రమ, లక్ష్మి ఉమా, స్వర్ణ, బిందు, యూత్ సభ్యులు మహేష్, రోహిత్ శ్రీకాంత్, భరత్, మనోజ్, సాయి పాల్గొన్నారు.



గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 45 సంవత్సరాల గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఎటువంటి చలనం లేకుండా ఫతేనగర్ లోని న్యూ యూనివర్సల్ కిచెన్ కమర్షియల్ ఎక్విప్మెంట్ షాపు ముందు కిందపడి ఓ మహిళ ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని అంబులెన్స్‌ను రప్పించారు. వారు పరీక్షించగా అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. మతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ,గుర్తు తెలియని మహిళా మృతదేహంగా కేసు నమోదు చేసుకుని గాంధీ హాస్పిటల్‌కు మతదేహాన్ని తరలించారు. కావున ఎవరైనా ఈ ఫోటో లోని మహిళను గుర్తించిన యెడల, వెంటనే సనత్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నెంబర్ 9490617132 కు, పోలీస్ స్టేషన్ నెంబర్ 8331013246కు, తెలియపరచాలని పోలీసులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సనత్ నగర్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఫతేనగర్ పార్టీ బస్తీలో నివసిస్తున్న హీరోలాల్ 22 ఏండ్ల కుమార్తె కలవల కరిష్మా మంగళవారం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. తప్పిపోయిన యువతి తెలుగు, హిందీ భాష మాట్లాడుతుందని .ఆమె ఎత్తు అయిదు అడుగులు ఉంటుందని, కలరు తెల్లగా ఉంటుందని ఎవరికైనా ఆచూకీ తెలిసిన యెడల, వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని, లేదా 8331013246 నెంబర్ కు, లేదా 944086 7106 కు కాల్ చేసి తెలపాలని సనత్ నగర్ పోలీసులు తెలిపారు..

ఇక దేవాదాయశాఖ ఆధ్వర్యంలో
ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలు..!

- ప్రతి ఏడాది ఉత్సవాలకు ముందు అంతర్గత కలహాలు, సర్దుబాట్లతో ఉత్సవాల నిర్వహణపై భక్తుల ఆవేదన
- హుండీ ఆదాయంపై ఆరోపణలు
- వివాదాలకు తెర దించి ఉత్సవాలు, నిర్వహించాలంటున్న గణపతి భక్తులు

నవతెలంగాణ - బంజారాహిల్స్



వచ్చే ఏడాది నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలు నిర్వహిస్తారన్న వార్తలు నగరవ్యాప్తంగా చక్కర్లు కొడుతున్నాయి. ఒక్క అడుగుతో ప్రారంభమైన మహాగణపతి ప్రస్థానం ఈ ఏడాది 70 అడుగులకు చేరుకుంది. అంగరంగ వైభవంగా కొనసాగే ఈ ఉత్సవాలకు రాష్ట్రంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకత ఉంది. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బాలగంగాధర్ తిలక్ ప్రేరణతో సింగరి శంకరయ్య ఖైరతాబాద్‌లో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆయన తదనంతరం ఆయన సోదరుడు, కుమారుడు ఉత్సవాలను ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ సహకారంతో నిర్వహిస్తూ వస్తున్నారు. కన్నుల పండువగా సాగే ఈ ఉత్సవాలను తిలకించేందుకు నగరం నుంచే కాక రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తుంటారు. దీంతో నవరాత్రి ఉత్సవాలు జరిగినన్ని రోజులు ఖైరతాబాద్ గణపతి పరిసర ప్రాంతాలు జన సందోహంగా మారిపోతాయి. ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు అడుగు తీసి అడుగు వేసే అవకాశం కూడా లేకుండా జనంతో కిక్కిరిసిపోతుంది ఆ ప్రాంతం.

సుమారు 300 మంది పోలీసులు ఉత్సవాలు ప్రారంభం నుంచి పూర్తి అయ్యేవరకు విధుల్లోనే ఉంటారు. మరో 500 మంది పోలీసుల పహారా నడుమ ఏకదంతుడి శోభాయాత్ర నిమజ్జన ఉత్సవం జరుగుతుందని పోలీసుల అధికారులు తెలిపారు. ఏండ్లుగా సాగుతున్న ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేస్తుంది. ఇందుకోసం స్థానిక పోలీస్ యంత్రాంగం కంటిమీద కునుకు లేకుండా విధులు నిర్వహిస్తుంది. గణనాథుడికి నలువైపులా బారీకేడ్లను బిగించి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడంలో పోలీసుల పాత్ర ఎనలేనిది. ఇంత భారీ మొత్తంలో జరుగుతున్న ఉత్సవాలకు భారీ మొత్తంలో ఆదా యం సమకూరుతున్నా ఆ స్థాయిలో సౌకర్యాలు కల్పిం చడంలో ఉత్సవ కమిటీ విఫలం అవుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.

సాధారణ భక్తులు హుండీలలో వేసే నగదు తో పాటు మహాగణపతి ఉత్సవాలకు విరాళాలు ఇచ్చే వాళ్ళు వేలల్లో ఉంటారు. వీరితో పాటు దేశ, విదేశాలలోని గణపతి భక్తులు నుంచి ఆన్‌లైన్ ద్వారా విరాళాలు వస్తుంటాయి. ప్రకటనల రూపంలో భారీ మొత్తంలో సమకూరుతుంది. దీంతో మహాగణపతికి విరాళాలు ఎంత మొత్తంలో వచ్చాయి...? ఎంత ఖర్చు చేశారు...? అనే విషయాలను ఇన్నేండ్లుగా వెల్లడించకపోవడంతో అనేక అనుమానాలను రేకెత్తిం చాయి. అయితే ఈ ఏడాది సీసీ కెమెరాలు పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. హుండీల నుంచి సుమారు రూ. 75 లక్షల రూపాయల ఆదా యం సమకూరినట్లు, హోర్డింగ్‌ల ద్వారా మరో రూ. 65 లక్షల వరకు వచ్చినట్టు అనాధికరంగా ప్రకటించినట్టు తెలిసింది.

ఇక ప్రతి ఏడాది ఉత్సవాలకు ముందు వివాదాలు చెలరేగడం ఎప్పటికప్పుడు వాటిని చల్లబరుస్తూ ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో లడ్డు ప్రసాదం పంపిణీ విషయాలనూ తీవ్ర వాగ్వాదాలు, ఘర్షణలు జరిగేవని భక్తులు తెలిపారు. దీంతో ఉత్సవాలు ముగిసినప్పటికీ స్థానిక పోలీసులు ప్రత్యేక బందోబస్తు కొనసాగించాల్సి వచ్చేది. లడ్డును ప్రసాదంగా ఇచ్చిన దాతపై సైతం కొందరు దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసినట్టు స్థానికులు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పాటు ఖైరతాబాద్ ప్రజల సహకా రంతో సాగుతున్న ఉత్సవాలను ప్రభుత్వం వివాదాలకు తెరదింపి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించాలని ఏకదంతున్ని భక్తులు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలని వేడుకుంటున్నారు.

లక్షలాదిమంది భక్తుల విశ్వాసాలతో నడుస్తున్న మహాగణపతి ఉత్సవాలు దేవాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తే మరింత బాగుంటుందని వారు అంటున్నారు. లక్షలాది మంది భక్తులు తమకు తోచినంత విరాళాలు ఇస్తున్నారు... ఆ విరాళాలతోనే ఉత్సవాల నిర్వహిస్తు న్నారు. అలాంటప్పుడు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేస్తే భక్తులుగా తమకు సంతోషమేనంటున్నారు. ఘర్షణలకు అవకాశం లేకుండా పోతుందని పారదర్శకంగా జరుగుతుందన్న భావన భక్తులకు ఉంటుంది.

జీహెచ్ఎంసీలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు





నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీలో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆమ్రపాలి కాటతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ పోలీసుల వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడాదైనా స్వేచ్ఛ కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ జాతి చేసిన పోరాటం, రాజరిక పాలన నుంచి విముక్తి పొందిన రోజు సెప్టెంబర్ 17 అని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల స్వయం పాలనలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో 6 గ్యారంటీల అమలుకు ప్రజలు అర్జీ పెట్టుకొనేందుకు అవకాశం ఇచ్చారని, ఆ దరఖాస్తుల పరిశీలన చేసి అర్హత గల కుటుంబాలకు ప్రభుత్వ ప్రయోజనం పొందుటకు యోగ్యత కల్పించారని తెలిపారు. జీహెచ్ఎంజీ వ్యాప్తంగా 28 డిసెంబర్ 2023 నుండి 6 జనవరి 2024వరకు నిర్వహించామన్నారు. ప్రజాపాలనలో 26,48,521 కుటుంబల నుండి 24,74,325 దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, అడిషనల్ కమిషనర్లు యాదగిరి రావు, నళిని పద్మావతి, పంకజ, సరోజ, సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ సీసీపీ గంగాధర్, విజిలెన్స్ అడిషనల్ ఎస్.పీ శ్రీనివాస్, ఏసీపీ పి సుదర్శన్, సీ.ఎం అండ్ హెచ్.ఓ డా. పద్మజ, జాయింట్ కమిషనర్లు ఉమా ప్రకాష్, జయంత్, మహేష్ కులకర్ణి, చీఫ్ ఎంటమాలజిస్ట్ డా. రాంబాబు, ఎస్.ఈ రత్నాకర్, ఆయా విభాగాల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్17 తెలంగాణకు ముమ్మాటికీ విద్రోహమే



- **పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు**

నవతెలంగాణ-ఓయూ

సెప్టెంబర్17 తెలంగాణకు ముమ్మాటికీ విద్రోహమేనని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు అన్నారున పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం ఓయు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద నవీన్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ. సెప్టెంబర్ 17ను విలీనం కాదు,విమోచనం కాదు, తెలంగాణకు ముమ్మాటికీ విద్రోహమే అన్నారు. బ్రిటిష్ పరిపాలనలో ఉన్న 562 సంస్థానాలు భారతదేశంలో 1947 ఆగస్టు 17 అధికార మార్పిడి జరిగిన తర్వాత 559 సంస్థానాలు భారతదేశంలో ఉండగా మిగిలిన తెలంగాణ,జమ్ము కాశ్మీర్, జూనాగడ్ సంస్థానాలు స్వతంత్ర రాజ్యాలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వన వెట్టి చాకిరికి, భూస్వామ్య, పెత్తందారులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం నిర్వహిస్తూ మూడువేల గ్రామీణ ప్రాంతాలను కమ్యూనిస్టు రాజ్యాలుగా ఏర్పాటు చేసుకుని, దున్నేవానికే భూమి అని 10 లక్షల ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిపెట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న నిజాం ఏడో నవాబ్ ఉస్మాన్ అలీ ఖాన్, సైనిక అధిపతి కాసిం రిజ్వీ,రజాకార్లు కమ్యూనిస్టు నాయకుల పై దాడులు నిర్వహిస్తూ హత్యలు కొనసాగిస్తున్న క్రమంలో ప్రజలు తిరుగుబాటు చేసి తమ భూములను రక్షించుకోవడం కోసం కమ్యూనిస్టు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించారని తెలిపారు. భారతదేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువ ఉండటం వలన ప్రజలు ఉద్యమాలు నిర్వహించడంతో తమ ప్రభుత్వానికి ముప్పు ఉందని భావించి ఎలాగైనా తెలంగాణ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలనే దురాలోచనతో ప్రధాని నెహ్రూ- హోం శాఖ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఒక దుర్మార్గమైన చర్య కు పూనుకొని 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో పేరుతో నిజాం నవాబుతో లోపాయికర ఒప్పందం కుదుర్చుకొని తెలంగాణ ప్రాంతంలో ఉన్న కమ్యూనిస్టులను ఊచకోత కోస్తూ మహిళలపై మానభంగాలు చేస్తూ 300 వేల మంది ప్రజలను హతమార్చి భూములను స్వాధీనం చేసుకొని భూస్వాములకు కట్టబెట్టారని ఆరోపించారు. సెప్టెంబర్ 17 వరకు జరిగిన ఈ దురాక్రమణ ముమ్మాటికి విద్రోహం అని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల వారసత్వాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర దేశంలో జరుగుతున్న హిందూ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించినప్పుడు మాత్రమే సాయుధ రైతాంగ పోరాట అమరవీరులకు నిజమైన నివాళులర్పించిన వాళ్లమైతామన్నారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి తీగల శ్యామ్, ఓయూ నాయకులు నవీన్, కె.ఝాన్సీ, యశ్వంత్, సంతోష్, భవిత్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

రూ. 4 లక్షలు పలికిన ఫిలింనగర్ లడ్డూ

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఫిలింనగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 21 అడుగుల భారీ గణనాథుని విగ్రహం వద్ద లడ్డూ వేలంపాట కోలాహలంగా సాగింది. హోరాహోరిగా సాగిన ఈ లడ్డు వేలం పాటలో చత్రపతి శివాజీ నగర్‌కు చెందిన తన్నీరు మదన్, తన్నీరు రాములు కుటుంబ సభ్యులు లడ్డును 4 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యువజన సంఘం సభ్యులు వారికి 108 కేజీల లడ్డూని అందజేసి ఘనంగా సన్మానించారు.



బీఆర్ఎస్‌వీ నేతల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-ఓయూ

సెక్రటేరియట్ ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. కేటీఆర్ పిలుపుమేరకు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయడానికి వెళతారని ఓయూలో హాస్టళ్లలో ఉన్న బీఆర్ఎస్‌వీ నాయకులు మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఓయు పీఎస్ కు తరలించారు. ఓయూ హాస్టల్‌లో నిద్రిస్తున్న సమయంలో పోలీసులు వచ్చి తమను అక్రమంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్వి నేతలు ఆరోపించారు. ఇది ప్రజా పాలన కాదు రాక్షస పాలన అని అన్నారు. తమ ప్రభుత్వం రాగానే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అరెస్ట్ అయిన విద్యార్థి నాయకుల్లో బీఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు , నాయకులు అలకుంట హరి , బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య , నరేష్ , మిథున్ ప్రసాద్ ఉన్నారు.

ఓయూలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో ఆర్ట్స్ కాలేజ్ ఎదుట మంగళవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం నిర్వహించారు. క్యాంపస్, కాన్స్టిట్యూయెంట్ కళాశాల వారు పాల్గొన్నారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ జాతీయ జెండాను ఎగుర వేశారు. ఇది ప్రజాస్వామ్యం, సమగ్రత, పురోగతి విలువలకు విశ్వవిద్యాలయం నిబద్ధతను సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ డి. రెడ్డి నాయక్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ. సైదా తలత్ సుల్తానా , డాక్టర్ బి. రామ్ షెపర్డ్ తో పాటు, వివిధ అధ్యాపకులు, డీన్లు, క్యాంపస్ కాన్స్టిట్యూయెంట్ కళాశాలల ప్రిన్సిపాల్స్, హెడ్స్ , టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ పాలన స్ఫూర్తిని, సమాజంలో ఐక్యత, పురోగతి భావాన్ని పెంపొందించడంలో విద్య ప్రాముఖ్యతను వివరించారు.

నరసింహ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం

ఓయూ కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహా ఆధ్వర్యంలో ఓయూలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమన్ని ఆర్ట్స్ కళాశాల ఎదుట ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వలిగొండ నరసింహ మాట్లాడుతూ కేసీఆర్ నియంతృత్వ కుటుంబ గడీల పాలన నుండి విముక్తి పొంది నేడు తెలంగాణ ప్రజలు నిజమైన ప్రజాపాలనను పొందుతున్నారని తెలిపారు. కుట్రపూరితంగా యూనివర్సిటీలలో చదువుకుంటున్న మొదటి తరం గ్రామీణ ప్రాంత ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మైనార్టీ విద్యార్థులకు ఫెలోషిపులు తీసివేసిన మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా, ఎంతో చైతన్యవంతమైన తెలంగాణ విద్యార్థులు ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ విగ్రహాన్నిసచివాలయం ముందు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ,తెలంగాణ విలువలు, గౌరవాన్ని హేళన చేసేలా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ వారి అనుబంధ విద్యార్థి నాయకుల తీరు సిగ్గు చేటు అని అన్నారు. ఓయూ విద్యార్థి నాయకులు శివ శంకర్, పార్థు, కోటేశ్, మల్లికార్జున్, హరి విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణను విముక్తి చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదే



- **సీపీఐ(ఎం) నాయకులు మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, సీహెచ్ చంద్రశేఖర రావు**

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

భూమికోసం, భుక్తి కోసం పోరాటం చేసి తెలంగాణ విముక్తిని చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదేనని సీపీఐ(ఎం) నాయకులు మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, సిహెచ్ చంద్రశేఖర రావు అన్నారు. మంగళవారం వెంగళరావు నగర్ డివిజన్ మధురానగర్ వెల్లంకి ఫుడ్ చౌరస్తా వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన అమరవీరులకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నివాళ్లర్పించారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను సీపీఐ(ఎం) నాయకులు మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, సిహెచ్ చంద్రశేఖర రావు ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3000 గ్రామాలు విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూ పంపిణీ చేసి నాలుగువేల మంది ప్రాణాలు అర్పించినటువంటి చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. నిజాం రజాకార్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడి ప్రజలను విముక్తి చేసిన సుందరయ్య ,రావి నారాయణరెడ్డి, చాకలి ఐలమ్మ ,దొడ్డి కొమరయ్య వారసత్వంతో తెలంగాణలో ప్రజా సమస్యల కోసం, భూమి కోసం ఇండ్ల సమస్య కోసం ,ఉద్యోగాల కోసం, రైతాంగం గిట్టుబాటు ధర కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి సాంబశివరావు , వెంగల్రెడ్డి ,రాపర్తి అశోక్, వీడి ప్రసాద్, వెంకటరమణ , కృష్ణ ,యాదగిరి తదితరులు పాల్గొన్నారు .



రాంనగర్ రామాలయం రోడ్డులోని చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బీఆర్ఎస్ నాయకులు, నగేష్ ముదిరాజ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగా అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. నవతెలంగాణ - ముషీరాబాద్

జలమండలిలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎండీ అశోక్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరియర్ ఇంటర్నేషనల్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలి

- **బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్**

నవతెలంగాణ-ఓయూ



ద్రవిడ ఉద్యమ పితామహులు పెరియర్ రామస్వామి నాయకర్ ఇంటర్నేషనల్ స్టడీ సెంటర్ దేశ రాజధాని లో ఏర్పాటు చేయాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పెరియర్ జయంతి సందర్భంగా మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెరియర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. దేశంలో పెరిగిపోతున్న మూఢనమ్మకాల నిర్మూలన కోసం, దేశ ప్రజలు విజ్ఞానం వైపు అడుగులు వేయాలంటే పెరియర్ రచనలు ఎంతో అవసరమని అన్నారు. అంబేద్కర్, పూలే ,పెరియర్ భావజాలం వ్యాప్తి చేస్తున్న దళిత బహుజన మేధావులపై దేశవ్యాప్తంగా దాడులు పెరిగాయని ఈ దాడులను అరికట్టాలంటే దళిత బహుజన మేధావులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఎంతైనా ఉందన్నారు. శంభూకుని మొదలు బీఎస్పీ తమిళనాడు అధ్యక్షులు ఆర్మ్‌స్ట్రాంగ్ వరకు అనేకమంది దళిత బహుజన మేధావులపై హత్య రాజకీయాలు పెరిగాయి అని,దీని అరికట్టాలంటే కేవలం ఈ జాతి వర్గాలకు చెందిన మేధావులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. భావితరాల విద్యార్థులు విజ్ఞానం వైపు అడుగులు వేయాలంటే పాఠ్యపుస్తకాలలో పెరియర్ రచనలు పాఠ్యాంశాలుగా చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు ఆరె కంటి శ్రీకాంత్, దేవర కొండ నరేష్, నక్క మహేష్, రేవంత్, శ్రీనాథ్, ప్రసాద్, నందు,యండి. షాబాద్, నరసింహ, రాజు, ప్రవీణ్, పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాని పురస్కరించుకుని పికెట్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ జాతీయ పతాకానీ ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానానికి స్వేచ్ఛ స్వాతంత్ర్యం వచ్చిందంటే.. దానికి కారణం ఉక్కు మనిషి సర్దార్ వలభాయ్ పటేల్ అని, కాంగ్రెస్ పార్టీకి ఆ ఖ్యాతి దక్కుతుందని తెలిపారు. ఇప్పుడు ఏదో ప్రచారం చేసుకుంటూన్న పార్టీలు అప్పటికి ఇంకా పుట్టలేదని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు టబ్బులో నిమజ్జనం

నవతెలంగాణ-కంటోన్మెంట్



పర్యావరణ రక్షించేందుకు తన వంతుగా ఓ బాలుడు ప్రయత్నాలు మొదలు పెట్టాడు. తన తాతా నాయనమ్మలు 9 రోజులపాటు పూజించిన గణపతి విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేయకుండా తానే ఓ టబ్బాలు నిమజ్జనం చేసి అందరికీ ఆదర్శం అయ్యాడు. అందరూ ఆదర్శంగా తీసుకొని ఇండ్లల్లో మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసి ఈ విధంగా ఇండ్లల్లోనే నిమజ్జనం చేసుకుంటే పర్యావరణ రక్షించడమే కాకుండా చెరువుల్లో కూడా కాలుష్యం ఉండదని ఆ బాలుడు ప్రయోగాత్మకంగా చూపించాడు. ఇంతకీ ఈ బాలుడు ఎవరనుకుంటున్నారా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ మనవడు.





సిబ్బందికి పరీక్షలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

స్వచ్ఛతా హి సేవా-2024లో భాగంగా కంటోన్మెంట్ బోర్డు పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటోన్మెంట్ వర్క్‌షాప్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి సిబ్బందికి పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు సీఈఓ. మధుకర్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. బోర్డు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు సన్మానం

నవతెలంగాణ - జూబ్లీహిల్స్



జై భజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రహమత్ నగర్ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద నిర్వాహకులు కాలేరు నవీన్ వంజరి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో కలిసి జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ, వినాయక చవితి ప్రారంభించిన రోజు నుంచి చివరి రోజు వరకు అన్ని మండపాల వద్ద అపరిశుభ్రత లేకుండా, ఎవరు ఆదేశాలు చేయకముందే వారి బాధ్యతగా మండపాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినందుకు వారి రుణం తీర్చుకోలేమన్నారు. ఈరోజు అందరము ఆరోగ్యంగా ఉన్నామంటే పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవల వల్లేనని.. ప్రతి ఒక్కరూ వారిని గుర్తు చేసుకోవాలని అన్నారు.



సంగారెడ్డి చౌరస్తాలోని పల్లవ రెసిడెన్సీ ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమ వద్ద మంగళవారం జరిగిన లడ్డు వేలంపాటలో యశోద హాస్పిటల్స్ డాక్టర్. అమర్ జాదవ్ అత్యధికంగా రూ. 1.12 లక్షలకు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. నవతెలంగాణ-బేగంపేట

నవతెలంగాణ
నవ్య తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
11
బుధవారం సెప్టెంబర్ 18, 2024 www.navatelangana.com

నిమ్స్‌లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో డైరెక్టర్ నగరి బీరప్ప మహనీయుల ఫోటోలకు పూల దండలు వేసి, జాతీయ జెండాను ఎగరేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సెప్టెంబర్ 17 ప్రత్యేకతను, హైదరాబాద్ స్టేట్ ఇండియన్ యూనియన్‌లో కలిసిన విషయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ లీజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రర్ శాంతివీర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు కృష్ణారెడ్డి, లక్ష్మీ భాస్కర్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సదా శివుడు, మార్తా రమేష్, సత్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సఫిల్ గూడ లేక్ పార్క్‌లో వినాయక నిమర్జన సందర్భంగా ఉదయం మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ పరిశుభ్రత, ఏర్పాట్లను పరిశీలించి, శానిటైజేషన్ సిబ్బందిని సమస్యలను అడిగి తెలుసుకుని, సిబ్బందికి సహకరించాలని అధికారులకు సూచించారు. నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కమ్యూనిస్టులే తెలంగాణ సాయుధ పోరాట వారసులు

- బీజేపీకి అనువంత సంబంధం లేదు
- మతోన్మాదులకు మాట్లాడే హక్కు లేదు
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్ సబిత, నాయకులు చింతల యాదయ్య



నవతెలంగాణ-ఘట్కేసర్

భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుండి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించాలని, మతోన్మాదం, కార్పొరేట్ సంస్థలు కలిసి ప్రజలపై చేపిస్తున్న దాడులను ప్రతిఘటించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎన్. సబిత, చింతల యాదయ్యలు అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజీగూడ రాజీవ్ గృహకల్పలో సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట విలీన వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎన్. సబిత, యాదయ్యలు మాట్లాడుతూ.. ఆనాడు దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని బీజేపీ పార్టీ ముస్లింలకు, హిందువులకు మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించి చరిత్రకు వక్ర భాష్యాలు చెప్తున్నదని అన్నారు. దీన్ని తెలంగాణ ప్రజలు తిప్పి కొట్టాలని కోరారు. తెలంగాణలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాగిన మహోన్నతమైన పోరాటంలో దొడ్డి కొమురయ్య, షేక్ బందగి, రాస్ నాయక్, షోయబుల్లాఖాన్ లాంటి ఎందరో వీరులు అసువులుబాసారని అన్నారు. వీళ్లంతా కుల, మతాలతో సంబంధం లేకుండా భూస్వాముల అణిచివేతకు, దోపిడీకి, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన వారిలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డితో పాటు మగ్దూం మొహియుద్దీన్ ఉన్న విషయాన్ని మర్చిపోకూడదన్నారు. అలాంటప్పుడు హిందూ, ముస్లింల మధ్య పోరాటం ఎలా అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో సోయబుల్లాఖాన్, షేక్ బందగి, మగ్దూం మోహినుద్దీన్, జవ్వాద్ రజ్వీ, ఆలం ఖుందుమీరి, షౌకత్ ఉస్మాని తదితర ముస్లిం నాయకులు నిజాంపైన పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రజలను పట్టిపీడించింది, వెట్టిచాకిరి చేయించుకున్న వారిలో విసునూరు రాంచంద్రారెడ్డి, జన్నారం ప్రతాప రెడ్డి లాంటి జమీందారులు, జాగిర్దారులు, దొరలు, దేశ్ ముఖ్ లు, భూస్వాములు, పటేల్, పట్వారిలే మెజారిటీగా ఉన్నారని, వీరి ఆగడాలకు వ్యతిరేకంగానే ప్రజలంతా కుల, మతాలకతీతంగా ఐక్యంగా సాగించిన పోరాటాన్ని మతం పేరుతో ఎలా వక్రీకరిస్తారని ఆయన విమర్శించారు. బీజేపీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులుమితే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజలు వాస్తవ చరిత్రను తెలుసుకోవాలని అన్నారు. వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం, దున్నేవాడికే భూమి కావాలని పోరు చేసిన అమరుల త్యాగాలకు మతం రంగు పులిమే మతోన్మాద చర్యలను ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఇది ప్రజల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా బలిదానం చేసిన రైతాంగ సాయుధ పోరాట అమరుల త్యాగాలను కించపరచడమేనని అన్నారు. అమరులను గుర్తు చేసుకోవడం అంటే, మతోన్మాదుల ఆగడాలకు, కార్పొరేట్ సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూ అమరులు చూపిన బాటలో పయనించడమేనని, నేడు మన ముందున్న కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యురాలు కే అలివేల జి నాగమణి సిహెచ్ అరుణ బి సునీత దేవి ఏ రాణి కే అనసూర్య ఎం సాయమ్మ కే రాజిరెడ్డి ఎస్ ప్రవీణ్ ఎన్ సుబ్బయ్య సరళ కే పార్వతమ్మ బి భారతమ్మ నవనీత లక్ష్మి లలిత వాణి రాజేశ్వరి కే జానకి పుష్ప గౌరీ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణతోనే అభివృద్ధి

- ప్రజాసేవే పరమావధిగా పోలీసులు పనిచేయాలి
- రాచకొండ సీపీ సుధీర్ బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెప్టెంబర్ 17న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో అంబర్‌పేట అర్మ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం స్వాతంత్రం ఏర్పడే నాటికే అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందిందని, రైల్వే వ్యవస్థ, విద్యావ్యవస్థ, కమ్యూనికేషన్స్, అత్యాధునిక హాస్పిటల్స్, రవాణా వ్యవస్థ వంటివి కలిగి ఉందని పేర్కొన్నారు. వివిధ వర్గాలు, కులాలు, మతాలు సంస్కృతులతో తెలంగాణ రాష్ట్రం సామరస్యంతో కొనసాగుతోందని, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణతోనే అభివృద్ధి, సామరస్య వాతావరణం సాధ్యం అవుతుందని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. పోలీసులు పౌర సేవలకు పునరంకితం కావాలని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. ప్రజలతో మమేకమై పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీ డీసీపీ కరుణాకర్, ఏఆర్ అదనపు డీసీపీలు శ్యామ్ సుందర్, వెంకటరెడ్డి, ఏసీపీలు ఇమ్మానువల్, మహేశ్వర్, శైలేష్, నరేందర్, సురేష్, ఆర్ఐలు ఆర్ఎస్ఐతోపాటు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనం





నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో ప్రశాంతంగా వినాయక నిమజ్జనం సాగుతోందని నగర సీపీ సీవీ ఆనంద్ మంగళవారం తెలిపారు. నిమజ్జనోత్సవానికి 25వేల మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జనోత్సవంలో పోలీసులు అలిసిపోకుండా షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్‌లో ఉన్న విగ్రహాలు త్వరగా నిమజ్జనం అయ్యేలా చూస్తున్నామని సీపీ తెలిపారు. గత ఏడాది లాగా ఆలస్యం కాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మండపం నిర్వాహకులతో మాట్లాడి త్వరగా నిమజ్జనం జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. అనుకున్న ప్రకారం ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తయిందన్నారు. బాలాపూర్ వినాయకుడు కూడా త్వరగా నిమజ్జనం అయ్యేలా చూస్తున్నామని, ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. నగరంలో లక్షవిగ్రహాలు ఉండొచ్చని, ఇప్పటికే అధిక శాతం విగ్రహాలు నిమజ్జనం చేశామని, మరో 20 నుండి 30 వేలు విగ్రహాలు పెండింగ్ ఉండొచ్చన్నారు. బుధవారం ఉదయం లోగా నిమజ్జనం మొత్తం పూర్తయ్యేలా చూస్తామన్నారు. నగరవాసులు, నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని, వారి సూచనలు పాటించాలని కోరారు.

జాతీయ జెండా ఎగురవేసిన చైర్ పర్సన్ ప్రణీత



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ జాతీయ జెండా ఎగుర వేశారు. అనంతరం 'స్వచ్ఛత హి సేవ 2024 "కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ,పట్టణ ప్రాంతాల పరిసరాల పరిశుభ్రతపై అవగాహన తడి చెత్త పొడి చెత్త వేరు చేయడంపై ప్రతిజ్ఞ చేయించారు. అందరు కలిసికట్టుగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ .నాగమణి, మున్సిపల్ మేనజర్ వెంకటేశం, కౌన్సిలర్లు కొత్త హేమలత ,వరగంటి వెంకటేష్ ,రామారం శ్రీహరి గౌడ్ , సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, ప్రజా ప్రతినిధులు , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథుడు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయకుని నవరాత్రులను పురస్కరించుకొని మల్కాజిగిరి సర్కిల్ చంద్రబాబు కాలనీ లో కోళ్ళ వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ గణనాథుడు తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలు అందుకొని సోమవారం మల్కాజిగిరి చౌరస్తా మీదుగా సఫిల్ గూడ ట్యాంక్ బండ్ కు అంగరంగ వైభవంగా, డప్పు చప్పులతో నిమర్జనానికి తరలి వెళ్ళాడు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవం సందర్భంగా మల్కాజిగిరిలో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ ఇలాంటి జన్మదినోత్సవం వేడుకలను మరెన్నో జరుపుకోవాలని మనసారా కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈసం రాకేష్, శ్రీనివాస్ ముదిరాజ్, రామకృష్ణ ప్రియతం, నాగరాజు, నవీన్, పాల్గొన్నారు.



విమోచన దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరిసర్కిల్ సర్దార్ పటేల్ నగర్ లోని సర్దార్ పటేల్ విగ్రహానికి మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పూల మాలవేసి, మల్కాజిగిరి చౌరస్తా లో జాతీయ జెండా ఎగురవేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డి.ఎస్ వెంకటేష్, డా.నర్సింహ గౌడ, సోమా శ్రీనివాస్, సునీల్ యాదవ్, రవి, మబ్బు లక్ష్మయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ముషీరాబాద్‌లో ప్రశాంతంగా ముగిసిన వినాయక శోభాయాత్ర

భజనలు, కోలాటాలు, నృత్యాల నడుమ ముగింపు

ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు



నవతెలంగాణ - ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో తొమ్మిది రోజుల పాటు అత్యంత ఘనంగా నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు మంగళవారం వినాయక నిమజ్జనంతో పూర్తయ్యాయి. వినాయక నిమజ్జనం శోభాయాత్ర అర్ధరాత్రి వరకు పోలీసు బందోబస్తు నడుమ యువకుల నృత్యాలు కోలాటాల నడుమ అత్యంత ఘనంగా ముగిసాయి. చిన్నచితక సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నిమజ్జనం మహోత్సవంలోనృత్యాలు డప్పు చప్పుళ్ళు కోలాటాలతో యువకులు, ప్రజలు భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పవిత్రంగా విఘ్నేశ్వరున్ని సాగనంపారు. ఉత్సాహంతో అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ఎటువంటి అలుపు సొలుపు లేకుండా ప్రజలు భక్తి భావంతో నిమజ్జన మహోత్సవాన్ని నిర్వహించారు. ముగింపు ఉత్సవాలలో పోలీస్ సిబ్బంది అధికారులు భారీ బందోబస్తుతో అనునిత్యం ప్రజలకు భద్రతను ఇస్తూ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా తమ వంతు పాత్ర పోషించారు. ఎప్పటికప్పుడు రద్దీని నియంత్రిస్తూ వినాయక మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తెలియజేస్తూ ఆఖరి రోజు వరకు అత్యంత పకడ్బందీగా వ్యవహరించి ప్రజల మన్ననలు పొందారు. ఈ వినాయక నవరాత్రి ఉత్సవాలకు అటు ప్రజాప్రతినిధులు వినాయక మండపాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకమై పార్టీలకతీతంగా ఉత్సవాలలో పాల్గొని తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తూ ఎంతో ఉత్సాహాన్ని నింపారు.

దుర్గం చెరువు వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వినాయకులన ఎ నిమజ్జనం చేస్తున్న భక్తులు





IN THE OF ADDL SENIOR CIVIL JUDGE AT KHAMMAM
O.S. NO. 69/2021

Between :
Shivarathri Raju & 3 others ....Plaintiffs
AND
Bodapothula Rani & 4 others ..... Defendants

To,
S. Jagadeshwara Rao, S/o. Bupathi Rao, Age : 39 yrs, Occ : Business, R/o. 5-3-824/1, Malakunta, Gosha Mahal, Hyderabad.
.....Defendant No.2

మీపై అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఖమ్మం వారి సమక్షంలో మిమ్ములను ప్రతివాది నెం. 2గా Declaration of tittle and recovery of posession దావా వేసియున్నారు. కావున మీరు గాని మీ న్యాయవాది ద్వారా గానీ **ది.30.09.2024 ఉ.గం. 10.30 ని॥లకు** కోర్టు వారి ముందు హాజరు కాగలరు. లేని యెడల మీపై చట్టప్రకారం తదుపరి ఆదేశములు జారీ చేయుదురు.

// కోర్టు వారి అనుమతితో//
ఎంకె. జలీల్
ఎస్‌కె. అక్బర్‌పాషా
ఖమ్మం అడ్వకేట్స్, ఖమ్మం.
ది.17.9.2024 సెల్ : 9399311674

PASSPORT MISSING

I, THUDI KRUPAKAR S/o.THUDI GOPAL REDDY R/o.1-218,Nandhi pahad, Miryalaguda, Nalgonda-508207,TS, I Have Lost My Pass port No.G-8168145 DOI,11/04/2008 AT While Traveling in Jublihills Area at Hyderabad ,if any-body Found-9666515353.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR:NIZAMABAD
ARB No.78 of 2024

Between:
Kapil Chits (Hyderabad) Pvt. Ltd., Kamareddy Branch. ...Disputant
And
Kakarla Sarika & Others ...Opponents

TO,
1.Kakarla Sarika, W/o.Naresh, Age: 30yrs, Occ:Software Engineer, O/o.US Technology International Pvt Ltd., at Madhapur Hyderabad, R/o.H.No:2-23-501/2, Plot No:535/1, HMT Hills, Kukatpally, Near: Ramayalam Temple,Hyderabad-500085. Cell No:7893780682.
5.Chakravarthula Naresh, S/o. Srinivas Charyulu, Age: 31yrs., Occ: Sr.Network Engineer L2, O/o. Metmox Software Solutions India Pvt Ltd., at Hyderabad, R/o.H.No: 2-23-501/2, Plot No: 535/1, H.MT Hills, Ramalayam Temple, Kukatpally, Hyderabad-500085. Cell No: 9963520304.
6.Kakarla Praveen Kumar, S/o. Srinivasa Chary, Age: 41yrs., Occ: Fucntional Lead, O/o.Cognizant Technology Solutions India Pvt Ltd., at Hyderabad, R/o.MIG-II-22 2, 2nd Floor, Phase 9, K.P.H.B Colony, Kukatpally, Hyderabad-500085. Cell No: 9052661688.
9.Merugu Mallikarjun, S/o.Laxmi Narayana, Age: 42 yrs., Occ: Asst Director, O/o.Heritage Department, Dist: Karimnagar, R/o.H.No:10-2-3 72, Vidyanagar, Dist: Karimnagar-505001. Cell No:9908480427.
...Opponent No.1,5,6 & 9

NOTICE

WHEREAS the disputant Chit Fund Company, has instituted the above said dispute for recovery of money and the same is posted for your appearance in the said Court on the 09-10-2024 by 11:00 A.M. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.

// BY ORDER OF THIS OFFICE //
Sd/-
DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, NIZAMABAD

పబ్లిక్ నోటీసు

మహారాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఒంగోలు
O.S.No.400/2019

Between తన్నీరు ఈశ్వరమ్మ ...... వాది
మరియు
పల్లపు బ్రహ్మయ్య మరియు ఇతరులు ..... ప్రతివాది

To, (D2) తన్నీరు గోవిందమ్మ, భర్త నరసింహం
(D4) పల్లపు అనిత, భర్త శ్రీను
(D6) పల్లపు సంధ్య, తండ్రి శ్రీను
(D7) పల్లపు వెంకటరావు, తండ్రి రాజు
(D8) పల్లపు రమణయ్య, తండ్రి రాజు
(D9) తన్నీరు రమణమ్మ, భర్త ఏడుకొండలు
(D10) తన్నీరు పద్మ, భర్త శ్రీను
(D11) పల్లపు సుబ్బారావు, తండ్రి రాజు

D2,D4,D6,D7,D8,D9,D10 మరియు D11 ల నివాసము ప్లాట్ నెంబర్ 450, గౌతమ్ నిలయం, సుభాష్ నగర్,జీడిమెట్ల,కుత్బుల్లాపూర్ మండలం, మేడ్చల్ జిల్లా, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.

D14, పల్లపు సురేష్ తండ్రి కోటయ్య నివాసము సుభాష్ నగర్, హనుమాన్ గుడి దగ్గర, కుత్బుల్లాపూర్ మండలం, మేడ్చల్ జిల్లా, హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రం.

పై దావాలో వాది మీపై బాగా పంపిణీలు కొరకు దావా వేసుకొని యున్నారు. ఆ దావాలో మీరు ప్రతివాదులు అయి వున్నారు. మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిచినను మీరు నోటీసు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపర్ ప్రకటన ద్వారా కోర్టువారు మీకు నోటీసు జారీ చేయమని ఆర్డర్ చేసియున్నారు. కావున మీరు ది.14.10.2024 ఉదయం గం॥10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ వకీలు ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేని యెడల మీ పరోక్షి యందు దావా తీర్మానించబడునని తెలియపరచడ మైనది.

"కోర్టు వారి ఉత్తర్వులు మేరకు"

ఇట్లు... **నాగిశెట్టి మోహన్‌దాస్, మామిడాల మనోహర్,** అడ్వకేట్స్, ఒంగోలు.

IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S.No.915 OF 2024

BETWEEN:
NemayMalick& another ...Plaintiffs
AND
MinuMaji& another ....Defendants

To
Malik Iqbal Mahammed Khan, S/o Late Najeeb Mohammed Khan Mandozi R/o H.No.3-6-146/B. Street No. 17, Himayath Nagar, Hyderabad
...Defendants No.2

Please take notice the suitin OS No.915 of 2024on the file of the Hon'ble XX Junior Civil Judge, City Civil Court, at Hyderabad for suit filed for Cancellation of Sale Deed in respect of Document No. 859 of 2022, dated 04.02.2022 Executed by Defendant No.2 in Favour of Defendant No.1 is Null and void and not binding on the Plaintiff.The same is pending the above suit stands posted on 04-10-2024 for your appearance. You may either appear in person or through your Counsel/Advocate in the said Court at 10:30 a.m. In case if you fail to attend on the above-mentioned date, before the above Court the suit will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
B.N. KUMAR
P.NAGAIAH
Advocates
Office at 7-2-76, SajjanLal Street, Near Monda Market, Secunderabd-03 9110583800

IN THE COURT OF THE HON'BLE XX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :HYDERABAD
I.A.No.187 OF 2024
IN
O.S.No.915 OF 2024

BETWEEN:
NemayMalick& another ...Petitioners/Plaintiffs
AND
MinuMaji& another ....Respondents/Defendants

To
Malik Iqbal Mahammed Khan, S/o Late Najeeb Mohammed Khan Mandozi R/o H.No. 3-6-146/B. Street No. 17, Himayath Nagar, Hyderabad
....Respondents/Defendants No.2

Please take notice in the above-mentioned I.A.No. 187 of 2023 in OS No.915 of 2024 for Perpetual Injunction. I filed the above IA the same is pending on the file of the Hon'ble XX Junior Civil Judge, City Civil Court, at Hyderabad the above IA stands posted on 04-10-2024 for your appearance. You may either appear in person or through your Counsel/Advocate in the said Court at 10:30 a.m. In case if you fail to attend on the above-mentioned date, before the above Court the suit will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
B.N. KUMAR
P.NAGAIAH
Advocates
Office at 7-2-76, SajjanLal Street, Near Monda Market, Secunderabd-03 9110583800

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR:NIZAMABAD
ARB No.188 of 2024

Between:
Kapil Chits (Hyderabad) Pvt. Ltd., Kamareddy Branch. ...Disputant
And
Panem Ujwala & Others ...Opponents

TO,
1.Panem Ujwala, D/o.Srinivasulu, Age:36 yrs, Occ: Private Employee R/o.Plot No:19, S.BI Colony, Bachupally Road, Dist: R.R.-500118.Cell No: 9985851158.
2.Jagannadham Vamsedhar, S/o. Punnaiah, Age:51 yrs., Occ:Assis tant Divisional Engineer, O/o.C.E/ Commercial/B.P.P & I.P.P-1/A.P.P. C.C, A.P.TRANSCO, Vidyut Soudha, Dist: Vijayawada, R/o.H. No:12-11-171/1/10, Flat No: 206, MNR Apartments, Warasiguda, Uppper Basthi, Secunderabad, Hyderabad-500061. Cell No: 8639611839.
3.Jagannadham Vasavi, W/o. Sreenivasulu, Age: 53yrs, Occ: Joint Commissioner, O/o.Appellate Joint Commissioner,Secunderabad Division, Hyderabad, R/o.H.No:5-9-31/1, Flat No: 302, Bhatnagar Residency, Near: Liberty Cross Road,Basheerbagh, Hyd-500080. Cell No: 9949998264.
4.Katta Mallikarjuna Rao, S/o. Babavali, Age:51yrs., Occ:D.GM, O/o.Bharat Electronics Limited at Hyderabad, R/o.H.No:1-2-288/45/ F402, Priyanka Enclave, S.B.H Colony, Domalguda, Himayath nagar, Hyderabad-500029. Cell No: 9848778363.
6.Panem Mahesh, S/o.Malakon daiah, Age:38yrs., R/o.H.No:11-3-2 2/1, Brundavanam,Dist: Kandukur Prakasam-523105. Cell No: 9985851158.
7.Undralla Vasudha, W/o. Srinivasulu, Age: 55yrs., R/o.H.No: 11-3-36/1, Brundavanam, Dist: Kandukur Prakasam-523105. Cell No: 9985851158.
...Opponent No.1 to 4,6 & 7

NOTICE

WHEREAS the disputant Chit Fund Company, has instituted the above said dispute for recovery of money and the same is posted for your appearance in the said Court on the 23-10-2024 by 11:00 A.M. If you failed to attend the said Court on the said date, the matter will be heard and decided as Exparte.

// BY ORDER OF THIS OFFICE //
Sd/-
DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, NIZAMABAD

PASSPORT MISSING

I, RANBOTHU SRAVANI W/o. THUDI KRUPAKAR R/o.1-218, Nandhipahad, Miryalaguda, Nalgo nda,TS. I Have Lost My Passport No.G-8629440,DOI 12/05/2008 AT While Traveling in Jublihills Area at Hyderabad, if anybody found Ph: 7032152344.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE, AT SANGAREDDY
OS.No. 277 OF 2019

BETWEEN:
Patlolla Vittal Reddy and others ...Plaintiffs
AND
P.Venkat Reddy and others ...Defendants

To,
1. G. Narsing Rao S/o. G. Venkat Rao, Aged about 68 years, R/o. H.No: 3-85/1, kukatpally, Balanagar Mandal, Hyderabad, R.R District.
(Defendant No.7)
2. G. Krishna Rao S/o. G. Venkat Rao, age: 55 years, Occ: Business, R/o. H.No.3-85/1, Kuka-tpally, Hyderabad
(Defendant No.8)

Take notice that, the above case vide OS.No.277/2019 stands posted to 26-09-2024 at 10.30 a.m. for your appearance before the Hon'ble II Additional District Judge, Sangareddy. In default of your appearance on that day the matter will be heard ex-parte and decided accordingly.

//BY ORDER OF THE COURT//
(B. ANIL REDDY),
Advocate,
Sangareddy.
Ph: 9441079640

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE, AT SANGAREDDY
OS.No. 757 OF 2019
in
OS.No. 277 OF 2019

BETWEEN:
Patlolla Vittal Reddy and others ...Petitioners/ Plaintiffs
AND
P.Venkat Reddy and others ...Respondents/ Defendants

To,
1. G. Narsing Rao S/o. G. Venkat Rao, Aged about 68 years, R/o.H.No: 3-85/1, kukatpally, Balanagar Mandal, Hyderabad, Rangareddy District.
(Respondent No.7)
2. G. Krishna Rao S/o. G. Venkat Rao, age: 55 years, Occ: Business, R/o. H.No.3-85/1, Kukatpally, Hyderabad
(Respondent No.8)

Take notice that, the above case vide IA.No. 757/2019 in OS.No. 277/2019 stands posted to 26-09-2024 at 10.30 a.m. for your appearance before the Hon'ble II Additional District Judge, Sanga-reddy. In default of your appear-ance on that day the matter will be heard ex- parte and decided accordingly.

//BY ORDER OF THE COURT//
(B. ANIL REDDY),
Advocate,
Sangareddy.
Ph: 9441079640

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, R.R (D), AT: KUKATPALLY
I.A.No.1437 OF 2022
&
I.A.No.1438 OF 2022
IN
O.S.NO.1258 OF 2022

Between:
Smt.M.Shantha Ratnam Rep by her GPA Holder, called the "ATTORNEY HOLDER Smt. G.Sudha Rani, D/o.Smt.M.Shantha Rathnam, W/o.G.John Vicliff, Age 42Yrs, Occ:House wife, R/o.2-105, Himagiri Nagar, Gandamguda, Bandlaguda Jagir, Hyderabad-91.
...PLAINTIFF
And
1.N.V.Ramanaiah, S/o: Narsimhaiah, Age: 80Yrs, Occ: Agriculturist, R/o:HNo.4-1-624, Troop Bazar, Hyderabad. D4
2.Smt.Ganagarm Vaddey Yellamma, W/o.Late.Sathaiah, Occ: House Hold, age: 90 Yrs, ...D5
3.Sri.Vaddey Krishna, S/o.Late. Sathaiah, Occ:Plumber, age:60Yrs ...D6
4.Smt.Vaddey Ponnamma, W/o. Venkataiah, Occ:Labour,age 65Yrs ...D7
5.Sri.Vaddey Ramaswamy, S/o. Late. Sathaiah, Occ: Electrician, age 61 Yrs, ...D8
6.Smt.Vaddey Mallamma, W/o. Narsimha, Occ:Labour, age 57 Yrs ...D9

Defendants No. 5 to 9 are resi-dents of 1-66, Gopanpally Village, Serilingampally Mandal, R.R. Dist.
...DEFENDANTS 4-9

NOTICE

The Hon'ble Court in its order dated:30/07/24, directed about the service of Notice by way of Paper Publication for Defendants No.s 4 to 9, thereby you all are hereby informed that the case is posted for your appearance before the Hon'ble Court **on 18/10/24 at 10.30 AM,** Without fail otherwise the case will be decided in your absence.

Sd/-
Y.Balaji, T.Sireesha
Advocate,
Road No.13, Banjara Hills, Hyderabad.

నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
హైదరాబాద్
12
బుధవారం | సెప్టెంబర్ 18, 2024 | www.navatelangana.com







ఎటు చూసినా కోలాహలమే

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం

- నిమజ్జనోత్సవానికి భారీగా తరలి వచ్చిన భక్తులు
- ఆటాపాటలతో మారుమోగిన నిమజ్జన ప్రాంతాలు
- మధ్యాహ్నం3 గంటలకే 50 శాతం పూర్తి
- ఫలించిన పోలీసుల వ్యూహం

నవతెలంగాణ-సిటీబ్యూరో

చిన్నారుల కేరింతలు.. యువకుల నృత్యాలు.. బ్యాండ్ మేళాలు.. డప్పు, డోలు కళకారుల విన్యాసాలు.. పిల్లాపాపల కోలాటాలు.. భక్తి శ్రద్ధల మధ్య 'మహా' నగరంలో అత్యంత వైభవంగా వినాయక విగ్రహాల నిమజ్జనం కనుల పండువగా కొనసాగింది. ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన స్వాగత వేదికల నుంచి భక్తులు గణనాథులకు ఘనంగా స్వాగతం పలికారు. స్వాగత వేదికల వద్ద పెద్దఎత్తున నిర్వహకులు, యువతీ యువకులు, మహిళలు చేరి గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ గణనాథులను తీసుకొస్తున్న వారికి పులిహోరా పొట్లాలు, వాటర్ ప్యాకెట్లను అందించారు. ఈ క్రమంలో హుస్సేన్ సాగర్‌కు తరలుతున్న గణనాథులతో, ప్రజల ఆటపాటలతో నగరం సందడిగా మారిపోయింది. ఎటుచూసినా కోలాహలమే కనిపించింది. ఉదయం 8గంటల నుంచి అర్ధరాత్రి వరకు నగరంలో ఎక్కడ చూసిన సందడి వాతవరణం వెల్లివిరిసింది. అత్యంత కోలాహలంగా ఖైరాతాబాద్ భారీ వినాయకుడి నిమజ్జనం మధ్యాహ్నం 1:40 నిమిషాలకు పూర్తి చేయగలిగారు. ఈ వేడుకను వేలా మంది ప్రత్యక్షంగా తిలకించారు. ప్రతిష్టాత్మకమైన ఖైరతాబాద్ భారీ వినాయకుడి నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.





భద్రత కట్టుదిట్టం

నగరంలో జరుగుతున్న నిమజ్జనోత్సావ ఏర్పాట్లను పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. మధ్యా హ్నం వరకు 50 శాతం గణనాథులను నిమజ్జనం చేయడంతో పోలీసుల వ్యూహం ఫలించింది. నగరంలో గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 25వేల మందితో హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిల్లో అత్యంత కట్టుదిట్ట మైన భద్రత, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ప్రశాంత వాతావరణంలో ఈ వేడుక కొనసాగుతోంది. బాలాపూర్, చార్మి నార్, మదీనా మీదుగా మొహంజాయి వర్కెట్, నాంపల్లి, లిబర్టీ మీదుగా వినాయకుటు తరలి వచ్చాయి. సికింద్రాబాద్, మెహదీ పట్నంతోపాటు దాదాపు 100 మార్గాల నుంచి గణనాథులు తరలివచ్చారు. నిమజ్జనం ర్యాలీ ప్రశాతంగా కొనసాగింది. భక్తులు గణపతి బొప్ప మొరియా అంటూ అర్థరాత్రి వరకు గణనాథులు హుస్సేన్ సాగర్‌కు చేరుకున్నాయి. దాంతో ట్యాంక్ బండ్ ప్రాంతం జన సంద్రమైంది. వివిధ రకాల అలకంరణలతో తరలిన గణనాథులకు స్వాగతం పలికారు.

శోభాయాత్ర మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు

నిమజ్జనం కోసం బాలాపూర్ మొదలుకుని పాతబస్తీ మీదుగా ట్యాంక్ బండ్‌కు శోభయాత్ర కొనసాగింది. గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అయితే పాతబస్తీ, మొహంజాయి మార్కెట్‌తోపాటు తదితర ప్రాంతాలల్లో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్ర ఉదయం 6.32 గంటలకు ప్రారంభమైంది. సుమారు 7 గంటల పాటు కొనసాగిన యాత్ర ఖైరతాబాద్, వాసవి సేవా కేంద్రం, టెలిఫోన్ భవన్, సెక్రటేరియట్, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ట్యాంక్ బండ్ వద్దకు చేరుకుంది. అంతకుముందు టెలిఫోన్ భవన్ వద్ద గంటపాటు శోభయాత్ర నిలిచిపోయింది. 10.36కు అక్కడి నుంచి బయలుదేరి 11.14కు సచివాలయం వద్దకు చేరుకుంది. క్రేన్ నంబర్ 5 వద్ద 12.12కు శివపార్వతుల కళ్యాణం, 12.20గంటలకు శ్రీనివాస కళ్యాణం నిమజ్జనం ముగిసింది. మధ్యాహ్నం 12.25కి సూపర్ రైస్ క్రేన్ నెం.4 వద్దకు మహాగణపతి చేరుకోగా.. గంట పాటు మహా గణపతికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చివరి పూజలు నిర్వహించారు. ఇదే సమయంలో భక్తుల తాకిడి పెరిగింది. ఇక కలశపూజ, భక్తులకు మంత్ర జలం.. అనంతరం 1.39 గంటలకు ఖైరతాబాద్ గణపతిని నిమజ్జనం చేశారు. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం పూర్తికావడంతో సందర్శకులు, ప్రజలు తిరిగి ఇంటి ముఖం పట్టారు.











ఆకట్టుకున్న సీఐటీయూ ప్రజాసంఘాల స్వాగత వేదిక..



నవతెలంగాణ - ధూల్ పేట్

హైదరాబాద్‌లో మతసామరస్యానికి ప్రతీకగా వినాయక వేడుకలు జరుగుతున్నాయని ఐద్వా, సీఐటీయూ నేతలు పి.శశికళ, జి.విఠల్ పేర్కొన్నారు. జియాగూడలో ఏర్పాటు చేసిన ప్రజాసంఘాల స్వాగత వేదిక నుండి వినాయక నిమజ్జనం కు బయలుదేరిన భక్తులకు వినాయక విగ్రహాలకు వారు పూలతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేదిక పైనుండి వారు మాట్లాడుతూ.. విభిన్న సంస్కృతి సాంప్రదాయాలలో విరాజిల్లింది మన భారతీయ ప్రత్యేకత అన్నారు. సీఐటీయూ నేతలు చుక్క నరసింహ, పి.నాగేశ్వర్, డి.కురుమూర్తి, పిఎస్ఎం నేత శ్రీశైలం, డీవైఎఫ్ఐ నేత ఏ. రాజుబాయి, ఐద్వా నేతలు డి సుశీల, విజయ లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టడానికే బీజేపీ విమోచన రాగం



- ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు బి ప్రదీప్

నవతెలంగాణ-ముషీరాబాద్

సెప్టెంబర్ 17 1948న తెలంగాణకు విద్రోహమే జరిగిందని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు బి ప్రదీప్ అన్నారు. మంగళవారం విద్యానగర్ న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యాలయం మార్క్స్ భవన్‌లో స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రదీప్ మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాటం చారత్రాత్మకమైనదన్నారు. ఆనాడు కమ్యూనిస్టు విప్లవకారులు ప్రజలు కలిసి నైజాం నవాబుకు, గ్రామాల్లో ఉండే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. దున్నే వారికే భూమి కావాలని మట్టి మనుషులు చేసిన పోరాటాన్ని నేడు బీజేపీ వక్రీకరిస్తుందన్నారు. హిందూ ముస్లిం అనే భేదం లేకుండా నాడు సాయిధరైతంగా పోరాటాన్ని నడిపితే నేడు ఆ పోరాటాన్ని ముస్లిం రాజు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా మాత్రమే చిత్రీకరించడం సరైనది కాదన్నారు. నైజం రాజు ముస్లిం అయినప్పటికీ గ్రామాల్లో ప్రజలను హింసించి వారి ధనమాన ప్రాణాలను హరించింది దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు అన్నారు. వీరికి నిజాం రాజు మద్దతుగా ఉన్నారన్నారు. ఈ పోరాటం ద్వారా పేద ప్రజలు వెట్టిచాకిరి నుంచి విముక్తి అయ్యారని.. 10 లక్షల ఎకరాల భూములను సాధించుకున్నారన్నారు. 3000 గ్రామాల్లో సొంత పరిపాలన ద్వారా గ్రామ స్వరాజ్య పాలనను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఎలాగైనా ఈ పోరాటాన్ని అణిచివేయాలని నిజం రాజు, పటేల్ నెహ్రూ సైన్యాలతో కుమ్మక్కై ఆపరేషన్ పోలో పేరుతో తెలంగాణపై దురాక్రమణను కొనసాగించారన్నారు. వీరి పోరాటం నిజం నవాబుకు వ్యతిరేకంగా జరిగినట్టయితే నిజాం నవాబు లొంగిపోయిన తర్వాత 1951 దాకా ఎందుకు సైనిక చర్యను కొనసాగించారని అన్నారు. నిజాం నవాబుకు నెహ్రూ ప్రభుత్వం ఎందుకు "రాజ్ ప్రముఖ్" పేరుతో బిరుదును ప్రకటించింది అన్నారు. నెహ్రూ ప్రభుత్వం అప్పటివరకు ప్రజలు సాధించుకున్న హక్కులను కాలరాసి వారు సాధించుకున్న భూములను మళ్లీ భూస్వాములకు పంచిపెట్టిందన్నారు. ప్రజల ధన మానప్రాణాలను హరించి 4000 మంది కమ్యూనిస్టు విప్లవకారులను లక్షలాదిమంది ప్రజలను చంపి వేసిందన్నారు. అందుకే సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు ముమ్మాటికి విద్రోహమే అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, సంస్కరణ వాద పార్టీలు విలీనం ,స్వాతంత్రం, ప్రజా పాలన దినోత్సవం, సమైక్యత దినోత్సవం పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నాయి అన్నారు. బీజేపీ మహత్తర తెలంగాణ సాయుధ రైతన్న పోరాటానికి మతాన్ని పులిమి రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తుందన్నారు. పీఓడబ్ల్యూ జాతీయ నాయకులు జీ.ఝాన్సీ,రాష్ట్ర అధ్యక్షులు జి అనసూయ, ఉపాధ్యక్షులు గీత, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, మహేందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పీ.మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్యామ్, ఆసిఫ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

పాడైన గులాబ్ జామున్ వడ్డిస్తున్నారంటూ ఫిర్యాదు

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఓ హెూటల్‌ఖు పాడైపోయిన స్వీట్లు అమ్ముతున్నా రని ఓ బాధితుడు ఫిర్యాదు చేసిన ఘటన సుల్తాన్ బజార్ పరిధిలో చోటు చేసు కుంది. ఇన్ స్పెక్టర్ శ్రీనివా సాచారీ వివరాల ప్రకారం... జీహెచ్ఎంసీ సర్కిల్ -16లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ)గా పని చేస్తున్న బి.వి. ఎస్. పేర్రాజు మరో అధికారితో కలిసి సోమవారం కాచిగూడ చౌరస్తాలోని స్వీకార్ హెూటల్‌కు వచ్చారు. రెండు గులాబ్ జామూన్ తెప్పించుకోగా అవి పులుపుపట్టి పాడైపోయి ఉండటంతో సిబ్బంది దష్టికి తీసుకువె ళ్లాడు. కొన్ని రోజుల క్రితం తయారు చేసిన స్వీట్లు ఎలా తింటారని నిలదీయడంతో హెూటల్ మేనేజర్, సిబ్బందితో వాగ్వాదం తలెత్తింది. దీంతో పేర్రాజు జీహెచ్ఎంసీ హెల్త్ ఆఫీసర్‌కు సమాచారం అందించడంతో పాటు ఫ్రిడ్జిలో ఉన్న 12 గులాబ్ జాములను తీసుకుని స్థానిక సుల్తాన్ బజార్ పోలీసులకు అప్పగించి నిర్వాహకులపై చర్యలు తీసు కోవాలని ఫిర్యాదు చేశాడు. వాటిని మల్కాజిగిరి ల్యాబ్ కు పంపించినట్టు మంగళవారం ఇన్‌స్పెక్టర్ తెలిపారు



భక్తుల కోసం 122 వాటర్ క్యాంపులు

- 35 లక్షల వాటర్ ప్యాకెట్ల సరఫరా



నవతెలంగాణ-సిటీబ్యూరో

గణేష్ నిమజ్జనం సందర్భంగా జలమండలి ఏర్పాటు చేసిన తాగు నీటి శిబిరాలను ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ట్యాంక్ బండ్ పరిసరాల్లో ఉన్న శిబిరాలకు వెళ్లిన ఎండీ అక్కడి ఏర్పాట్లు పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో ఈడీ మయాంక్ మిట్టల్, జలమండలి డైరెక్టర్లు ఉన్నతాధికారులు సైతం ఆయా ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి ఏర్పాట్లను పర్యవేక్షంచారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడారు. వినాయక నిమజ్జనానికి తరలివచ్చే భక్తులకు తాగునీటిని అందించడంతో పాటు శోభయాత్ర సాఫీగా జరిగేందుకు ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు. నిమజ్జనం కోసం 122 తాగునీటి శిబిరాలను ఏర్పాటు చేశామని, 35 లక్షల వాటర్ ప్యాకెట్లను అందించామన్నారు. వాటర్‌ప్యాకెట్లే కాకుండా అవసరమైన చోట్ల డ్రమ్ముల్లో కూడా తాగునీటిని అందించామన్నారు. మంచినీటిని అందించేందుకు 24 గంటలు షిఫ్టులవారీగా సిబ్బంది పనిచేశారన్నారు. జలమండలి క్వాలిటీ అస్యూరెన్స్ టీమ్(క్యూఏటీ)లు ఎప్పటికప్పుడు వాటర్ క్యాంపుల్లో మంచినీటి నాణ్యతను పరీక్షించడంతో పాటు క్లోరిన్ లెవల్స్ తగిన మోతాదులో ఉండేలా చేశామని తెలిపారు. చూస్తున్నాయి. గణేష్ నిమజ్జన శోభయాత్ర జరిగే అన్ని రూట్లలో ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ లీకేజీలు, సివరేజీ ఓవర్‌ఫ్లోలు లేకుండా ముందస్తు నిర్వహణ చర్యలు తీసుకున్నామని, ఇందులో భాగంగా నోడల్ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. ఏరియాకు ఒక రూట్ ఆఫీసర్‌ను సైతం నియమించామని తెలిపారు. అంతేకాకుండా ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో రెండు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

ప్రజా పక్షాన నిలబడేది కమ్యూనిస్టులే..

- సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. నాగేశ్వర్,

నవతెలంగాణ - ధూల్ పేట్

ప్రజా పక్షాన నిలబడేది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం)సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. నాగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు కందుల జంగయ్య లు అన్నారు. జి.నరేష్ అధ్యక్షతన జరిగిన గోషా మహల్ సీపీఐ(ఎం) సెంటర్ శాఖ 3వ మహాసభ కు ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. పార్టీ మహా సభలు మూడు సంవత్సరాల కోకసారి జరుగుతాయని ఈ కాలం లో జరిగిన ఉద్యమాలు పోరాటాలు, వచ్చిన పలితాల పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కమ్యూనిస్టులు చేసిన పోరాటమేనని అన్నారు. సీపీఐ(ఎం) గోషామహల్ శాఖ కార్యదర్శిగా అయూబ్ ఖాన్ ను ఎన్నుకున్నారు. ఈ మహా సభ లో అక్బర్ ఖాన్ , అస్లమ్ , నరేష్ , సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో ప్రశాంతం...



నవతెలంగాణ - ధూల్ పేట్

పాతబస్తీలో గణేష్ నిమజ్జన శోబా యాత్ర ప్రశాంతంగా జరిగింది. అంగరంగ వైభవంగా, శాంతియుత వాతావరణంలో కొనసాగింది. పోలీసులు అడుగడుగునా ప్రత్యేక నిఘా, బందోబస్తు నిర్వహించారు. బాలాపూర్, చాంద్రా యణ గుట్ట, ఉప్పుగూడ, గౌలిపుర, ఫలక నుమా, బండ్లగుడ, చత్రినాక్, లాల్ దర్వాజ గణపతులు చార్మినార్ మీదుగా బయలు దేరాయి. చార్మినార్ వద్ద భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి స్వాగత వేదిక లో ఉత్సవ సమితి నాయకులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ గణేష్ విగ్రహాలను స్వాగతం పలికారు. మధ్యాహ్నం 2.10గంటలకు బాలాపూర్ గణేష్ చార్మినార్ దాటి టాంక్ బండ్ వైపు వెళ్లాయి. జీహెచ్ఎంసీ వివిధ విభాగాల అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

పాతబస్తీ హిందువులదే.. - కేంద్ర మంత్రి బండి సంజయ..

పాతబస్తీ పక్కా హిందువులదే అని, ఎలాంటి డౌటే లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. చార్మినార్ వద్ద స్వాగత వేదికలో ఆయన మాట్లాడుతూ.. హిందువులు చీలి పోతారు, కులాలుగా ఉండరు, వర్గాలుగా ఉండరు, ఊళ్ల పేర్లతో చీలి పోతారని ఒక చెడు ఆలోచన మన పాలకుల లోపల, ప్రభుత్వాలకు ఉండటం వల్లనే మనం బిచ్చగాళ్ల వలనే బతికే పరిస్థితి వచ్చిందన్నారు. దీనికి కారణం మనమే అన్నారు. పాతబస్తీ మొత్తం ఇవాళ్ల తిరిగినా.. ఎక్కడ ఏ ఫరక్ అనిపియ్య లేదన్నారు.

ప్రత్యేక నిఘా..

గణేష్ నిమజ్జనం సందర్బంగా పాతబస్తీలో ఎక్కడ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ప్రాముఖ్యంగా సున్నిత, అతి సున్నిత ప్రాంతాలు, నిమజ్జనం కు వెళ్ళే మార్గాలలో నిఘా ఏర్పాట్లతో శోబా యాత్ర దక్షిణ మండలి డీసీపీ పర్యవేక్షణలో పరిశీలించారు. కూడళ్ళలో పికేటింగ్, యాత్ర దారి పొడవునా పరిశీలన బందోబస్తు తో ప్రశాంతంగా కొనసాగింది.

గణేష్ నిమజ్జనంలో అపశృతి

- తండ్రిని కాపాడబోయి 18 ఏండ్ల కూతురు మృతి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గణేష్ నిమజ్జనం సందర్బంగా నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో అపశృతి చోటు చేసుకుంది.తండ్రిని కాపాడబోయి 18 ఏండ్ల కూతురు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు కన్నీరు పెట్టించాయి. నారాయణగూడ సీఐ యు.చంద్రశేఖర్, డీఎస్ఐ జి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం తెల్లవారుజామున ఎల్బీనగర్ నుండి ట్యాంక్ బండ్‌లో గణేష్ నిమజ్జనం కోసం టాస్కర్ వాహనంలో నిమజ్జనానికి వచ్చిన తండ్రి మహేందర్, తన కూతురు పూజిత (18), నిమజ్జనం అనంతరం ఇంటికి బయలుదేరారు. హిమాయత్ నగర్ లోని వన్ ప్లస్ షోరూం వద్ద టస్కర్ వాహనంలో ఉన్న మహేందర్ ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడిపోవడంతో వెంటనే తండ్రిని రక్షించే ప్రయత్నంలో పూజిత టస్కర్ వాహనం నుంచి దూకింది. దాంతో వాహనం వెనుక టైర్లు ఆమె కడుపు భాగంలో బలంగా నొక్కడంతో తీవ్రంగా గాయపడింది.దీంతో వెంటనే ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సాయంత్రం మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.తండ్రి మహేందర్ క్షేమంగా ఉన్నట్లు, పూజిత డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ తెలిపారు.




గణేష్ పండుగ నిమజ్జనాన్ని పురస్కరించుకొని నల్లకుంటలో స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మధు యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి, నల్లకుంట కార్పొరేటర్ వై అమృత, నాయకులు శ్యామ్ రాజ్, భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట



సాయుధ పోరాటాన్ని తక్కువ చేయొద్దు

- సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ వ్యవస్థాపకులు

భద్రమోని పురుషోత్తం



నవతెలంగాణ - ముషీరాబాద్

సమ సమానత్వం భావాలు కలిగిన మట్టి మనుషులు చేసిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని తక్కువ చేస్తూ చులకనగా చరిత్రను సష్టించవద్దని సోష లిస్టు పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ వ్యవస్థాపకులు భద్రమోని పురుషోత్తం అన్నారు. మంగళవారం సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్య క్షులు పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వం మరో ప్రభుత్వాన్ని విలీనం చేసుకుందని.. ఆనాటి ముస్లిం నైజాం సర్కార్‌ను ముఖ్యమంత్రిగా కొనసాగిం చారని అది ప్రజా పాలన కాదు విమోచనము కాదు ముక్తి కాదు విలీనం మాత్రమేనని తెలిపారు. కులాలు మతాలు ప్రతిపాదన కాదు ఈ సందర్భాన్ని ఈ తరానికి తెలియజేయాలన్నారు. వేడుకల్లో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బి సుజాత, సూర్యాపేట జిల్లా కార్యదర్శి పి సురేష్, రాష్ట్ర ఆఫీస్ సెంటర్ ఇన్‌చార్జి తదితర నాయకులు పాల్గొన్నారు

రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి

నవతెలంగాణ - ముషీరాబాద్



స్వాతంత్ర ఉద్యమం రైతాంగ పోరాటం స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం అడ్వకేట్ జేఏసీ నాయకుల సమావేశంలో పులిగారి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.తెలంగాణ భూమి పుత్రులుగా న్యాయవాదులుగా సమాజంలో ఓ భాగంగా నైతిక సామాజిక బాధ్యత తలచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందు వరుసలో నిలబడి ఎలాంటి రాజకీయ పదవులు ఆశించకుండా ప్రత్యేక రాష్ట్రం మాజన్మ హక్కు అది సిద్ధించే వరకు మా పోరాటము చేసామని అన్నారు.మనకంటే ముందు జరిగిన స్వాతంత్ర్య ఉద్యమం, రైతాంగ సాయుధ పోరాటం, మట్టిబిడ్డల పోరాటం స్ఫూర్తిగా తెగింపు చేసుకొని రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాడినట్టు తెలిపారు. న్యాయవాదులుగా ప్రస్తుతం రాజకీయ పార్టీలు తమ రాజ్యాధికార లబ్ది కోసం 17 సెప్టెంబర్ 1948 దినోత్సవాన్ని వారి అనుకూలంగా చరిత్రను మరుగుపరిచే విధంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సంస్థానంలో భూమి కోసం భుక్తి కోసం స్వేచ్ఛ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరులైన తెలంగాణ వీరులకు జోహార్లు అని తెలిపారు.


నవతెలంగాణ మానవి 13
బుధవారం 18 సెప్టెంబరు 2024
www.navatelangana.com
హైదరాబాద్

మొలకలు తింటున్నారా..?

మొలకల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని రెగ్యులర్‌గా మీ డైట్‌లో యాడ్ చేస్తే కేలరీస్ తక్కువగా తీసుకుంటారు. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీంతో జీర్ణశక్తి సరిగ్గా జరుగుతుంది. అయితే, వీటిని ఎప్పుడు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదో తెలుసుకోండి.

ఏ టైమ్‌లో తీసుకుంటే మంచిది..

వీటిని బ్రేక్‌ఫాస్ట్ నుంచి మధ్యాహ్నం టైమ్‌లో తీసుకోవడం మంచిది. ఎందుకంటే, వీటిని తినడం వల్ల బాడీకి ఎనర్జీ అందుతుంది. రోజంతా మీ పనులని మీరు హ్యాపీగా చేసుకోవచ్చు. నీరసం ఉండదు.



రాత్రుళ్ళు తింటే..

కొంతమంది మొలకల్ని రాత్రుళ్ళు డిన్నర్ టైమ్‌లో తీసుకోవాలనుకుంటారు. కానీ, ఇది అస్సలు మంచిది కాదు. దీని వల్ల జీర్ణ సమస్యలొస్తాయి. కడుపు ఉబ్బరం, గ్యాస్ పట్టేసినట్లుగా ఉంటుంది. దీంతో మీ నిద్ర డిస్టర్బ్ అవుతుంది. సాధారణంగా మొలకల్లో రిచ్ న్యూట్రియెంట్స్ ఉంటాయి. వీటిని తినడం వల్ల రోజంతా ఎనర్జీగా ఉంటారు. అదే రాత్రుళ్ళు నిద్రపట్టదు. నిద్ర సరిగా లేకపోతే జీర్ణ వ్యవస్థ సరిగా పనిచేయదు. నిజానికి మొలకలు తిన్నప్పుడు గ్యాస్ సమస్య ఉన్నప్పటికీ.. అది మీరు మోతాదులో తిన్నప్పుడు ఎప్పుడు మరీ అంతలా ఇబ్బంది పెట్టదు. అదే విధంగా.. ఉదయాన్నే తినప్పుడు ఎనర్జీగా ఉంటారు. పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వీటితో పాటు కాల్షియం, పొటాషియం, ఫోలేట్, మెగ్నీషియంలు ఉంటాయి. కాబట్టి, బ్రేక్‌ఫాస్ట్‌లో యాడ్ చేస్తే మీరు ఎనర్జీగా ఉంటారు.

బాలింతలకు నారీ కేర్



మొదటి సారి తల్లి అయినపుడు ఆమె ఆనందానికి అవధులుండవు. అప్పటి వరకు తను పడ్డ బాధ మొత్తం క్షణంలో మాయమైపోతుంది. ఇదే సమయంలో కొన్ని సవాళ్లు కూడా ఉంటాయి. బిడ్డకు పాలు పట్టే దగ్గర నుండి ఇది మొదలవుతుంది. అలాంటి సమస్యే ఎదుర్కొంది గాయత్రి కనుమూరి. బిడ్డకు పాలివ్వడంలో సరైన అవగాహన లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. తనలా మరే తల్లీ బాధ పడకూడదని నారీ కేర్ ప్రారంభించింది. ఇంతకీ ఆమెకు ఎదురైన సమస్యలేంటీ? నారీ కేర్ ఎలా తల్లులకు సహాయం చేస్తుందో తెలుసుకుందాం...

వైజాగ్‌కు చెందిన గాయత్రికి 2020లో బిడ్డను ప్రసవించిన తర్వాత ఆసుపత్రిలో అంతా బాగానే ఉంది. ఇంటికి వచ్చిన తర్వాత బిడ్డకు పాలివ్వడం సవాలుగా మారింది. పాలిచ్చేటపుడు కొన్నిసార్లు బాధాకరంగా ఉండేది. అప్పుడప్పుడు రక్తస్రావం కూడా అయ్యేది. ఒక సారి పాలిచ్చిన తర్వాత తిరిగి 20 నుండి 40 నిమిషాల వరకు ఆమెకు చిరాగ్గా ఉండేది. బిడ్డ ఏడుస్తున్నా పాలివ్వడం చాలా కష్టంగా అనిపించేది. 'ఆ సమయంలో నా బిడ్డ ఆకలితో అలమటిస్తున్నట్లు అనిపించేది. అంటే నా దగ్గర తగినంత పాల ఉత్పత్తి లేదు. అది మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఇలాంటి సమస్యలతో మొదటి సారి తల్లి అయిన వారు విపరీతమైన ఒత్తిడిలో ఉంటున్నారు' అంటూ ఆమె మనతో పంచుకుంటున్నారు. ఇలాంటి సమస్యలు ఎంతో మంది అనుభవిస్తున్నారు. భారతదేశంలో పాలిచ్చే తల్లులకు సరైన సపోర్ట్ సిస్టమ్ లేదనే ఉద్దేశంతో గాయత్రి నారీ కేర్‌ను ప్రారంభించారు.

తల్లిపాలకు సవాళ్లు

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలే ఇవ్వాలి. ఆ తర్వాత ఇతర పోషక ఆహారంతో పాటు బిడ్డకు రెండు మూడేండ్లు నిండేవరకు తల్లిపాలను కొనసాగించాలి. చాలా మంది తల్లులు ఎంతో సహజంగా పాలిస్తారు. అయితే చాలా మంది తల్లులు పాలు తక్కువ ఉండడం లేదా లాచింగ్ వంటి సమస్యలు ఎదుర్కొంటారు. చనుబాలివ్వడంలో కూడా నిపుణులు శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్నేషనల్ బోర్డ్ సర్టిఫైడ్ లాక్టేషన్ కన్సల్టెంట్ ప్రకారం భారతదేశంలో 204 మంది నిపుణులు ఉన్నారు. చాలా మందికి తల్లిపాల సమస్యలకు నిపుణులు ఉన్నారనే విషయమే తెలియదు. గాయత్రి కూడా మొదట్లో తన సమస్యను పరిష్కరించుకునేందుకు ఓ శిశువైద్యుడిని కలిశారు. అతను ప్రత్యామ్నాయంగా కొన్ని సూచనలు చేశారు. అయితే తల్లి పాలలో ఉండే పోషకాలు అందులో ఉండవు. డాక్టర్ సూచన కాస్త ఊరటనిచ్చినా గాయత్రి బిడ్డకు తనపాలే పట్టాలనుకున్నారు. దానికోసం ఓ కన్సల్టెంట్‌తో అపాయింట్‌మెంట్ బుక్ చేసుకున్నారు. తన పాల ఉత్పత్తిని ఎలా అంచనా వేయాలో, బిడ్డను ఎలా పాలు పట్టాలో, బిడ్డ ఆకలి సమస్యలను ఎలా నిర్వహించాలో తెలుసుకున్నారు.

నారీ కేర్‌కు పునాది

లాస్ ఏంజెల్స్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్న గాయత్రి బిడ్డ పుట్టిన తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చారు. ఓ తల్లిగా తాను అనుభవించిన ఇబ్బంది ఇతరుల్లో ఎలా ఉందో అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. తన అనుభవాల నుండి ఇతరులకు మార్గనిర్దేశం చేయడం ప్రారంభించారు. 'అయితే కేవలం నా చుట్టూ ఉన్న మహిళలకు మాత్రమే సహాయం చేస్తే సరిపోదని కొద్దికాలంలోనే గ్రహించాను. ఎక్కువ మంది మహిళలకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నాను' అని ఆమె జతచేస్తున్నారు. ఈ ఆలోచనే నారీ కేర్‌కు పునాది రాయిగా నిలిచింది. 2022లో దీన్ని ప్రారంభించారు. వైజాగ్ ఆధారిత ఈ స్టార్టప్ సర్టిఫైడ్ ల్యాక్టేషన్ కన్సల్టెంట్‌లతో తల్లులకు అవగాహన కల్పిస్తుంది. 'నా ప్రసవానంతర కాలంలో నేను ఎదుర్కొన్న సమస్యలు ఇతర తల్లులు ఎదుర్కోకూడదని వీలైనంత ఎక్కువ మంది తల్లులకు సహాయం చేయాలనుకుంటున్నాను' అని ఆమె అంటున్నారు.

తల్లిపాలను అందించడం

కొత్తగా ఈ ప్రోగ్రామ్‌లో చేరిన తేజశ్రీ మాట్లాడుతూ 'బిడ్డను చూసుకోవడంలో నాకు మద్దతు లేదు, ఎవరితో మాట్లాడాలో తెలియదు. పాలు సరిగా రావడం లేదని బిడ్డకు పోతపాలు పట్టాను. అయితే రెండవసారి గర్భవతి అయినప్పుడు సహాయం కోసం వెతుకుతున్నాను. అప్పుడే నారీ కేర్ గురించి తెలుసుకున్నాను. ఇప్పుడు చాలా ఆనందంగా ఉంది. ఆమె నాపై నాకు నమ్మకం కలిగించారు. నా శరీరాన్ని విశ్వసించడం నేర్పించారు' అన్నారు. తేజశ్రీకి తల్లిపాలు పట్టించే పద్ధతులు, ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ మద్దతు గురించి వారు నేర్పించారు.

సపోర్టివ్ కమ్యూనిటీ

నారీ కేర్ ఓ నెల ప్రణాళికను మహిళలకు అందిస్తుంది. ఇక్కడ తల్లులు చనుబాలివ్వడం కన్సల్టెంట్‌తో ఒకరితో ఒకరు సంప్రదింపులు, రెండు గంటల బ్రెస్ట్ ఫీడింగ్ కోర్సుతో పాటు వాట్సాప్ బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్ట్ గ్రూప్ ద్వారా ఒక నెల టెక్స్ట్ సపోర్ట్ పొందుతారు. ఇది వారు ఒకరి అనుభవాల నుండి మరొకరు నేర్చుకోగలిగే సపోర్టివ్ కమ్యూనిటీని ఏర్పరుచుకుంటూ నిపుణులను నేరుగా ప్రశ్నలు అడగడానికి వీలు కల్పిస్తుంది. నారీ కేర్ ప్రస్తుతం దేశంలో ఐదు కన్సల్టెంట్లను నిర్వహిస్తోంది. ఇందులో మూడు, ఆరు నెలల ప్లాన్‌లు కూడా ఉన్నాయి. వీటి ధర వరుసగా రూ.4,500 నుండి రూ.10,000. ఆరు నెలల ప్లాన్‌లో వన్-టు-వన్ ఫాలో-అప్ టెక్స్ట్‌తో పాటు పోషకాహార నిపుణులతో కాల్ సపోర్ట్, బిడ్డకు ఘనపదార్థాలను పరిచయం చేయడంపై వర్క్‌షాప్ కూడా ఉంటుంది. అదనపు ఫాలో-అప్‌లు, న్యూట్రిషన్ సపోర్ట్, ప్రసవానంతర యోగా తరగతులు, పిల్లల పోషకాహారం, నిద్ర, ప్రసవానంతర మానసిక ఆరోగ్యం వంటి అదనపు ప్రయోజనాలు ఉంటాయి. అదే సేవలను కలిగి ఉన్న మరో మూడు విస్తృతమైన ప్రోగ్రామ్‌లను స్టార్టప్ అందిస్తుంది.

భవిష్యత్‌లో...

ఇప్పటి వరకు నారీ కేర్ భారతదేశం అంతటా సుమారు 400 మంది మహిళలకు చేరువైంది. స్టార్టప్ తన క్లయింట్‌లకు పంపులు, స్టెరిలైజర్‌ల వంటి బ్రెస్ట్ ఫీడింగ్ ఉత్పత్తులను అందించడానికి స్పెక్ట్రా, మెడెలా, డాక్టర్ బ్రౌన్స్, కొమోటోమో వంటి బ్రాండ్‌లతో భాగస్వామ్యం కలిగి ఉంది. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తల్లిపాల గురించి అవగాహన కల్పిస్తుంది. 'తల్లిపాలు పట్టడం మొదటి కొన్ని వారాలు చాలా కష్టం. కాలక్రమేణా తల్లులకు ఇది ఇతర సమస్యలను తెచ్చిపెడుతుంది. అందుకే భవిష్యత్తులో తల్లిపాలు మాత్రమే కాకుండా ఇతర అంశాలపై మా అవగాహన కార్యక్రమాలు పెంచాలని పరిశీలిస్తున్నాం. అయితే ప్రస్తుతం పాలివ్వడంలో సమస్యలను ఎదుర్కొంటున్న తల్లులకు సహాయం చేయడమే మా లక్ష్యం' అంటూ గాయత్రి తన మాటలు ముగించారు.



బాలాపూర్ లడ్డూ రూ.30 లక్షలు

- వేలంలో కొలను శంకర్‌రెడ్డి సొంతం

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ గణేశ్ లడ్డూ మరోసారి రికార్డు ధర పలికింది. మంగళవారం ఉదయం బాలాపూర్‌లో లడ్డూ వేలం నిర్వహించగా.. రూ.30 లక్షల వెయ్యి రూపాయలకు బీజేపీ నేత కొలను శంకర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. గతేడాదికన్నా మూడు లక్షలు ఎక్కువ పలికింది. కిందటేడాది దాసరి దయానంద్‌రెడ్డి రూ.27 లక్షలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కొలను శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. లడ్డూను వేలంలో దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. లడ్డూను ప్రధాని నరేంద్ర మోడీకి.. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ద్వారా అందజేస్తానని తెలిపారు. ఈ వేలం పాటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, జెడ్పీ చైర్మెన్ తీగల అనిత హరినాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ పోలీసే బందోబస్తు మధ్య శోభాయాత్ర

వేలంపాట అనంతరం బాలాపూర్ గణేష్ నిమజ్జన శోభాయాత్ర భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా హుసేన్ సాగర్ వరకు కొనసాగింది. నిమజ్జనం సందర్భంగా బాలాపూర్‌లో శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకామేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన బాలాపూర్ గణనాథుడు తన నియోజకవర్గంలో ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు.

రికార్డు ధర రూ.1.87 కోట్లు పలికిన లడ్డు

- బండ్లగూడ కీర్తి రీచ్‌మండ్ విల్లాస్‌లో వేలం
- లడ్డు దక్కించుకున్న ఆర్వి దియా చారిటబుల్ ట్రస్టు
- వేలం డబ్బును సేవా కార్యక్రమాలు వినియోగం

నవతెలంగాణ-గండిపేట్

తెలుగు రాష్ట్రాల్లో కానీ విని ఎరగని రీతిలో రంగారెడ్డి జిల్లా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కీర్తి రిచ్ మాండ్ విల్లాస్‌లో నిర్వహించిన వినాయక లడ్డు వేలంలో లడ్డు రూ.1.87 కోట్లు ధర పలికింది. సోమవారం నిర్వహించిన లడ్డూ వేలంలో రికార్డు స్థాయిలో లడ్డూ ధర పలికింది. గత ఏడాది ఇక్కడే లడ్డు 1.20 కోట్లు పలుకగా.. ఈ సారి మరింత పెరిగి రికార్డు సృష్టించింది. వినాయక చవితి సందర్భంగా కీర్తి రిచ్ మాండ్ విల్లాస్‌లోని ఆర్వి దియా చారిటబుల్ ట్రస్టు ద్వారా విల్లాస్‌లో ఉండే వారి నుంచి డబ్బులు సేకరిస్తారు. ఆ డబ్బుతో లడ్డూ వేలం పాటను పాడతారు. ట్రస్టు ఈ ఏడాది రూ.1.87 కోట్లు సేకరించింది. ఆ మొత్తాన్ని లడ్డు వేలానికి ఉపయోగించింది. అయితే ఆ డబ్బులను సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తారు. ట్రస్టు నిర్వాహకులు ఆకులు పూర్ణిమ దేశ్‌పాండే మాట్లాడుతూ.. కీర్తి రీచ్ మండ్ విల్లాలో దాదాపు 25 గ్రూపులు ఉన్నట్టు తెలిపారు. వారు పెద్ద పెద్ద వ్యాపారస్తులని, వారి నుంచి సేకరించిన విరాళాలను లడ్డు వేలానికి వినియోగించినట్టు తెలిపారు. సేకరించిన ప్రతి రూపాయినీ తిరిగి అనాథశ్రమం, పేదలకు, సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తామని తెలిపారు.

జమ్మూకాశ్మీర్‌లో నేడు తొలి దశ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

విస్తృత స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కాశ్మీర్ జోన్ ఐజీపీ వికె బిర్ది తెలిపారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పారామిలిటరీ ఫోర్స్ (సీఏపీఎఫ్), జమ్ముకాశ్మీర్ ఆర్మ్‌డ్ పోలీస్, జమ్ముకాశ్మీర్ పోలీస్ సిబ్బందితో బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశామని చెప్పారు. సీపీఐ(ఎం) నాయకులు మహమ్మద్ యూసఫ్ తరిగామి పోటీ చేస్తున్న కుల్గాం నియోజకవర్గానికి తొలిదశలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ నుంచి వరసగా ఐదో విజయంపై తరిగామి దృష్టి పెట్టారు. కుల్గాంతో పాటు పాంపోర్, త్రాల్, పుల్వామా, రాజ్‌పోరా, జైనాపోరా, షోపియాన్, డిహెచ్ పోరా, దేవ్‌సర్, దూరు, కోకెర్‌నాగ్ (ఎస్‌టి), అనంతనాగ్ వెస్ట్, అనంతనాగ్, శ్రీగుఫ్వారా-బిజ్‌బెహరా, షాంగస్-అనంతనాగ్ ఈస్ట్, పహల్గాం, ఇందర్వాల్, కిష్త్వార్ భదర్వా, దోడా, దోడా వెస్ట్, రాంబన్, బనిహాల్ నియోజకవర్గాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది.

ఫాం హౌజ్ ముఖ్యమంత్రిని కాదు..ప్రజల సీఎంను

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలనుద్దేశించి మాట్లాడారు. "ఓ నిజాం పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని.. తీగెలను తెంపి అగ్నిలో దింపినావు.. నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని నిజాం రాచరికానికి వ్యతిరేకంగా నినదించిన దాశరథి గీతంతో తన ప్రసంగాన్ని సీఎం ప్రారంభించారు. "తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన చారిత్రాత్మక ఘట్టం 1948 సెప్టెంబర్ 17న ఇదే హైదరాబాద్ గడ్డపై ఆవిష్కృతమైంది. తెలంగాణ అంటే త్యాగం... ఆ త్యాగాలకు ఆద్యుడు దొడ్డి కొమురయ్య. నాటి సాయుధ పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారు. ఆ నాటి అమరులకు ఈ సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నా. ఈ శుభదినాన్ని ఎలా నిర్వచించుకోవాలన్న విషయంలో ఇప్పటి వరకు భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు విలీనమనీ, మరికొందరు విమోచనమని సంబోధిస్తున్నారు. మేం అధికారం చేపట్టిన తర్వాత సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించాం. ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష. వారి ఆలోచన, సమైక్యతను దెబ్బతీసేలా వివాదాస్పదం చేయడం సరికాదు" అని సీఎం హితవు పలికారు. సెప్టెంబర్ 17 స్ఫూర్తితో పదేండ్ల నియంత పాలన నుంచి తెలంగాణను విముక్తి చేశామని రేవంత్ అన్నారు. గత సర్కార్ చేసిన రూ. ఏడు లక్షల కోట్ల అప్పుకు ప్రతి నెలా రూ. 6,500 కోట్ల మేర అసలు, వడ్డీ కలిపి బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితుల్లో బాధ్యతలు స్వీకరించామని చెప్పారు. అప్పుల కుప్పగా ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తూ, ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులెదురైనా ఇచ్చిన మాట మేరకు రూ.2లక్షల రుణమాఫీని ఎకకాలంలో చేశామని చెప్పారు. అక్కడక్కడా కొన్ని ఇబ్బందులున్నా వాటన్నింటిని అధిగమించి అందరికి రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. "అధికారం చేపట్టిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించాం. ఇప్పటి వరకు 87 కోట్ల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. ఐదు లక్షల నుంచి రూ. పది లక్షలకు పెంచాం. రాష్ట్రంలోని 43 లక్షల కుటుంబాలకు రూ. 500 వంట గ్యాస్ అందిస్తున్నాం. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న 49 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీని కోసం ఇప్పటి వరకు రూ.965 కోట్ల మేర సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఈ ఏడాది 4,50,000 గృహాలను నిర్మించబోతున్నాం. నేతన్నల కోసం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ ప్రారంభించాం. దీనికి తెలంగాణ ఉద్యమ దిక్సూచి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాం" అని సీఎం తొమ్మిది నెలల తమ పాలనలో చేసిన వృద్ధిని వివరించారు.. కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు, పన్నుల వాటాల గురించి పలు మార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధానితో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిశామని చెప్పారు. ఈ పర్యటనను కూడా కొంతమంది రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిల విషయంలో ఎన్ని సార్లైనా ఢిల్లీకి వెళ్తానని స్పష్టం చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం వాటా ఇవ్వాలని సీఎం డిమాండ్ చేశాం. ఇటీవల 16వ ఆర్థిక సంఘం ముందు కూడా గట్టిగా వాదనలు వినిపించామని గుర్తు చేశారు. "రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై ఫ్యూచర్ స్టేట్ గా బ్రాండ్ చేస్తున్నాం. బేగరి కంచె వద్ద ఫోర్త్ సిటీకి శంకుస్థాపన చేశాం. మూసీ సుందరీకరణతో హైదరాబాద్ రూపు రేఖలు మారనున్నాయి. మాదక ద్రవ్యాల నియంత్రణ, నిర్మూలన విషయంలో కఠినంగా ఉంటున్నాం. టీ - న్యాబ్ ను బలోపేతం చేశాం. క్రీడలను ప్రోత్సహిస్తున్నాం. ఈ క్రమంలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకార చుట్టాం. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం" అని సీఎం వెల్లడించారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మూడు నెలల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడంతో పాటు గ్రూప్ 1 ప్రాథమిక పరీక్షలు ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామని అన్నారు. వచ్చే ఐదేండ్లలో 63 లక్షల మంది మహిళలకు రూ. లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని సంకల్పించామని తెలిపారు. విదేశాల్లో మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారంతో పాటు. వారి సమస్యల పరిష్కారానికి ప్రజాభవన్‌లో "ప్రవాసీ ప్రజావాణి కేంద్రం" ఏర్పాటు చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

సాంస్కృతిక పునర్జీవనానికి శ్రీకారం

"పదేండ్లలో విధ్వంసమైన తెలంగాణను సాంస్కృతికంగా, ఆర్థికంగా పునరుజ్జీవం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాం. అధికారంలోకి రాగానే అందెశ్రీ రచించిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించి అందుకు శ్రీకారం చుట్టాం. రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ జరపబోతున్నాం. సాంస్కృతిక సారథి గద్దర్ పేరుతో సినిమా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టాం. ఇలా ప్రతి ఆలోచనలో తెలంగాణ సాంస్కృతిక పూర్వ వైభవం దిశగా సాగుతున్నాం" అని సీఎం పేర్కొన్నారు. "తెలంగాణ ప్రజలే రాష్ట్ర ప్రస్థానానికి నావికులు. వారి ఆలోచనలే మా ఆచరణ, వారి ఆకాంక్షలే మా కార్యచరణ" అంటూ సీఎం తన ప్రసంగాన్ని ముగించారు.

ఎన్ని అడ్డంకులెదురైనా హైడ్రా ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

తాండవం మనం చూశాం. ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదు. హైడ్రా వెనుక రాజకీయ కోణం లేదు. స్వార్థం అంతకన్నా లేదు. పేదలను ముందు పెట్టి హైడ్రా లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నంలో భూ మాఫియా ఉంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా హైడ్రా ఆగదు" అని సీఎం స్పష్టం చేశారు.

ఎర్రజెండా రాజ్యం వస్తేనే బతుకుల్లో మార్పు

(మొదటిపేజీ తరువాయి)

చిత్రపటానికి ఎంపీ అమ్రారాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ అమ్రారాం మాట్లాడారు. వీర తెలంగాణ సాయుధ పోరాట పురిటి గడ్డను చూసి తన హృదయం పులకించిపోయిందని అన్నారు. రైతాంగ పోరాటాల గడ్డ రాజస్థాన్ సికార్‌లో బీజేపీని ఓడించి ఎంపీగా గెలిచి ఇక్కడికి వచ్చిన తనకు సంతోషంగా ఉందని, ఇలాంటి మంచి కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు పార్టీ శ్రేణులకు విప్లవ అభినందనలు తెలియజేశారు. ప్రపంచ చరిత్ర పుటల్లో సువర్ణ అక్షరాలతో వీర తెలంగాణ సాయుధ పోరాటం లిఖించబడిందని కొనియాడారు. సీపీఐ(ఎం) నిర్వహిస్తున్న పోరాటాల వైపు రాష్ట్రం ఎదురుచూస్తుందన్నారు. రైతులు తలచుకున్నారు కాబట్టే నల్ల చట్టాలు బయటపడేయగలిగారని, ఇవే విధానాలను మళ్లీ కొనసాగిస్తే.. నరేంద్ర మోడీని సైతం రైతులు విసిరి వేసే రోజులు వస్తాయని హెచ్చరించారు. ఎర్రజెండా రాజ్యం వస్తేనే దేశంలో ప్రజల బతుకులు మారుతాయని స్పష్టంచేశారు. ఎర్రజెండా రాజ్యస్థాపన కోసం వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.

పోరాటాన్ని వక్రీకరించడం సిగ్గుచేటు : ఎండీ అబ్బాస్

కిషన్ రెడ్డి, బండి సంజయ్.. వంటి బీజేపీ నాయకులు వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరించడం సిగ్గుచేటని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రజాకారులు, కమ్యూనిస్టులు ఒకటేనని మాట్లాడటం.. వారికి చరిత్ర పట్ల, రాజకీయాల పట్ల ఉన్న అవగాహనా లేమికి నిదర్శనమన్నారు. వాస్తవ చరిత్ర తెలుసుకోవాలని, రజకారులు, భూస్వాములను తరిమికొట్టింది, రక్త తర్పణ చేసింది కమ్యూనిస్టు యోధులేనని గుర్తు చేశారు. నిజం నిప్పులాంటిదని, చరిత్రను వక్రీకరించే మతోన్మాదులకు ప్రజా క్షేత్రంలో ఎప్పటికైనా ప్రజలు గుణపాఠం చెప్పకతప్పదని హెచ్చరించారు. తెలంగాణ విమోచన దినోత్సవం కాదని తెలంగాణ విలీన దినోత్సవమని తెలిపారు. తెలంగాణకు విమోచన, విముక్తి జరగలేదని, విముక్తి కోసం పోరాటం కొనసాగుతున్నదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గంగసాని రఘుపాల్, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. శోభన్ నాయక్, సీఐటీయూ నాయకులు పుప్పాల శ్రీకాంత్, యాటల సోమన్న, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్, బోట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు మండల కార్యదర్శి జి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో రామ రామ..

(మొదటిపేజీ తరువాయి)

చేసి కామాంధులను శిక్షించాలని కాళ్లా వేళ్లాపడినా పోలీసులు లైట్ తీసుకున్నారు.ఈ దారుణంపై యూపీలో రాజకీయం వేడెక్కింది. పోలీసులపై చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీలు, మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అసలేం జరిగింది..?

అయోధ్య జిల్లాలోని సహదత్‌గంజ్‌కు చెందిన వంశ్ చౌదరి తనను "పర్యాటక" ప్రదేశాలను చూపిస్తానంటూ..తీసుకెళ్లాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది."ఆగస్టు 16న నన్ను గెస్ట్ హౌస్‌కి తీసుకెళ్లి అక్కడే నిర్బంధించాడు. అతను, తన మరో ఇద్దరు స్నేహితులతో కలిసి తనపై సామూహిక లైంగికదాడి చేశాడని,, ఆపై తన స్నేహితులైన వినయ్ కుమార్, మహ్మద్ షరీక్‌లను పిలిపించి మరీ అఘాయిత్యం చేశారని వివరించింది. అయోధ్య పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం బీఏ విద్యార్థినిగా చదవుతూ.. ఆమె రామజన్మభూమి ఆలయంలో క్లీనింగ్ సిబ్బందిగా కూడా పనిచేస్తున్నారు. "మా కుటుంబ సభ్యులందరినీ చంపుతామని బెదిరించటంతో.. భయపడి, నేను పోలీసుల వద్దకు వెళ్లలేదు. అయితే ఆగస్టు 25న నేను గుడికి వెళ్తుండగా వంశ్ మళ్లీ నన్ను అపహరించాడు. అతనితో పాటు ఉదిత్ కుమార్, సత్రం చౌదరి, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నారు. వారు కారులో నాపై లైంగికదాడికి యత్నించారు.కానీ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. వారి బారి నుండి పారిపోవడానికి నాకు సమయం దొరికింది, "అని గురువారం ఫిర్యాదులో ఆమె పేర్కొన్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. బాలిక నేరం జరిగిన ప్రదేశాలుగా గుర్తించిన ప్రాంతాలు టెంపుల్ టౌన్‌లోని హైసెక్యూరిటీ జోన్ కిందకి వస్తాయి. అలాంటి అయోధ్యలో రామమందిరం శుభ్రపరిచే సిబ్బంది పలుమార్లు సామూహిక లైంగికదాడికి పాల్పడుతున్నా..పోలీసుల నిఘా నేత్రాలు ఏమయ్యాయి.? దోషుల వెనుక ఎవరు ఉన్నారు..? అన్నదానిపై దుమారం రేగుతోంది.పోలీసులు బాధితురాలికి న్యాయం చేయాల్సింది పోయి ఆమెనే బెదిరించారని, కనుక ఆ పోలీసులను సస్పెండ్ చేయాలని లక్నో లోని ఊర్మిళ వర్మ అనే మహిళా నాయకురాలు డిమాండ్ చేశారు. ఇలాంటి చాలా సంఘటనల్లో ఫిర్యాదు చేయడమే కష్టంగా మారుతోందని దీనితో నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారని సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ఈ కేసు విషయంలో బాధితురాలికి న్యాయం చేయాలనీ, నేరస్థులపై, ఫిర్యాదు నమోదు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రేవంత్‌రెడ్డి సూపర్

- సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు : రాజాసింగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గణేశ్ నిమజ్జనం కోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సూపర్ అంటూ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈసారి ప్రభుత్వ వ్యవస్థలన్నీ చాలా బాగా పనిచేశాయని కొనియాడారు. పోలీసు వ్యవస్థ పనితీరు బాగుందని ప్రశంసించారు. ఉత్సవాల ఏర్పాట్ల నుంచి నిమజ్జనం వరకు అన్నింటినీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయని విధంగా ఈసారి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డినే ఖైరతాబాద్ బడా గణేశ్‌ని దర్శించుకోవడం, నిమజ్జన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించడం సంతోషంగా ఉందన్నారు. ఎండ కారణంగా నిమజ్జనాలు కొంత ఆలస్యంగా జరుగుతున్నాయని చెప్పారు.

100 రోజుల్లో ఎన్నో విజయాలు సాధించాం

- ప్రధాని మోడీ

భువనేశ్వర్ : ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ 100 రోజుల పాలనలో ఎన్నో విజయాలు సాధించామని ప్రధాని మోడీ మంగళవారం పేర్కొన్నారు. మొదటి 100 రోజుల్లోనే పేదలు, రైతులు, యువత, మహిళల కోసం ఎన్నో ముఖ్యమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఒడిశా ప్రభుత్వం మహిళల కోసం రూపొందించిన సుభద్ర యోజన పథకాన్ని మోడీ ప్రారంభించారు. ఈ పథకం లబ్దిదారులతో భువనేశ్వర్‌లో నిర్వహించిన కార్యాక్రమంలో మోడీ పాల్గొన్నారు.



ఇది ప్రేక్షకుల విజయం

నరేశ్ వికె, రాగ్ మయూర్, ప్రియా వడ్లమాని లీడ్ రోల్స్ నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'వీరాంజనేయులు విహారయాత్ర'. అనురాగ్ పలుట్ల దర్శకత్వం వహించారు. బాపినీడు.బి, సుధీర్ ఈదర సంయుక్తంగా నిర్మించారు.
ఆగస్ట్ 14న ఈటీవీ విన్‌లో స్ట్రీమ్ అయిన ఈ సినిమా అందరినీ ఆకట్టుకొని, రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్, వాచ్ టైంతో బిగ్గెస్ట్ హిట్ అయ్యింది. ఈ సందర్భంగా మూవీ యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది.
నరేష్ వికె మాట్లాడుతూ, 'ఈ సినిమా విషయంలో రెండు పెద్ద వ్యాఖ్యలు చేశాను. ఉషాకిరణ్‌కి 'శ్రీవారికి ప్రేమలేఖ' ఎంతో ఈటీవీ విన్‌కి 'వీరాంజనేయులు విహారయాత్ర' అంత పెద్ద సినిమా అన్నాను. అనురాగ్ వన్ అఫ్ ది బెస్ట్ స్క్రీన్ ప్లే రైటర్ అని చెప్పాను. ప్రేక్షకుల ఆదరణతో ఈ రెండు మాటలు ప్రూవ్ అయ్యాయి. 200 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్‌తో సినిమా దూసుకుపోతోంది. బిగ్గెస్ట్ హిట్ ఇది. ఒక గౌరవాన్ని తెచ్చిన సినిమా. ఈ సినిమాని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇది ప్రేక్షకుల విజయం' అని అన్నారు.
'ఈ సినిమానికి ఇంత మంచి సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. రవి ఈ సినిమాకి స్టార్టింగ్ పాయింట్. రాగ్ అందరినీ సర్ప్రైజ్ చేశాడు. ప్రియ అద్భుతంగా నటించింది. నరేష్ చాలా పాజిటివ్ పర్సన్. నేను పది సినిమాలు చేస్తే ఆ సినిమాలన్నిటిలో ఆయన ఉండాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాకి వచ్చిన ప్రసంశలను మర్చిపోలేను' అని డైరెక్టర్ అనురాగ్ చెప్పారు. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ,'ఆన్ పేపర్ ఇది బోల్డ్ సినిమా. ఇలాంటి సినిమా చేయడం చాలా కష్టం. ఈ సినిమాని అనురాగ్ నమ్మాడు. స్క్రిప్ట్ చదవి ఎలాగైనా చేయాలనిపించింది' అని తెలిపారు.'సినిమా రిలీజైన దాదాపు నెల రోజుల తర్వాత సక్సెస్ సెలబ్రేట్ చేసుకుంటున్నామంటే.. ఇది ఆర్గానిక్ సక్సెస్' అని ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి చెప్పారు.

నవచిత్రం

90 రోజుల్లో నివేదిక ఇస్తాం



వివేక్ కూచిభొట్ల, తమ్మారెడ్డి భరద్వాజ్, దామోదర ప్రసాద్

'కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై వచ్చిన లైంగిక ఆరోపణల విషయమై 90 రోజుల్లో నివేదిక ఇస్తాం' అని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ బృందం తెలిపింది.
ఈ ప్యానెల్‌కి సెక్రటరీ, కన్వీనర్‌గా దామోదర ప్రసాద్, ఛైర్‌పర్సన్‌గా ఝాన్సీ ఉన్నారు. అలాగే ఇంటర్నల్ మెంబర్స్‌గా తమ్మారెడ్డి భరద్వాజ, సుచిత్రా చంద్రబోస్, వివేక్ కూచిభొట్ల, ప్రగతి, ఎక్స్‌టర్నల్ సభ్యులుగా రామలక్ష్మి మేడపాటి, కావ్యమండవ ఉన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ ప్యానెల్ సభ్యులు మాట్లాడారు.
'మహిళా కొరియోగ్రాఫర్ నుండి వచ్చిన ఫిర్యాదును స్వీకరించాం. అలాగే తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో జానీ మాస్టర్ మీద వచ్చిన ఈ ఫిర్యాదును పరిష్కరించడానికి కమిటీని ఏర్పాటు చేశారు. అలాగే తమ ప్యానెల్ 90 రోజుల్లో సమగ్రమైన నివేదిక అందజేస్తుంది. ఇకపై కూడా ఇలాంటి లైంగిక వేధింపుల ఫిర్యాదుల విషయంలో బాధితులు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను సంప్రదించవచ్చు. ఛాంబర్ కార్యాలయంలో కంప్లైంట్ బాక్స్‌తోపాటు ప్రత్యేక ఫోన్ నెంబర్(9849972280)ని, కంప్లైంట్స్‌ఎట్‌దిరేట్‌ఆఫ్‌ఫిల్మ్‌ఛాంబర్ పేరుతో ఇ మెయిల్‌ని కూడా ఏర్పాటు చేశాం. అంతేకాదు బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతాం అని ప్యానెల్ బృందం తెలిపింది.

ఆద్యంతం వైవిధ్యం

నోయల్, రిషిత నెల్లూరు హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'బహిర్భూమి'. ఈ చిత్రాన్ని మహంకాళి ప్రొడక్షన్ బ్యానర్ పై మచ్చ వేణుమాధవ్ నిర్మిస్తున్నారు. రాంప్రసాద్ కొండూరు దర్శకత్వం వహిస్తున్నారు.
తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ రిలీజ్ ఈవెంట్‌ను ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా నిర్మాత మచ్చ వేణు మాధవ్ మాట్లాడుతూ, 'సినిమా మీద ప్యాషన్‌తో చిత్ర పరిశ్రమకు వచ్చాను. ప్రొడ్యూసర్‌గా మూవీస్ చేస్తున్నాను. ఈ సినిమాకు మా టీమ్ ఎంతో సపోర్ట్ చేశారు. సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. త్వరలో మంచి డేట్ చూసి గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్ చేస్తాం' అని చెప్పారు.



నోయల్, రిషిత

'ఈ సినిమాకు హీరో నోయెల్ ఎంతో సపోర్ట్ చేశారు. నోయెల్, ఫణి మధ్య కామెడీ సీన్స్ హైలెట్ అవుతాయి. మేము 'బహిర్భూమి' అని టైటిల్ ఎందుకు పెట్టాం అనేది సినిమా చూస్తే తెలుస్తుంది. వెస్ట్రన్ కల్చర్ కంటే మన కల్చర్ చాలా గొప్పది. ఈ విషయాన్ని మా మూవీలో అంతర్లీనంగా చెబుతున్నాం' అని దర్శకుడు రాంప్రసాద్ కొండూరు అన్నారు.
హీరోయిన్ రిషిత నెల్లూరు మాట్లాడుతూ, 'ఈ సినిమాతో హీరోయిన్‌గా ప్రేక్షకులకు పరిచయం అయ్యే అవకాశం దక్కింది. ఈ అవకాశం నాకు ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్ చెబుతున్నా. ఈ సినిమాలో నా క్యారెక్టర్ చాలా స్ట్రాంగ్‌గా ఉంటుంది' అని తెలిపారు. హీరో నోయల్ మాట్లాడుతూ, 'చాలా మంచి మూవీ చేశాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయి. త్వరలో థియేటర్స్‌లోకి సినిమా వస్తుంది. మీరంతా ఆదరిస్తారని కోరుకుంటున్నా' అని అన్నారు.

ఆటలు

స్పిన్ కాదు పేస్!

చెన్నై చెపాక్ పిచ్ అంటేనే స్పిన్ స్వర్గధామం. ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌లో సైతం ఇక్కడ బంతి గిర్రున తిరుగగా.. ఐదు రోజుల ఆటలో స్పిన్ మాయజాలం గురించి ప్రత్యేకంగా చెప్పాలా?!. అంచనాలకు భిన్నంగా భారత్, బంగ్లాదేశ్ తొలి టెస్టుకు చెపాక్‌లో పేస్ పిచ్ సిద్ధమైనట్టు తెలుస్తోంది. తొలి టెస్టు సవాల్‌కు ఎర్రమట్టితో పిచ్‌ను సిద్ధం చేయగా.. భారత తుది జట్టు కూర్పుపై ఆసక్తి నెలకొంది.

- తొలి టెస్టుకు ఎర్రమట్టి పిచ్ సిద్ధం
- తుది జట్టు కూర్పుపై తర్జనభర్జన

నవతెలంగాణ క్రీడావిభాగం

ముగ్గురు పేసర్లు లేదా ముగ్గురు స్పిన్నర్లు? రోహిత్ శర్మ, గౌతం గంభీర్‌కు ఇప్పుడు తుది జట్టు కూర్పు తలనొప్పి షురూ కానుంది. భారత్, బంగ్లాదేశ్ తొలి టెస్టు గురువారం నుంచి ఆరంభం కానుండగా.. చెపాక్ క్యూరేటర్ ఎర్రమట్టితో తయారు చేసిన పేస్‌కు అనుకూలించే వికెట్‌ను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఎర్రమట్టి పిచ్‌పై నాణ్యమైన బౌన్స్, పేస్‌తో పాటు బంతి పాడిన తర్వాత రివర్స్ స్వింగ్ సైతం లభించనుంది. దీంతో ఐదు రోజుల ఆటలో పేసర్లు ప్రభావం చూపించనున్నారు. దీంతో తుది జట్టులోకి ముగ్గురు స్పిన్నర్లను తీసుకోవాలా? లేదా ముగ్గురు పేసర్లను ఎంచుకోవాలనే అనే డైలామా ఇప్పుడు జట్టు మేనేజ్‌మెంట్‌కు తీయని తలనొప్పి తీసుకొచ్చింది.

ఐదుగురు బౌలర్ల ఫార్ములా

టెస్టుల్లో భారత్ ఐదుగురు స్పెషలిస్ట్ బౌలర్లతో బరిలోకి దిగుతోంది. ఈ ఫార్ములాలో ఎటువంటి మార్పులు ఉండే అవకాశం లేదు. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు బౌలింగ్ విభాగంలో కచ్చితంగా ఉండనున్నారు. ఐదో స్థానం కోసం స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ సహా పేసర్లు ఆకాశ్ దీప్, యశ్ దయాళ్ పోటీపడుతున్నారు. చివరగా భారత్ ఓ స్వదేశీ టెస్టులో ముగ్గురు పేసర్లతో ఆడటం సైతం బంగ్లాదేశ్‌పైనే కావటం గమనార్హం. 2019 కోల్‌కత డే నైట్ టెస్టులో భారత్ ముగ్గురు పేసర్లను ఎంచుకుంది. ఆతిథ్య జట్లు ఎప్పుడూ పరిస్థితులు, బలానికి అనుగుణంగా బౌలింగ్ కూర్పును ఎంచుకుంటాయి. భారత్ విషయంలో స్వదేశంలో తిరుగులేని ఫార్ములా ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లు.

కంగారూపై కన్నేసి..

ముగ్గురు పేసర్లను ఎంచుకోవాలనే తహతహకు మరో కారణం లేకపోలేదు. ఈ ఏడాది ఆఖర్లో రోహిత్‌సేన ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఈసారి ఏకంగా ఐదు టెస్టులు ఆడనుంది. అందుకే, స్వదేశంలో సైతం పిచ్‌లను సైతం పేస్‌కు అనుకూలంగా కోరుకుంటోంది. ఆసీస్‌తో సిరీస్‌కు సన్నాహకంగా ఇక్కడ్నుంచే పేస్ దళానికి పదును పెట్టాలని అనుకుంటోంది. బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌లతో టెస్టు సిరీస్‌లను అందుకు వేదిక చేసుకునే ఆలోచనలో భారత్ ఉంది. సీనియర్ పేసర్ మహ్మద్ షమి పూర్తి ఫిట్‌నెస్ సాధించటంపై దృష్టి సారించాడు. ఆసీస్‌తో సిరీస్‌కు షమి అందుబాటులోకి రానున్నాడు. కానీ బెంచ్‌పై నాణ్యమైన మరో ఇద్దరు పేసర్లు ఉండాలనేది టీమ్ ఇండియా ప్రణాళిక. దీంతో యశ్ దయాల్, ఆకాశ్ దీప్‌లలో ఒకరు అవకాశం దక్కించుకునే వీలుంది.



ఎర్రమట్టి పిచ్

కరొనా మహమ్మారి సమయంలో 2021లో భారత్, ఇంగ్లాండ్ చెన్నైలో రెండు టెస్టులు ఆడాయి. బయో బబుల్ వాతావరణంలో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లాండ్ గెలుపొందగా, రెండో టెస్టులో భారత్ విజయం సాధించింది.
చెపాక్ క్యూరేటర్ రెండు టెస్టులకు భిన్నమైన పిచ్‌లను అందించాడు. తొలి టెస్టుకు ఎర్రమట్టి పిచ్‌ను సిద్ధం చేయగా.. రెండో టెస్టుకు పిచ్‌కు దిగువ లేయర్‌గా మాత్రమే ఎర్రమట్టిని వినియోగించాడు. పిచ్‌కు ఎగువ లేయర్లలో నల్ల మట్టిని వినియోగించాడు. దీంతో పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్నర్ల వేటకు మార్గం సుగమం అయ్యింది. ఎర్రమట్టి పిచ్ ఐదు రోజుల పాటు పగుళ్లు లేకుండా పేసర్లకు అనుకూలిస్తుంది. చెపాక్‌లో తొమ్మిది పిచ్‌లు ఉండగా..అందులో మూడు పిచ్‌లను ముంబయి నుంచి తెప్పించిన ప్రత్యేకమైన ఎర్రమట్టితో తయారు చేశారు. భారత బ్యాటర్లు ఎర్రమట్టి పిచ్‌పై సాధన చేయగా.. బంగ్లాదేశ్ బ్యాటర్లు నల్ల మట్టి పిచ్‌పై ప్రాక్టీస్ చేశారు. భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు వేదిక కాన్పూర్‌లో సహజసిద్ధ ఎర్రమట్టి పిచ్‌లు మాత్రమే ఉన్నాయి. దీంతో భారత్ ముగ్గురు పేసర్లతో ఆడాలని అనుకుంటే చెన్నై టెస్టులోనే సాధ్యపడనుంది.

ఆసియా కింగ్ 'భారత్'

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ వశం

బీజింగ్ (చైనా): హాకీ ఇండియా ఆసియా రారాజుగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడిన ఏకైక ఆసియా జట్టుగా నిలిచిన భారత్.. భారీ అంచనాల నడుమ రికార్డు స్థాయిలో ఐదోసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుంది. సోమవారం ఇక్కడ జరిగిన టైటిల్ పోరులో ఆతిథ్య చైనాపై 1-0తో విజయం సాధించింది. 2023లో నాల్గోసారి ఈ టైటిల్ సాధించిన భారత్.. విజయవంతంగా టైటిల్‌ను నిలబెట్టుకుంది. 2016, 2018లోనూ భారత్ వరుసగా టైటిళ్లను దక్కించుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో ఆఖరు పది నిమిషాల ఆటలో జుగ్‌రాజ్ సింగ్ (51వ నిమిషం) గోల్‌తో భారత్ విజయం సాధించింది. ఆసియా విజేతలకు హాకీ ఇండియా రూ. 3 లక్షల చొప్పున నగదు బహుమతి ప్రకటించింది. సహాయక సిబ్బందికి రూ.1.5 లక్షల నజరానా అందించనుంది.



సిద్ధార్థ్ సూపర్ సెంచరీ

ఎమ్మెస్కే జట్టుపై ఫ్రీడం అకాడమీ గెలుపు

హైదరాబాద్: ఓపెనర్లు సిద్ధార్థ్ 121), సూర్య (86) చెలరేగడంతో ఎమ్మెస్కే రాకెట్స్ జట్టుపై నల్లగొండ ఫ్రీడం అకాడమీ జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఎమ్మెస్కే క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఈ వన్డేలో నక్ష్ (52), హర్ష్ (61) రాణించటంతో తొలుత ఎమ్మెస్కే జట్టు 50 ఓవర్లలో 260/5 పరుగులు చేసింది. ఛేదనలో సూర్య తోడుగా సిద్ధార్థ్ సెంచరీతో చెలరేగగా అదరగొట్టడంతో ఫ్రీడం అకాడమీ జట్టు 43.1 ఓవర్లలోనే 262/1 పరుగులతో లాంఛనం ముగించింది. సిద్ధార్థ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



సాయుధ పోరాట సారథులు-వారసులు కమ్యూనిస్టులే

(మొదటిపేజీ తరువాయి)

పేదలంతా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ఏకమై పోరాటానికి దిగారని గుర్తుచేశారు. దేవరుప్పుల మండలంలోని కడవెండిలో శాంతియుతంగా పోరాడుతున్న పేదలపై గడీల్లో ఉన్న రజాకర్ గూండాలు ఆకస్మికంగా తుపాకులతో దాడి చేశారన్నారు. దాంతో ఆ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న దొడ్డి మల్లయ్య ప్రాణాలు కాపాడటానికి అడ్డు వెళ్లిన ఆయన తమ్ముడు దొడ్డి కొమురయ్య రజాకార్ల తుపాకీ తూటాలకు బలయ్యారని, దాంతో ఆ పోరాటం పతాకస్థాయికి చేరిందని తెలిపారు. ఈ క్రమంలో నైజాం రాచరిక ప్రభుత్వం రద్దు కావాలని, దున్నేవానికి భూమి ఇవ్వాలని, రైతాంగానికి భూమి హక్కులు ఇవ్వాలని, వెట్టిచాకిరీ రద్దు కావాలని, మాతృభాషలోనే విద్యాబోధన జరగాలనే ప్రధాన డిమాండ్లతో ఈ పోరాటం జరిగిందని వివరించారు. ఫలితంగా తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూమి పంచడంతో పాటు 3 వేల గ్రామాల్లో ప్రజారాజ్యం ఏర్పడిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేని బీజేపీ ఈ పోరాటాన్ని ముస్లీం వ్యతిరేక పోరాటంగా వక్రీకరిస్తుందన్నారు. ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించిన షేక్ బందగీ, మగ్దూం, షోయబుల్లాఖాన్ ముస్లిం నేతలేనన్నారు. నిజాంకు తొత్తులైన భూస్వాములు, జాగీర్దార్ల ఆగడాలకు వ్యతిరేకంగా హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా సామాజిక దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని తెలిపారు. ఈ పోరాట స్ఫూర్తితో పార్టీ శ్రేణులు ప్రజా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, 1946 నుండే తెలంగాణ ప్రాంతంలో రైతాంగ సాయుధ పోరాటం ప్రారంభమై కొనసాగిందన్నారు. నిజాంను గద్దెదించాలని కమ్యూనిస్టుల నాయకత్వంలో సాయుధ పోరాటం పతాకస్థాయికి చేరిందన్నారు. ఆ ఉద్యమం అలాగే కొనసాగితే గోల్కొండ ఖిల్లాపై ఎర్రజెండా రెపరెపలాడుతుందన్న ఉద్దేశంతో నాటి ప్రధాని నెహ్రూతో హోంమంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ మంతనాలు జరిపారని తెలిపారు. దాంతో సెప్టెంబర్ 13న భారత సైన్యం తెలంగాణకు వచ్చిందని, 17న నిజాం ఎలాంటి రక్తపాతం లేకుండా కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయాడన్నారు. ఈ క్రమంలో సాయుధ పోరాటం అవసరం లేదని, నెహ్రూకు స్వాగతం పలకాలని పలువురు కమ్యూనిస్టు నేతలు అభిప్రాయ పడగా, పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య తదితరులు కమ్యూనిస్టుల అణచివేతకే సైన్యం వచ్చిందని అభిప్రాయపడ్డారని తెలిపారు. దాంతో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయిందన్నారు. నిజాం లొంగినా భారత సైన్యం ఇక్కడే ఉండి 4 వేల మంది కమ్యూనిస్టులను పొట్టనపెట్టుకున్నారని తెలిపారు. పోరాటం అనంతరం భూ పంపిణీపై నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో ఎన్నో చట్టాలు తెచ్చినా పంపిణీ మాత్రం జరగలేదన్నారు. నెహ్రూ ఆరు కోట్ల ఎకరాలు పంచుతానని చెప్పి ఆరెకరాలు కూడా పంచలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ సీఎంలుగా ఉన్న ఎన్టీఆర్, వైఎస్ఆర్ ఎన్నో మాటలు చెప్పినా, ఆచరణలో అమలు కాలేదని ఆరోపించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఉన్నప్పుడు దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ చేస్తామని చెప్పి పదేండ్లలో కేవలం 16 వేల ఎకరాలు మాత్రమే పంచారని తెలిపారు. పేదలకు భూములు పంచాలంటే కొనుగోలు చేసి ఇవ్వడం కాదని, భూస్వాముల నుంచి లాక్కొని పేదలకు పంచాలన్నారు. భూములను కొని పంచడం సాధ్యం కాదని, పోరాడితేనే భూములను సాధించగలుగుతామని స్పష్టంచేశారు. ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, ఎం. చుక్కయ్య జిల్లా కమిటీ సభ్యులు టి. ఉప్పలయ్య, రాగుల రమేష్, గొడుగు వెంకట్, డి. తిరుపతి, జి.రాములు, కాడబోయిన లింగయ్య, లచ్చుల్ దీప, నాయకులు వాంకుడోతు వీరన్న, మంద సంపత్, డి. భాను నాయక్, నోముల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులు : జూలకంటి రంగారెడ్డి

తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చరిత్రను వక్రీకరిస్తున్నాయని, సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి స్పష్టంచేశారు. నల్లగొండ జిల్లా వేముపల్లి మండకేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి రావులపెంట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రావులపెంటలోని సాయుధ పోరాట అమరవీరుల స్థూపం వద్ద వార చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోరాటంలో అమరులైన పుట్ట మల్లయ్య భార్య లక్ష్మమ్మకు సీనియర్ నాయకులైన చింతకుంట్ల రాములు, గాదే పద్మ, బంగారయ్య లకు శాలువా పూలదండలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా జరిగిన సభలో జూలకంటి మాట్లాడుతూ.. ఆనాడు తెలంగాణ విముక్తి కోసం నిజాం నవాబుకు వ్యతిరేకంగా కులమతాలకతీతంగా ప్రాణాలను పణంగా పెట్టి సామాన్యులతో పాటు కమ్యూనిస్టులు వీరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆనాడు బీజేపీ లేదని, చరిత్ర తెలియని బీజేపీ నాయకులు.. ఈ పోరాటాన్ని ముస్లిం, హిందువుల పోరాటంగా చిత్రీకరించి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిజాం నవాబు పాలనలో కీలకంగా ఉన్న నాయకులకు పదవులు ఇచ్చి కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచివేసేందుకు కుట్రలు చేశారని చెప్పారు. అంతకుముందు సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ యర్రా వెంకన్న 40వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని త్రీ టౌన్ ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో 1946 నుండి 1951 వరకు కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజాసైన్యం ఏర్పడి వీరోచితంగా పోరాటం జరిపిందని చెప్పారు. కామ్రేడ్ యర్రా వెంకన్న తెలంగాణ సాయుధ పోరాటంలో మంచికంటి, చిర్రావూరి నాయకత్వంలో దళాల్లో పనిచేసి జైలుకు వెళ్లి అనేక నిర్బంధాలను ఎదుర్కొని కమ్యూనిస్టు ఉద్యమం కోసం అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. తల్లాడ మండలంలోని కుర్నవల్లిలో ఈలపోలు చిన్న భూషయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి గ్రామంలో సాయుధ పోరాట యోధుడు ఫకీర్ స్తూపం వద్ద రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ నివాళి అర్పించారు. ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో అమరుల స్తూపాలకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్ నివాళి అర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో పార్టీ జెండా ఆవిష్కరించారు. అశ్వారావుపేట మండలం నందిపాడులో పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు మడకం పెద్ద ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ ప్రాంత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన నున్న ముత్తయ్య ఆశయాలకు యువత పనిచేయాలని కోరారు.

పేదలకు భూములు పంచిన ఘనత ఎర్ర జెండాదే : జాన్ వెస్లీ

(మొదటిపేజీ తరువాయి)

దినంగా జరపడం సిగ్గుచేటన్నారు. చరిత్రను వక్రీకరిస్తే ప్రజలే వారికి బుద్ధి చెబుతారని తెలిపారు. సాయుధ పోరాట యోధుల ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పొలంపల్లి గ్రామ శివారులోని కేవల్ కిషన్ సమాధి దగ్గర నిర్వహించిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడారు. తెలంగాణలోని కార్మిక వర్గాన్ని, ప్రజలను ఐక్యం చేసి దొరలపై పోరాడిన చరిత్ర సీపీఐ(ఎం)ది అని అన్నారు.



వెట్టి చాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటమే

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- వరంగల్‌లో విజయవంతమైన శౌర్య యాత్ర
- ఆకట్టుకున్న ప్రజానాట్యమండలి కళాకారుల ఆటపాటలు



నవతెలంగాణ-వరంగల్

నిజాం కాలంలో భూస్వాములు, జాగిర్దారులకు ఆగడాలు, దోపిడీకి వ్యతిరేకంగా సాగిన పోరాటమే.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్‌లో రత్న హోటల్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి దుర్గయ్య అధ్యక్షతన నిర్వహించిన శౌర్య యాత్ర సభలో ఆయన మాట్లాడారు. ముందుగా సాయుధ పోరాటంలో అమరులైన వారి వారసులను సన్మానించారు. అనంతరం నిర్వహించిన కళాకారుల ఆట పాటలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో నర్సిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం లేకుంటే ఇలా కూర్చుండే వాళ్ళం కాదని అన్నారు. బీజేపీ ఈ పోరాట దినోత్సవాన్ని విమోచన దినమని అంటున్నారని, చరిత్ర వక్రీకరించే ఇలాంటి వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. 1946లో జనగామ జిల్లాలోని పాలకుర్తిలో చిట్యాల ఐలమ్మ తన పొలంలో పండించిన పంటను ఇంటికి చేరుకునే క్రమంలో దొర విసునూరు రామచంద్రారెడ్డి పంటను తన ఇంటికి చేర్చాలని చెప్పడంతో ఐలమ్మ తిరగబడింది. అలా దొరలకు వ్యతిరేకంగా జరిగిన అనేక ఘటనలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికాయని గుర్తుచేశారు. రాచరిక పాలన నుంచి ప్రజాపాలనా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించడం గర్వంగా ఉందన్నారు. కానీ తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో రాష్ట్రప్రభుత్వం చొరవ చూపడం లేదని ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాటం మతాలకు వ్యతిరేకంగా జరిగింది కాదని అన్నారు. ఆనాడు రాజాకార్ల అధ్యక్షుడు కాశీం రాజ్వీ అయితే ఉపాధ్యక్షుడు రామచంద్రా రెడ్డి అని తెలిపారు. వీరి ఆగడాలకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని స్పష్టంచేశారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మెన్ ప్రొఫెసర్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆకారం బిగించిన పిడికిలి అని అన్నారు. గొప్ప పోరాట వారసత్వాన్ని చరిత్ర విస్మరిస్తే.. నాగరికత ముందుకు పోదని తెలిపారు. బాంచన్ కాల్మొక్త అనే పరిస్థితి నుంచి దొరలను పారదోలిన చరిత్ర తెలంగాణకు ఉందని అన్నారు. చాలా ఏండ్ల తర్వాత అద్భుత కళారూపాలను చూస్తున్నానని, ప్రదర్శన అప్పటి ఆ న్యాయం పై విముక్తి జరిగిన పోరాటాన్ని కండ్లకు కట్టినట్టు చూపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రంగయ్య, మాజీ పీఎస్‌ఎం నాయకులు సాగర్, నాయకులు కర్ర యాదవ రెడ్డి బెల్లం మురళి మధు, ఆరూరి కుమార్, నలిగంటి రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఎగుమతుల నేల చూపులు



- పెరిగిన దిగుమతులు
- 10 నెలల గరిష్టానికి వాణిజ్య లోటు

న్యూఢిల్లీ : భారత్ స్వయం సమృద్ధి సాధిస్తోందన్న మోడీ ప్రభుత్వ వర్గాల ప్రకటనలకు.. ఆచరణకు తీవ్ర అంతరం ఉంది. దేశ ఎగుమతులు నేల చూపులు చూస్తోంటే.. మరోవైపు దిగుమతులు ఎగిసిపడటమే ఇందుకు నిదర్శనం. ప్రపంచ మార్కెట్‌లో భారత ఉత్పత్తులకు డిమాండ్ సన్నగిల్లడంతో ప్రస్తుత ఏడాది ఆగస్టులో ఎగుమతులు 9.32 శాతం పతనమై 34.71 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. కాగా.. సరుకుల దిగుమతులు మాత్రం 3.3 శాతం పెరిగి 64.36 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. మంగళవారం కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించిన గణంకాల ప్రకారం.. ఎగుమతులు తగ్గడం.. దిగుమతుల పెరగడంతో ఆగస్టులో దేశ వాణిజ్య లోటు 29.65 బిలియన్ డాలర్లకు పెరిగి.. 10 మాసాల గరిష్ట స్థాయికి చేరింది. దీంతో వరుసగా రెండో మాసంలోనూ అత్యధిక వాణిజ్య లోటు చోటు చేసుకున్నట్లయ్యింది. ఇది అధిక విదేశీ చెల్లింపులకు దారి తీయనుంది.

పసిడి దిగుమతులు రెట్టింపు..

"గడిచిన ఆగస్టులో బంగారం దిగుమతులు రెట్టింపై 10.06 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. 2023 ఇదే మాసంలో 4.9 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. 2021 మార్చి తర్వాత తొలిసారి బంగారం దిగుమతులు అమాంతం పెరిగాయి. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు వాణిజ్య లోటు పెద్ద విషయం కాదు. అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాలను అగ్ర దేశాలతో పోల్చలేము. విదేశీ మారకం సమస్యలేమీ లేము. ఇది పెద్ద విషయమేమీ కాదు." అని వాణిజ్య శాఖ సెక్రెటరీ సునీల్ భర్త్వల్ పేర్కొన్నారు.

"ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి మేఘాలు నెలకొన్నప్పటికీ రత్నాలు, ఆభరణాలు, పెట్రోలియంయేతర భారత ఎగుమతులు మెరుగ్గానే ఉన్నాయి. ఇది కొంత ఉపశమనం కలిగిస్తోంది. పెట్రోలియం ధరలలో క్షీణత చమురు దిగుమతి బిల్లుకు మంచిది. ఇది ఆగస్టులో 11.01 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. అయితే.. ఇది పెట్రోలియం ఎగుమతుల విలువను దెబ్బతీస్తుంది" అని సునీల్ భర్త్వల్ పేర్కొన్నారు.

ఇన్ఫోసిస్‌తో ఎల్ఐసి ఒప్పందం

- నూతన డిజిటల్ వేదిక ఏర్పాటు లక్ష్యం



ముంబయి : టెక్ కంపెనీ ఇన్ఫోసిస్‌తో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) కీలక ఒప్పందం కుదుర్చుకుంది. కాలంతో పాటు టెక్నాలజీని అందిపుచ్చుకోవడాని.. మరింత మెరుగైన డిజిటల్ వేదికను అందుబాటులోకి తేవాలని నిర్దేశించుకుంది. డిజిటల్ వినూత్నత, విలువ పరంగా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ చొరవకు నాయకత్వం వహించడానికి ఎల్ఐసికి సహకారం అందించనున్నట్లు ఇన్ఫోసిస్ పేర్కొంది. త్వరలోనే తదుపరితరం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను రూపొందించడాన్ని ప్రారంభిస్తుందని తెలిపింది. ఇది ఎల్ఐసి ఖాతాదారులు, ఏజెంట్లు, ఉద్యోగులకు ఓమ్నిచానెల్ ఎంగేజ్‌మెంట్, డేటా ఆధారిత హైపర్ పర్సనలైజ్డ్ అనుభవాలను అందించనుంది. భారీ స్థాయి డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులను అమలు చేయడంలో దాని విస్తృత అనుభవం, బ్యాంకింగ్, ఫైనాన్షియల్.. ఇన్సూరెన్స్ రంగాలలో మరింత నైపుణ్యం పెంచుకోవాలని ఎల్ఐసి భావించింది. కృత్రిమ మేధా (ఎఐ) క్లౌడ్ నైపుణ్యాలను ఎల్ఐసిలో కూడా ప్రవేశపెట్టనున్నామని ఇన్ఫోసిస్ సిఇఒ, ఎండి సలీల్ పరేఖ్ తెలిపారు. ఇది ఎల్ఐసి అభివృద్ధికి ఎంతగానో దోహదం చేయనుందన్నారు. దీంతో పాలసీదారులు, ఏజెంట్లు, ఉద్యోగులు అధునిక టెక్నాలజీ అనుభవాలను పొందనున్నారని ఎల్ఐసి ఎండి, సిఇఒ సిద్ధార్థ మోహంతి పేర్కొన్నారు.

మారుతి సుజుకి ఫ్రాంక్స్ టర్బో క్యాంపెయిన్


న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ ఇటీవల ఆవిష్కరించిన ఫ్రాంక్స్ టర్బో విక్రయాల కోసం ప్రత్యేక క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. పవర్‌ఫుల్ ఇంజిన్, స్టన్నింగ్ డిజైన్ కలిగిన ఈ కారు థ్రిల్లింగ్ అనుభవాన్ని ఇవ్వనుందని ఆ కంపెనీ మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పర్థో బెనర్జీ పేర్కొన్నారు. 1.0 లీటర్ కె సిరీస్ పెట్రోల్ ఇంజిన్‌తో ఆవిష్కరించిన లీటర్‌కు 21.5 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందన్నారు.

నిధుల సమీకరణలో మెర్క్యూరీ ఇవి టెక్

హైదరాబాద్ : విద్యుత్ వాహన రంగంలో మెర్క్యూరీ ఇవి టెక్ లిమిటెడ్ రూ.480 కోట్ల నిధులు సమీకరించనున్నట్లు వెల్లడించింది. కన్వర్టిబుల్ ఈక్విటీ వారెంట్లు లేదా ప్రిఫరెన్షియల్ బేసిస్‌లో ఈక్విటీ షేర్ల జారీ ద్వారా నిధుల సమీకరణకు తమ బోర్డు ఆమోదం తెలిపిందని ఆ కంపెనీ ప్రకటించింది. దీనికి వాటాదారులు, ఇతర చట్టబద్ధమైన నియంత్రణ సంస్థల ఆమోదం లభించాల్సి ఉంది. ఈక్విటీ షేర్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా 118.06 కోట్లు, కన్వర్టిబుల్ వారెంట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా రూ.362.25 కోట్లు చొప్పున సమీకరించనున్నట్లు తెలిపింది.

వల్లెంకుంటలో ఘనంగా విశ్వకర్మ జయంతి

- శ్రీ గాయత్రీ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి కార్యక్రమం
- వాస్తు శిల్పి, ప్రతిమశాస్త్ర పితామహుడు విరాట్ : శ్రీ గాయత్రీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నగునూరి రాజారాం



నవతెలంగాణ-మల్హార్ రావు

వాస్తు శిల్పి, ప్రతిమశాస్త్ర పితామహుడు విరాట్ శ్రీ గాయత్రీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నగునూరి రాజారాం అని అన్నారు. మంగళవారం శ్రీ గాయత్రీ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వల్లెంకుంట ఆంజేయస్వామి దేవాలయం లో ఏర్పాటు చేసిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రయోజనకరంగా వాస్తు ప్రకారం పట్టణాలు, భవనాల నిర్మాణాలు చేపట్టి అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు, మన సంస్కృతిలో విగ్రహాల రూపకల్పనపై భావితరాలకు దిశానిర్దేశం అందించిన మహనీయుడు విరాట్ విశ్వకర్మ అని అన్నారు. , ఓదెల సాంబయ్య, ఓదెల సమ్మయ్య, ఓదెల తిరుపతి, మియ్యపురం సాదానందం, బోనాల నగేష్ , నర్సింహాచారి , ఆలయాకమిటి చైర్మన్ బాపు రావు, రజక సంఘం నాయకులు పావిరాళా లక్ష్మణ్, పావిరాల రాము,తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పే ఫైనల్

చెప్పినట్టుగానే ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇకపై ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టబోతున్నారు. గతంలో మాదిరిగానే మరోసారి వారి ఆశీస్సులు తనకు లభిస్తాయని విశ్వసిస్తున్నారు. ప్రజలే అంతిమ నిర్ణేతలని భావిస్తున్న కేజ్రీవాల్ తనపై పడిన అవినీతి మరకను తుడిచేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పనిలో పనిగా తన ప్రతిష్టను దెబ్బతీస్తున్న బీజేపీ దుష్ట పన్నాగాలను ఎండగట్టి రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తు చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు. తాను నిజాయితీపరుడినని నమ్మితేనే ఓటు వేసి ముఖ్యమంత్రి కుర్చీపై కూర్చోబెట్టాలని ప్రజలను కోరబోతున్నారు.



- బీజేపీ దాడిని తిప్పికొట్టడం...
- నిజాయితీ నిరూపించుకోవడం
- ఇదే కేజ్రీవాల్ ద్విముఖ వ్యూహం
- దశాబ్ద కాలంలో రెండోసారి సీఎం పదవికి రాజీనామా

న్యూఢిల్లీ : ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం ఇది రెండోసారి. పదేండ్ల క్రితం... 2014 ఫిబ్రవరిలో కూడా ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పుడు ఆప్ ప్రభుత్వం కేవలం 49 రోజులు మాత్రమే అధికారంలో ఉంది. మద్యం పాలసీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన కొద్ది రోజులకే కేజ్రీవాల్ ఇప్పుడు మరోసారి పదవిని త్యజించారు. ఢిల్లీ శాసనసభకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆప్ చేతిలో ఇప్పటికే రెండుసార్లు భంగపడిన బీజేపీ, ఈసారి ఎలాగైనా అధికారాన్ని కైవసం చేసుకోవాలని ఎత్తుగడలు పన్నుతోంది. అందులో భాగంగానే కేజ్రీవాల్‌పై పలు అవినీతి ఆరోపణలు చేసింది. కేజ్రీని అవినీతిపరుడిగా చిత్రీకరించి ఆయన ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తోంది.

కేజ్రీవాల్‌కు ఈడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తు సంస్థ పక్షపాత పూరితంగా వ్యవహరిస్తోందని అక్షింతలు వేసింది. సుప్రీంకోర్టు కూడా ఆయనకు బెయిల్ ఇస్తూ పంజరంలో చిలుకలా వ్యవహరించవద్దని సీబీఐకి చురక వేసింది. 'కేజ్రీవాల్ డబ్బు సంపాదించడానికి రాజకీయాల్లోకి రాలేదు. ఆయన గౌరవం పొందారు' అని ఆప్ ప్రధాన జాతీయ సలహాదారు ప్రియాంక కక్కర్ వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ ఇమేజ్‌ను బీజేపీ దెబ్బతీస్తోందని, అందుకే తిరిగి ఢిల్లీ ప్రజల వద్దకు వెళ్లి తాను నిజాయితీపరుడిని అయితేనే తిరిగి ఎన్నుకోండని కోరతారని తెలిపారు.

నిజాయితీపరుడినని భావిస్తేనే...

సుప్రీంకోర్టు నుంచి బెయిల్ పొందిన తర్వాత కేజ్రీవాల్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ 'సుప్రీంకోర్టు విధించిన ఆంక్షల కారణంగా మనం పని చేయలేమని కొందరు వ్యక్తులు భావిస్తున్నారు. మనపై ఆంక్షలు పెట్టడానికి అందివచ్చిన ఏ అవకాశాన్నీ వారు వదలడం లేదు. నేను నిజాయితీపరుడినని మీరు అనుకుంటే పెద్ద సంఖ్యలో నాకు ఓటు వేయండి. ఎన్నికైన తర్వాతే ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటాను' అని చెప్పారు. ఎన్నికలు ఫిబ్రవరిలో జరగాల్సి ఉన్నప్పటికీ మహారాష్ట్రతో పాటే నవంబరులో నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ సోమవారం సమావేశమై తదుపరి ముఖ్యమంత్రిని ఎన్నుకునే విషయంపై చర్చించింది. మంగళవారం జరిగిన ఆప్ శాసనసభాపక్షం సమావేశంలో విద్యాశాఖ మంత్రి అతిషిని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు.

ఒకే దెబ్బకు రెండు పిట్టలు

అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిన తనకు, ఆప్‌కు కళంకాన్ని ఆపాదించి పార్టీ నేతలను జైలుకు పంపారని కేజ్రీవాల్ ప్రజలకు వివరించబోతున్నారు. రాబోయే శాసనసభ ఎన్నికలను ఆయన రిఫరెండంగా భావిస్తున్నారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం వెనుక కేజ్రీవాల్ ద్విముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఒక వైపు బీజేపీ దాడిని తిప్పికొట్టడంతో పాటు మరోవైపు ఆ పార్టీ ఆరోపణలతో దెబ్బతిన్న తన ఇమేజ్‌ను పునరుద్ధరించుకోవడమే లక్ష్యంగా కేజ్రీవాల్ అడుగులు వేస్తున్నారు.

ఇక ప్రజాక్షేత్రంలో...

జైలులో ఉన్నప్పుడు కేజ్రీవాల్ రాజీనామా చేయాలని బీజేపీ పదే పదే డిమాండ్ చేసింది. అయినప్పటికీ ఆయన పదవిలో కొనసాగారు. జైలులో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయని ఆప్ అభిప్రాయపడింది. జైలులో ఉన్నప్పుడేమో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు ఆ పని చేస్తే అదో స్టంట్ అంటున్నారని కక్కర్ మండిపడ్డారు. మద్యం పాలసీ కేసులో అరెస్టయిన మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఇదివరకే బెయిల్ పొందారు. రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌కు కూడా బెయిల్ వచ్చింది. ఇప్పుడు కేజ్రీవాల్ కూడా బయటకు రావడంతో ఆప్ నేతలంతా ప్రజల వద్దకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు.

అగ్నిపరీక్షే

జన్ లోక్‌పాల్ బిల్లును ప్రవేశపెట్టలేకపోవడంతో 2014 ఫిబ్రవరిలో కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పుడు ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించారు. 2015లో జరిగిన ఎన్నికల్లో ఆప్ అఖండ విజయం సాధించింది. శాసనసభలోని మొత్తం 70 స్థానాలలో ఏకంగా 67 సీట్లను గెలుచుకుంది. బీజేపీని చీపిరితో ఊడ్చిపారేసి కేవలం మూడు స్థానాలకే పరిమితం చేసింది. 2020లో జరిగిన ఎన్నికల్లోనూ ఆప్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టి 62 స్థానాలు అందించారు. బీజేపీకి మరోసారి నిరాశే ఎదురైంది. ఆ పార్టీ ఎనిమిది స్థానాలు మాత్రమే గెలుచుకోగలిగింది. ఇప్పుడు కేజ్రీవాల్, ఆయన ప్రభుత్వ పనితీరుపై ప్రజలు మరోసారి తీర్పు ఇవ్వబోతున్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌కు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. మొత్తం ఏడు స్థానాలనూ బీజేపీ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో రాబోయే శాసనసభ ఎన్నికలు ఆప్‌కు అగ్నిపరీక్షేనని చెప్పాలి.

బీజేపీని ఊరిస్తున్న అధికార పీఠం

బీజేపీ విషయానికి వస్తే.. మూడు దశాబ్దాలుగా రాజధానిలో ఆ పార్టీకి భంగపాటు తప్పడం లేదు. అధికారం అందని ద్రాక్షగానే ఊరిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయాలు సాధిస్తున్నప్పటికీ శాసనసభ వద్దకు వచ్చేసరికి ప్రజలు ఆప్‌కే పట్టం కడుతున్నారు. తనపై పడిన అవినీతి మరకను చెరిపేసుకోవడానికి శాసనసభ ఎన్నికలను కేజ్రీవాల్ అవకాశంగా తీసుకుంటున్నారు. ముందుగానే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేయడం ద్వారా తన విశ్వసనీయతను పునరుద్ధరించుకోవడానికి ఆయన మరోసారి ప్రజల వైపు చూస్తున్నారు.

గాజాలో 11 నెలల్లో 11వేల మంది విద్యార్థులు మృతి



గాజా : గత 11మాసాలకు పైగా గాజాలో, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న ఊచకోతలో 11వేల మందికి పైగా విద్యార్థులు మరణించారని పాలస్తీనా విద్యా మంత్రిత్వశాఖ పేర్కొంది. ఉత్తర గాజాలో అనేక స్కూళ్లు నేలమట్టమయ్యాయి. వీటిలో ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తున్న పాఠశాలలు అనేకం వున్నాయి. ఆ ప్రాంతంలో 9 స్కూళ్ళు పూర్తిగా ధ్వంసం కాగా, మరో మూడు స్కూళ్ళు పాక్షికంగా ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. ఈ స్కూళ్ళలో ఎక్కువగా శరణార్థులు తలదాచుకున్నారు. దాదాపు 600కి పైగా నిర్వాసిత కుటుంబాలు ఈ స్కూళ్ళలో జీవిస్తున్నాయి. సెంట్రల్ గాజాలోని బురెజి శరణార్థ శిబిరంపై ఇజ్రాయిల్ బలగాలు బాంబు దాడి జరపడంతో ఏడుగురు మరణించగా, అనేకమంది శిథిలాల్లో చిక్కుకుపోయారని సహాయక కార్యకర్తలు తెలిపారు. వెస్ట్ బ్యాంక్‌లో 30మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈజిప్ట్‌లో మూడు రోజుల పాటు పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో ఆయన గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు జరుగుతున్న కృషిని చర్చించనున్నారు. ఇప్పటివరకు గాజాలో 41,252మంది మరణించగా, 95,497మంది గాయపడ్డారు. గాజాలో కొనసాగుతున్న మారణహోమాన్ని అంతర్జాతీయ మీడియా దృష్టికి రానివ్వకుండా పూర్తిగా బహిష్కరించడంపై జర్మనీ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇటీవలి చరిత్రలో ఇలాంటి ఉదంతాలు అనూహ్యమైనవని పేర్కొంది. గాజా నుండి రిపోర్టింగ్ చేయడానికి జర్మన్ మీడియాను అనుమతించాల్సిందిగాక ఓరింది. ఈ మేరకు పలు వార్తా పత్రికలు, సంస్థలు, బ్రాడ్‌కాస్టర్లు బహిరంగ లేఖ రాశాయి. రాఫా సరిహద్దు గుండా గాజాలోకి వెళ్లడానికి అనుమతించాల్సిందిగా ఈజిప్ట్‌ను కూడా వారు కోరారు.

బెంబేలెత్తిస్తున్న బియ్యం ధరలు

సన్న రకం క్వింటాలు రూ.5,300 పైనే ● రెండు వారాల్లో రూ.200 పెరుగుదల



కృష్ణా : మార్కెట్లో బియ్యం ధర చూస్తే గుండె గుభిల్లుమంటోంది. సన్న బియ్యం ధర వారం రోజుల వ్యవధిలోనే అమాంతం పెరిగి క్వింటాలు ధర రూ.5,300కు చేరింది. ఆర్ఎన్ఆర్ ధాన్యం మార్కెట్లో అవసరమైన స్థాయిలో అందుబాటులో లేకపోవడం, వరదలు, భారీ వర్షాలకు వరి పంటకు నష్టం వాటిల్లిందనే సాకుతో హోల్‌సేల్ మార్కెట్లో ధరలు పెంచారని చిల్లర వర్తకులు చెబుతున్నారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలులేని అన్ సీజన్లోనూ గతంలో ఎన్నడూ లేనివిధంగా బియ్యం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మేలో కిలో బిపిటి బియ్యం రూ.45, ఆర్ఎన్ఆర్ రూ.46, హెచ్ఎంటి రూ.54లకు విక్రయించారు. మేతో పోలిస్తే బిపిటి, ఆర్ఎన్ఆర్ బియ్యం కిలో రూ.7, హెచ్ఎంటి రూ.14 పెరిగింది. సెప్టెంబర్ ఒకటో తేదీన బిపిటి 5204 (కర్నూలు సోనా, సాంబ మసూరి) క్వింటాలు బియ్యం ధర మార్కెట్లో రూ.5,100 ఉంది. ఏడో తేదీకి రూ.5,200కు, 15వ తేదీకి రూ.5,300కు చేరింది. ఆర్ఎన్ఆర్ రూ.5,300 నుంచి రూ.5,500కు పెరిగింది. హెచ్ఎంటి బియ్యాన్ని ఆగస్టు మొదటి వారంలో రిటైల్‌గా రూ.6,200కు విక్రయించారు. తాజాగా రూ.6,800 వరకు విక్రయిస్తున్నారు. ధరలు పెరగడం ద్వారా వ్యాపారులకు మాత్రమే ప్రయోజనం చేకూరింది. పెరిగిన ధర రైతులకు దక్కడం లేదు. గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారు. ఆకాశాన్ని అంటుతున్న ధరల వల్ల వినియోగదారులపై మోయలేని భారం పడుతోంది. కేంద్రప్రభుత్వం 25 కిలోలలోపు బియ్యం సంచులపై జిఎస్‌టి విధించింది. ఈ నేపథ్యంలో మార్కెట్లో ఎక్కువగా 26 కిలోల బస్తాలను విక్రయిస్తున్నారు. చిన్న కుటుంబాలు గాయత్రి, లలిత తదితర కంపెనీల పది కిలోల సంచులకు కొనుగోలు చేస్తున్నాయి. అదనంగా రూ.35 జిఎస్‌టి చెల్లించాల్సి వస్తోంది.

కుటుంబాలపై భారం

కృష్ణా జిల్లాలో సగటున 3.50 లక్షల కుటుంబాలు సన్నబియ్యం వినియోగిస్తున్నాయి. రేషన్ దుకాణాల్లో ఇస్తున్న బియ్యాన్ని కొందరు దోసెలు, బియ్యపు పిండి వంటకాలకు వినియోగిస్తున్నారు. చుట్టాలొచ్చినప్పుడు లేదా పండగలు పబ్బాలు, ఫంక్షన్లకు మాత్రమే సన్నబియ్యాన్ని సామాన్యులు వాడుతుంటారు. వాటి ధరలు వీరికి అందుబాటులో లేవు. సెప్టెంబర్ మొదటి వారంతో పోలిస్తే పెరిగిన ధరలతో వినియోగదారులపై రూ.1.80 కోట్ల భారం అదనంగా పడింది.

బిపిటి ధాన్యానికి డిమాండ్

కృష్ణా జిల్లా కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, గూడూరు తదితర మండలాల్లో బిపిటి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో బిపిటిలను సేకరించడానికి అవకాశం కల్పించలేదు. ఈ తరహా ధాన్యానికి మద్దతు ధర కన్నా ఎక్కువగా ధర పలుకుతుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు పంట పెట్టుబడి అవసరాలకు ఏప్రిల్, మేల్లో ఎక్కువమంది రైతులు బిపిటి ధాన్యం విక్రయించుకుంటారు. 75 కిలోల బస్తాను వ్యాపారులు సగటున రూ.1800కు కొనుగోలు చేశారు. మార్కెట్ యార్డు గొడౌన్లలో వ్యాపారులు లారీల కొద్దీ నిల్వ ఉంచారు. బిపిటి ధాన్యం నిల్వలు రైతుల దగ్గర పెద్దగా లేవు. తాజాగా బస్తా రూ.2,300కు ధర చేరుకుంది. రైతులకు ఒక్కో బస్తాపై సగటున రూ.500 వరకు నష్టపోయారు.

విశాఖ స్టీల్ ప్రయివేటుపరం కానివ్వం

- వేల కోట్లు నష్టాలు వస్తే ఎవరూ ఆదుకోరు: ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు



అమరావతి : విశాఖ స్టీలు ప్లాంటును ఎట్టి పరిస్థితుల్లో ప్రయివేటుపరం కాకుండా కాపాడుకుంటామని, ఉక్కుఫ్యాక్టరీ రాష్ట్రానికి సెంటిమెంటని, వాజ్‌పేయి హయాంలోనూ తాము అదనపు నిధులు ఇచ్చి ఆదుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన విశాఖ స్టీలుపై మాట్లాడారు. ఇటీవల కేంద్ర ఉక్కుశాఖ మంత్రితో దీనిపై సమావేశం జరిగిందని తెలిపారు. కొంత డబ్బు విడుదల చేసి ప్లాంటును నిర్వహించేం దుకు కేంద్ర స్టీలు మంత్రిత్వశాఖ ముందుకు పోతోందని తెలిపారు. శాశ్వతంగా దాన్ని లాభాల బాట పట్టించు కోవాల్సిన బాధ్యత రాష్ట్రంపై ఉందని, దీన్ని కూడా ఉద్యోగులు, ట్రేడ్ యూనియన్ నాయకులు ఆలోచిం చాలని సూచించారు. అదే సమయంలో దేశంలో ప్రయివేటు ప్లాంట్లు బాగున్నాయని, మంచి ప్లాంటయిన విశాఖ స్టీలు మాత్రం నష్టాల పాలవుతోందని, ఇలా ఎందుకు జరుగుతుందో యాజమాన్యం ఆలోచించు కోవాలని అన్నారు. ముఖ్యమంత్రిగా తాను కూడా దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. అదే సమయంలో వేలకోట్లు నష్టం వస్తే ఎవరో ఒకరు ఆదుకుంటారంటే అది అవివేకమని తెలిపారు. లాభాల బాట పట్టించేందుకు కష్టపడాలని, తెలివి తేటలు ఉపయోగించాలని అన్నారు. "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" నినాదాన్ని నిలబెట్టాలంటే అందరిలోనూ మార్పు రావాలని తెలిపారు. ఆ ప్లాంటు రాష్ట్రంలోనే పెద్దదని, ఒక సెంటిమెంటని ముఖ్యమంత్రి అన్నారు. అలాగని ప్రతిరోజూ సెంటిమెంటు అని కూర్చుంటే సహకరించే వారు ఉండరని, ఒకటి, రెండుసార్లు అంటే ఫర్వాలేదని పేర్కొన్నారు. అనునిత్యం అదే మాట్లాడటం కరెక్టు కాదనీ సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాంటును ప్రయివేటుపరం కాకుండా కాపాడుకునేందుకు సర్వవిధాలా ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా ప్రయివేటుపరం కాకుండా ఆపాలని కేంద్రాన్ని కోరని వైసిపి నాయకులు ఇప్పుడు రెచ్చగొట్టి శవాల ముందు చలికాచుకునే పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంటు రక్షణ కోసం తాను ప్రతిపక్షంలో ఉండగా ఢిల్లీ వెళితూ రావాలని కోరితే ఎవరూ స్పందించలేదని తెలిపారు. ఏమి చెప్పినా ప్రజలు నమ్ముతారనే ఆలోచనతో వైసిపి నాయకులు ఉన్నారని, అటువంటి రోజులు పోయాయని తెలిపారు. మొన్నటి వరకూ అధికారంలో ఉండి ప్రజలను మభ్య పెట్టారని పేర్కొన్నారు. విశాఖపట్నం స్టీలు ప్లాంటును బాధ్యతో ఎలా కాపాడుకోవాలో అలా కాపాడుకుం టామని తెలిపారు. విశాఖ తెలుగుదేశం పార్టీకి ఎన్‌డిఎ కి గట్టి కేంద్రమనీ అన్నారు. అటువంటి చోట్ల ప్లాంటును కాపాడుకోవడం తమ బాధ్యతని వివరించారు.

ఆస్తులు ప్రకటించారు... కానీ డిక్లరేషన్లు లేవు

- 'స్వచ్ఛందం' అనే వెసులుబాటే కారణం
- 33 మంది జడ్జిల్లో సమాచారమిచ్చింది 27మందే

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టులో ప్రస్తుతం 33 మంది న్యాయమూర్తులు ఉండగా వారిలో 27 మంది తమ ఆస్తులు, అప్పుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి అందజేశారు. ఆస్తుల వివరాలు వెల్లడించిన న్యాయమూర్తుల పేర్లను సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైటులో విడుదల చేశారు. అయితే వారి డిక్లరేషన్లు మాత్రం అందులో లేవు. సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల్లో పనిచేస్తున్న న్యాయమూర్తులు తమ ఆస్తులు, అప్పులను విధిగా వెల్లడించేలా ఓ చట్టం తీసుకురావాలని ఏడాది క్రితం సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, న్యాయం-చట్టంపై ఏర్పడిన పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసింది.

సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైటును గత నెలలో అప్‌డేట్ చేశారు. అందులో ఆస్తులను వెల్లడించిన న్యాయమూర్తుల సమాచారం ఉంది. కొన్ని నెలల క్రితం వరకూ సుప్రీంకోర్టుకు చెందిన 55 మంది మాజీ న్యాయమూర్తుల డిక్లరేషన్లు పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్నాయి. అయితే సిట్టింగ్ న్యాయమూర్తులవి మాత్రం కన్పించలేదు. దీనిపై 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక సుప్రీంకోర్టు అధికారిని సంప్రదించగా వెబ్‌సైటులో ఆగస్టు 7న మార్పులు చేశారని తెలిపారు. 'పదవి నుంచి వైదొలిగిన వారి పేర్లను తొలగించడం జరిగింది. ఎవరైనా న్యాయమూర్తి బాధ్యతలు స్వీకరిస్తే ఆస్తుల డిక్లరేషన్ తీసుకొని దానికి సంబంధించిన రికార్డును సుప్రీంకోర్టు కార్యాలయం నిర్వహిస్తుంది. అయితే వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం అనేది పూర్తిగా స్వచ్ఛందంగా జరిగే పని' అని వివరించారు.

ఆస్తుల ప్రకటించింది వీరే

సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ప్రకారం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, సూర్యకాంత్, హృషీకేశ్ రాయ్, అభయ్ ఎస్ ఓకా, విక్రమ్ నాథ్, జేకే మహేశ్వరి, బీవీ నాగరత్న, ఎంఎం సుంద్రేష్, బేలా ఎం త్రివేది, పీఎస్ నరసింహ, సుధాన్షు ధూలియా, జేబీ పార్దివాలా, దీపాంకర్ దత్తా, పంకజ్ మిట్టల్, సంజయ్ కరోల్, సంజయ్ కుమార్, అహ్సనుద్దీన్ అమానుల్లా, మనోజ్ మిశ్రా, అరవింద్ కుమార్, కేవీ విశ్వనాథన్, ఉజ్జల్ భూయాన్, ఎస్.వెంకటనారాయణ భట్టి, అగస్టీన్ జార్జ్ మసీ, సందీప్ మెహతా, ప్రసన్న బలచంద్ర వరాలే తమ ఆస్తులు ప్రకటించారు.

స్వచ్ఛందమే...

2022-24 కాలానికి ఆస్తులు ప్రకటించని న్యాయమూర్తుల వివరాలు అందజేయాలంటూ గతేడాది ఆగస్టు 28న 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేసింది. అయితే ఈ సమాచారానికి చట్టం కింద మినహాయింపు ఉన్నదని సమాధానం వచ్చింది. దీనిపై ఫస్ట్ అప్పీలెట్ అథారిటీలో అప్పీలు చేయగా సమాధానం సరిగానే ఉన్నదని రూలింగ్ ఇచ్చింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు స్వచ్ఛందంగా తమ ఆస్తుల వివరాలను కోర్టు వెబ్‌సైటులో ప్రకటించవచ్చునని 2009 సెప్టెంబర్ 9న ఫుల్ బెంచ్ రూలింగ్ ఇచ్చింది. దాని ప్రకారం కొందరు న్యాయమూర్తులు స్వచ్ఛందంగా తమ ఆస్తుల వివరాలను వెబ్‌సైటులో ఉంచారు. అయితే 2018 మార్చి 31 తర్వాత ఈ సంప్రదాయానికి స్వస్తి చెప్పారు.

సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

ఎంపీలు, ఎమ్మెల్యేలు, అఖిల భారత సర్వీసు అధికారులు, సుప్రీంకోర్టు-హైకోర్టుల న్యాయమూర్తులు తమ ఆస్తులను విధిగా బహిర్గతం చేయాలని గతేడాది డిసెంబర్ 11న బీజేపీ ఎంపీ, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ దివంగత సుశీల్ కుమార్ మోడీ చెప్పారు. 2019 నవంబర్ 13న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఇక్కడ ప్రస్తావించాల్సి ఉంది.

జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఆ బెంచ్‌లో ఎన్‌వీ రమణ, డీవై చంద్రచూడ్, దీపక్ గుప్తా, సంజయ్ ఖన్నా సభ్యులు. 'ఆర్‌టీఐ చట్టం ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం పబ్లిక్ అథారిటీ, న్యాయ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి ఆ కార్యాలయాన్ని ఓ సాధనంగా ఉపయోగించుకోవడాన్ని అనుమతించకూడదు' అని సుప్రీంకోర్టు బెంచ్ స్పష్టం చేసింది.

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 1,031 మంది పోటీ

చండీగఢ్ : అక్టోబర్ 5న జరిగే హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 1,031 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 1,559 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే పరిశీలన తరువాత వీటిలో 1,221 మంది నామినేషన్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయని అధికారులు గుర్తించారు. అయితే సోమవారం ఉపసంహరణ గడువు పూర్తయ్యే నాటికి వీరిలో 190 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. హరాన్యాలో ఈ నెల 5 నుంచి 12 వరకూ నామినేషన్లు దాఖలు చేయడానికి గడువు ఉండగా, 13వ తేదీన నామినేషన్లు పరిశీలించారు.